తెలంగాణ స్వరాష్ట్ర సమరయోధ పత్రిక

# జనంసాక్షి

www.janamsakshi.org

కరీంనగర్ - నిజామాబాద్

రాజన్న సిరిసిల్ల | కామారెడ్డి

పెద్దపల్లి | జగిత్యాల

బుధవారం

12 ఆగస్ట్ 2026




## సీఎంఆర్ఎఫ్ పథకం నిరుపేదలకు వరం

**ఎల్లారెడ్డిపేట, ఆగస్టు 11, (జనంసాక్షి) :** ముఖ్యమంత్రి సహాయనిధి పథకం నిరుపేద ప్రజలకు వరంలాంటిదని కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షులు చెన్నిబాబు అన్నారు. ఎల్లారెడ్డిపేట మండల కేంద్రానికి చెందిన ఉజుమా అంజుమ్‌కు 30వేల రూపాయల సీఎంఆర్ఎఫ్ చెక్కును మంగళవారం కాంగ్రెస్ పార్టీ నాయకులు అందజేశారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షులు చెన్నిబాబు మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ముఖ్యమంత్రి సహాయనిధి నుంచి సంవత్సరానికి సుమారు రూ. 1000 కోట్లకు పైన నిధులు మంజూరు చేస్తున్నట్లు తెలిపారు. ఇది నిరపేదలకు ఆసరగా నిలస్తుందని అన్నారు. పార్టీలకతీతంగా సీఎంఆర్ఎఫ్ పథకం ఇవ్వడం హర్షించదగిన విషయమని పేర్కొన్నారు. ఆపదలో ఉన్న వారిని ఆదుకునేందుకు నిధులు విడుదల చేసినందుకు ప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి వంగ గిరిధర్‌రెడ్డి, ఏఎంసి వైస్ ప్రెసిడెంట్ గుండాడి రాంరెడ్డి, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు రాములు, బండారి బాల్‌రెడ్డి, గంట బుచ్చాగౌడ్, ద్యాగం లక్ష్మి నారాయణ, మిర్యాలకర్ చందు, పందిర్ల శ్రీనివాస్‌గౌడ్, గంట వెంకటేష్‌గౌడ్, బింగి మల్లేశం యాదవ్‌లు పాల్గొన్నారు.

## సంక్షేమ శాఖలో చిన్నారులు, వృద్ధుల సంరక్షణకు అత్యంత ప్రాధాన్యం ఇవ్వాలి

**సిబ్బంది సమయపాలన పాటిస్తూ విధులను సమర్థవంతంగా నిర్వహించాలి**

**వంటశాలలు, వసతి గదులు, పరిసరాల పరిశుభ్రతపై నిరంతరం పర్యవేక్షణ ఉండాలి**

**సుల్తానాబాద్ మండలంలోని సంక్షేమ సంస్థలు, బాల రక్ష భవన్‌ను ఆకస్మికంగా తనిఖీ చేసిన జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష**

**సుల్తానాబాద్,ఆగస్టు 11(జనంసాక్షి) :** సంక్షేమ శాఖలో వసతి పొందుతున్న చిన్నారులు, వృద్ధులకు మెరుగైన సౌకర్యాలు, భద్రత,అవసరమైన సంరక్షణ అందేలా అధికారులు ప్రత్యేక శ్రద్ధ వహించాలని జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష అధికారులను ఆదేశించారు.మంగళవారం సుల్తానాబాద్ మండలంలోని క్యాడర్ దివ్యాంగుల పాఠశాల, వృద్ధాశ్రమం,బాల సదనం పాఠశాల,మండల విద్యా వనరుల కేంద్రాన్ని,అలాగే పెద్దపల్లిలోని రంగంపల్లి బాల రక్షక భవన్‌ను జిల్లా కలెక్టర్ ఆకస్మికంగా తనిఖీ చేశారు.ఆయా సంస్థల్లోని వసతి సౌకర్యాలు,సిబ్బంది విధుల నిర్వహణ, చిన్నారులు, వృద్ధులకు అందుతున్న సేవలను పరిశీలించారు. ఈ సందర్భంగా వంటశాలలు, డార్మిటరీలనులి జిల్లా కలెక్టర్ క్షుణ్ణంగా పరిశీలించారు. వంటశాలల్లో పరిశుభ్రత, ఆహార నాణ్యత,పరిసరాల నిర్వహణ తదితర అంశాలపై వివరాలు అడిగి తెలుసుకున్నారు. వసతి గదుల్లో పరిశుభ్రత, తగిన సౌకర్యాలు, చిన్నారులు మరియు వృద్ధుల భద్రతకు తీసుకుంటున్న చర్యలను పరిశీలించి, అవసరమైన చోట తగిన చర్యలు చేపట్టాలని సూచించారు.సిబ్బంది విధుల నిర్వహణపై




ప్రత్యేకంగా ఆరా తీశారు. బాల రక్షక భవన్‌లో చిన్నారుల సంరక్షణ, రక్షణకు సంబంధించిన అంశాలను సమీక్షించారు. అక్కడ పనిచేస్తున్న ప్రతి సిబ్బంది తమకు కేటాయించిన జాబ్ చార్ట్ ప్రకారం విధులను తప్పనిసరిగా నిర్వహించాలనిలి స్పష్టం చేశారు.సిబ్బంది బాధ్యతలను స్పష్టంగా నిర్వర్తించేలా సంబంధిత అధికారులు పర్యవేక్షించాలని సూచించారు. అనంతరం పిఓసి ఎస్ ఓ కేసులపై సంబంధిత అధికారులను వివరాలు అడిగి తెలుసుకున్నారు. బాలలపై లైంగిక వేధింపులు, హింస వంటి ఘటనలు చోటుచేసుకున్నప్పుడు బాధిత చిన్నారులకు సకాలంలో రక్షణ,అవసరమైన సహాయం, కౌన్సెలింగ్ తదితర సేవలు అందేలా చర్యలు తీసుకోవాలని సూచించారు.బాల రక్షక వ్యవస్థ మరింత సమర్థవంతంగా పనిచేసేలా సంబంధిత శాఖలు సమన్వయంతో పనిచేయాలని తెలిపారు.

భరోసా కేంద్రాలను కూడా పరిశీలించి బాలల రక్షణ, సంరక్షణకు సంబంధించిన కేసులను సున్నితంగా పరిగణించి,బాధితులకు అవసరమైన సేవలు సకాలంలో అందేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఈ తనిఖీల్లో సంబంధిత శాఖల అధికారులు ,సంస్థల నిర్వాహకులు, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

## ప్రతి షాపింగ్ కాంప్లెక్స్‌పై లబ్ధిదారుల వివరాలు ఏర్పాటు చేయండి

**తిలక్‌నగర్ కాంప్లెక్స్ పరిశీలించిన సీపీఐ నాయకులు**

**గోదావరిఖని, జనంసాక్షి :** రామగుండం కార్పొరేషన్ పరిధి తిలక్‌నగర్ షాపింగ్ కాంప్లెక్స్‌లో సిపిఐ ఫ్లోర్ లీడర్ మార్కపురి సూర్య, సిపిఐ శాఖ కార్యదర్శి శనిగరపు చంద్రశేఖర్ మంగళవారం పరిశీలించారు.అక్కడ లబ్ధిదారుల వివరాలను రాయాలని బోర్డు ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గత కొన్ని రోజులుగా కూల్చివేతలు చేస్తూ..కట్టుకోమని వారే హామీ ఇస్తూ..మళ్లీ అనుమతులు లేవు అక్రమాలు జరుగుతున్నాయంటూ వాటిని కూల్చివేస్తూ చిరువ్యాపారులను తీవ్ర భయాందోళనలకు గురి చేస్తున్నారు.ఎమ్మెల్యే మాత్రం హైదరాబాదులో ప్రశాంతంగా ఉండడాన్ని తీవ్రంగా పరిగణిస్తున్నామని అన్నారు.ఎల్బీనగర్లో ఎటువంటి అక్రమాలు జరగలేదు,అడిగిన వెంటనే నిబద్ధతతో నిక్కచ్చిగా లబ్ధిదారుల వివరాలను వెంటనే అక్కడ ఏర్పాటు చేయడం జరిగిందని తెలిపారు.అదే నిబద్ధతతో ఎమ్మెల్యే రామగుండం కార్పొరేషన్ పరిధిలో జరుగుతున్న ప్రతి షాపింగ్ కాంప్లెక్స్, రాజేష్ థియేటర్ దగ్గర, తిలక్‌నగర్ సెంటర్లో, బస్టాండ్ కాలనీ దగ్గర లబ్ధిదారుల వివరాలను ఏర్పాటు చేయాలని కోరారు.తిలక్‌నగర్ సెంటర్లో కాంప్లెక్స్ నిర్మాణానికి భూమిపూజ జరిగిన నాడు ఆర్జీ.వన్ జీఎం హాజరయ్యారని, ఇప్పుడు అక్కడ అనుమతులు లేవంటూ ఎస్ఎస్‌పిసి సిబ్బందిని కాపలా ఉంచడం సిగ్గుచేటని అన్నారు.ఆర్జీవన్ జిఎం



రాజకీయాలు మాని తన పని తాను చేసుకోవాలని హితవు పలికారు.లబ్ధిదారుల వివరాలు జిఎం దగ్గర ఉన్నాయా అని ప్రశ్నించారు. ఒకవేళ లబ్ధిదారుల వివరాలు లేనట్లయితే ఏ వివరాల ఆధారంగా కూల్చివేతలు చేస్తున్నారో జిఎం బహిరంగపరచాలని వారు కోరారు.రామగుండం ఎమ్మెల్యేను గత రెండు రోజుల క్రితం రామగుండం కార్పొరేషన్‌లో నిర్మాణం జరుగుతున్న ప్రతి షాపింగ్ కాంప్లెక్స్ దగ్గర లబ్ధిదారుల వివరాలను ఏర్పాటు చేయాలని లబ్ధిదారులకు ప్రొసిడింగ్ కాపీలు,సింగరేణి నుండి ఇప్పించడంతోపాటు మున్సిపల్ అధికారుల నుండి బిల్డింగ్ పర్మిషన్స్ ఇప్పియ్యాలని చెప్పినప్పటికీ ఇప్పటి వరకు ఎమ్మెల్యే స్పందించడం లేదని, 24 గంటల్లోగా లబ్ధిదారుల వివరాలు పూర్తిస్థాయిలో బహిరంగపరచకపోతే భారత కమ్యూనిస్టు పార్టీ ఆధ్వర్యంలో ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయాన్ని ముట్టడిస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఏఐవైఎఫ్ జిల్లా అధ్యక్షుడు ఆసాల నవీన్, కొంద్ర దాసు పాల్గొన్నారు.




## అర్హత ఉన్న ప్రతి ఒక్కరు చేయూత పించనుకు దరఖాస్తు చేసుకోవాలి

**నగర మేయర్ మహంకాళి స్వామి**

**గోదావరిఖని, జనంసాక్షి :** అర్హత ఉన్న ప్రతి ఒక్కరు చేయూత ఫించను పథకం ద్వారా లబ్ది పొందేలా డివిజన్‌లలో విస్తృత అవగాహన కల్పించాలని రామగుండం నగర మేయర్ మహంకాళి స్వామి వార్డు అధికారులను కోరారు.చేయూత ఫించను పథకానికి సంబంధించి కొత్తగా దరఖాస్తులు స్వీకరించడానికి ప్రభుత్వం నుండి ఉత్తర్వులు జారీ అయిన నేపథ్యంలోరామగుండం నగరపాలక సంస్థ కార్యాలయంలో వార్డు అధికారులకు ఓరియెంటేషన్ నిర్వహించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చాలా ఏళ్ల తర్వాత కొత్త ఫించన్లకు మార్గం సుగమం అయిన నేపథ్యంలో కార్పొరేటర్ల సమన్వయంతో వాడవాడలా విస్తృత ప్రచారం చేసి అర్హుల నుండి దరఖాస్తులు స్వీకరించాలని అన్నారు.ఆదాయ ధృవీకరణ పత్రాలు,మరణ ధృవీకరణ పత్రాలు,వైద్య ధృవీకరణ పత్రాలు,ఇతర అవసరమైన డాక్యుమెంట్‌లు ఆయా కార్యాలయాలు త్వరితగతిన జారీ చేసేలా సంబందిత అధికారులకు ఆదేశాలు జారీ చేస్తామని అన్నారు.రామగుండం నగరపాలక సంస్థ కార్యాలయ పరిధిలో ఇప్పటికే 19,659 మంది చేయూత ఫించను పొందుతుండగా మరో రెండు వేల అరవై ఎనిమిది ధరఖాస్తులు పెండింగ్‌లో ఉన్నాయని అన్నారు.ఆ ధరఖాస్తుల విచారణ కూడా వెంటనే పూర్తి చేసి అర్హులను గురించి ఆన్‌లైన్‌లో నమోదు చేయాలని అన్నారు.పొరపాట్లకు అవకతవకలకు తావు లేకుండా పారదర్శకంగా విచారణ పూర్తి చేయాలని అన్నారు.ఫైలేరియా,డయాలసిస్ బాధితులకు కూడా ఫించన్లు మంజూరు చేయాలని ప్రభుత్వం నిర్ణయించడం హర్షణీయమని అన్నారు.

# కళ్యాణ లక్ష్మి, షాదీ ముబారక్ చెక్కుల పంపిణీ



**కామారెడ్డి జిల్లా ప్రతినిధి, ఆగస్టు 11 (జనం సాక్షి):** కామారెడ్డి నియోజకవర్గంలోని అర్హులైన లబ్ధిదారులకు కళ్యాణ లక్ష్మి, షాదీ ముబారక్ పథకాల కింద మంజూరైన చెక్కులను ఎమ్మెల్యే కాటిపల్లి వెంకటరమణారెడ్డి పంపిణీ చేశారు. మాచారెడ్డి మండలంతో పాటు పాల్వంచ, బీబీపేట, రాజంపేట మండలాల్లో నిర్వహించిన కార్యక్రమాల్లో ఆయన పాల్గొని లబ్ధిదారులకు చెక్కులను అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. పేద కుటుంబాలకు ప్రభుత్వం అమలు చేస్తున్న కళ్యాణ లక్ష్మి, షాదీ ముబారక్ పథకాలు ఆర్థికంగా అండగా నిలుస్తున్నాయని తెలిపారు. వివాహ సమయంలో ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొనే నిరుపేద కుటుంబాలకు ఈ పథకాల ద్వారా అందుతున్న సాయం ఎంతో ఉపయోగకరంగా ఉంటుందని పేర్కొన్నారు. అర్హులైన ప్రతి ఒక్కరూ ప్రభుత్వ సంక్షేమ పథకాలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

## ఎమ్మెల్యే తోట లక్ష్మీకాంతరావు కుమార్తె వివాహానికి మందకృష్ణ మాదిగకు ఆహ్వానం



**కామారెడ్డి జిల్లా ప్రతినిధి, ఆగస్టు 11 (జనం సాక్షి):** జుక్కల్ ఎమ్మెల్యే తోట లక్ష్మీకాంతరావు తన కుమార్తె వివాహ మహోత్సవానికి హాజరై నూతన వధూవరులను ఆశీర్వదించాలని కోరుతూ ఎంఆర్‌పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మందకృష్ణ మాదిగను హైదరాబాద్‌లో మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా వివాహ ఆహ్వాన పత్రికను అందజేశారు. కార్యక్రమంలో కామారెడ్డి జిల్లా డీసీసీ అధ్యక్షుడు ఏలే మల్లికార్జున్ పాల్గొన్నారు. వివాహ ఆహ్వాన పత్రికను సాదరంగా స్వీకరించిన మందకృష్ణ మాదిగ నూతన వధూవరులకు ముందస్తు శుభాకాంక్షలు తెలిపారు. వారి దాంపత్య జీవితం ఆనందం, ఆయురారోగ్యాలు, సుఖసంతోషాలతో నిండాలని ఆకాంక్షించారు.

## భీంగల్‌లో నూతన పెన్షన్లకు దరఖాస్తుల స్వీకరణ




**భీంగల్ టౌన్, ఆగస్టు 11 (జనం సాక్షి):** భీంగల్ మున్సిపాలిటీ కార్యాలయంలో నూతన పెన్షన్ల కోసం మంగళవారం నుంచి దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు మున్సిపల్ కమిషనర్ డి. గజానంద్ తెలిపారు. దరఖాస్తుల స్వీకరణ కోసం మున్సిపల్ కార్యాలయంలో ప్రత్యేక కౌంటర్ ఏర్పాటు చేసినట్లు వెల్లడించారు. అర్హత కలిగిన వారు అవసరమైన పత్రాలతో ప్రత్యేక కౌంటర్‌ను సంప్రదించి దరఖాస్తులు సమర్పించాలని సూచించారు. అర్హులైన వితంతువులు, ఒంటరి మహిళలు, దివ్యాంగులు, కల్లుగీత కార్మికులు, చేనేత కార్మికులు, డయాలసిస్ బాధితులు, పైలేరియా బాధితులు నూతన పెన్షన్ కోసం దరఖాస్తు చేసుకోవచ్చని తెలిపారు. అర్హత ఉన్న ప్రతి ఒక్కరికీ ప్రభుత్వ నిబంధనల ప్రకారం పెన్షన్ అందేలా చర్యలు తీసుకుంటామని కమిషనర్ పేర్కొన్నారు.

# దోమకొండ పోలీస్‌స్టేషన్‌లో ఎస్పీ ఆకస్మిక తనిఖీ

- ఫిర్యాదుదారుల పట్ల మర్యాదగా వ్యవహరించాలి.
- నేరాల నియంత్రణపై ప్రత్యేక దృష్టి సారించాలి



**కామారెడ్డి జిల్లా ప్రతినిధి, ఆగస్టు 11 (జనం సాక్షి):** కామారెడ్డి జిల్లా ఎస్పీ ఎం. రాజేష్ చంద్ర, ఐపీఎస్ దోమకొండ పోలీస్‌స్టేషన్‌ను మంగళవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా పోలీస్‌స్టేషన్ పరిసరాలు, రిసెప్షన్, రికార్డు గదులు, రైటర్ రూమ్ తదితర విభాగాలను పరిశీలించారు. పోలీస్‌స్టేషన్ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. కేసులకు సంబంధించిన రికార్డులను ఎప్పటికప్పుడు నవీకరించాలని, కేసుల నమోదు, దర్యాప్తు, రికార్డుల నిర్వహణలో ఎలాంటి నిర్లక్ష్యం వహించవద్దని అధికారులను ఆదేశించారు. పోలీస్‌స్టేషన్‌కు వచ్చే బాధితులు, ఫిర్యాదుదారుల పట్ల మర్యాదగా, బాధ్యతాయుతంగా వ్యవహరించాలని సూచించారు. ప్రతి ఫిర్యాదును శ్రద్ధగా విని, చట్టపరమైన పరిధిలో సమస్య పరిష్కారానికి కృషి చేయాలని తెలిపారు. ప్రజల్లో పోలీసులపై నమ్మకం పెరిగేలా అధికారులు, సిబ్బంది విధులు నిర్వహించాలని అన్నారు. నేరాల నియంత్రణకు పోలీసులు నిరంతరం అప్రమత్తంగా ఉండాలని, రాత్రివేళల్లో గస్తీ, బీట్‌లు, పెట్రోలింగ్‌ను ముమ్మరం చేయాలని ఆదేశించారు. రౌడీషీటర్ల కదలికలను నిరంతరం పర్యవేక్షిస్తూ అనుమానాస్పద వ్యక్తులు, కార్యకలాపాలపై నిఘా ఉంచాలని సూచించారు. డయల్-100 ద్వారా వచ్చే అత్యవసర సమాచారంపై వెంటనే స్పందించి ఆపదలో ఉన్న ప్రజలకు తక్షణ సహాయం అందించాలని సిబ్బందికి తెలిపారు. ప్రజా సమస్యల పరిష్కారానికి అత్యంత ప్రాధాన్యం ఇస్తూ ప్రజలకు అందుబాటులో ఉండేలా పోలీసులు విధులు నిర్వహించాలని ఎస్పీ రాజేష్ చంద్ర సూచించారు.

# జలసిరి అమలులో నిర్లక్ష్యం వహిస్తే కఠిన చర్యలు

- వారం రోజుల్లో లక్ష్యానికి అనుగుణంగా పనులు పూర్తి చేయాలి.
- హౌసింగ్, వన మహోత్సవం, డబుల్ బెడ్‌రూమ్ ఇళ్లపై సమీక్ష



**నిజామాబాద్ జిల్లా ప్రతినిధి, ఆగస్టు 11 (జనం సాక్షి):** భూగర్భ జలాలను పెంపొందించడంతో పాటు వర్షపు నీటిని ఒడిసిపట్టేందుకు ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన జలసిరి కార్యక్రమాల అమలులో నిర్లక్ష్యం వహించే అధికారులపై కఠిన చర్యలు తీసుకుంటామని కలెక్టర్ భవేష్ మిశ్రా హెచ్చరించారు. ఎల్‌నినో ప్రభావంతో వర్షాభావ పరిస్థితులు నెలకొనే అవకాశం ఉన్నందున జలసిరి కార్యక్రమాలకు అత్యంత ప్రాధాన్యం ఇవ్వాలని, విస్తృతంగా ఇంకుడు గుంతలు, ఫాంపాండ్లు, సోక్‌పిట్లు తదితర నీటి సంరక్షణ నిర్మాణాలు చేపట్టాలని సూచించారు. సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయంలోని సమావేశ మందిరంలో మంగళవారం జలసిరి, హౌసింగ్, వన మహోత్సవం, డబుల్ బెడ్‌రూమ్ ఇళ్ల కేటాయింపు తదితర అంశాలపై మున్సిపల్ కమిషనర్లు, ఎంపీడీఓలు, ఎంపీఓలు, ఇంజినీరింగ్ అధికారులతో ఆయన సమీక్ష నిర్వహించారు. లక్ష్యానికి అనుగుణంగా ఫాంపాండ్లు, ఇంకుడు గుంతల నిర్మాణాలు చేపట్టని మండలాల ఎంపీడీఓలపై కలెక్టర్ ఆగ్రహం వ్యక్తం చేశారు. వారం రోజుల్లో నిర్దేశిత లక్ష్యాన్ని చేరుకునేలా చర్యలు చేపట్టాలని, క్షేత్రస్థాయిలో రైతులు, ప్రజలను కలిసి నీటి సంరక్షణపై అవగాహన కల్పించాలని ఆదేశించారు. ఈ విషయంలో అలసత్వం వహించే అధికారులను సరెండర్ చేస్తానని స్పష్టం చేశారు. కేవలం జీతం కోసం పనిచేయకుండా ప్రస్తుత పరిస్థితుల్లో ప్రతి నీటి బొట్టును సంరక్షించాల్సిన బాధ్యతను గుర్తించి అంకితభావంతో విధులు నిర్వహించాలని సూచించారు. నీటి సంరక్షణకు ఉపయోగపడే ఫాంపాండ్లు, సోక్‌పిట్లను విస్తృతంగా నిర్మించాలని, భూగర్భ జలాలు తగ్గిపోయి నీరు అందించని బోరుబావుల వద్ద వాటర్ హార్వెస్టింగ్ నిర్మాణాలు చేపట్టాలని ఆదేశించారు. తమిళనాడులోని తిరువళ్లూరు జిల్లాలో ఇలాంటి నిర్మాణాల వల్ల భూగర్భ జలాలు 5 నుంచి 10 అడుగుల మేర పెరిగాయని, జిల్లాలోనూ అదే తరహా చర్యలకు చొరవ చూపాలని సూచించారు. వన మహోత్సవంలో భాగంగా ఆయా శాఖలకు నిర్దేశించిన లక్ష్యం మేరకు మొక్కలు నాటి వాటి సంరక్షణకు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. నాటిన మొక్కలను ఈ నెల 29న ప్రతి గ్రామపంచాయతీ పరిధిలో క్షేత్రస్థాయిలో పరిశీలించాలని సూచించారు. మొక్కలు నాటకుండా తప్పుడు నివేదికలు సమర్పించిన వారి నుంచి నిధులు రికవరీ చేస్తామని హెచ్చరించారు. ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాల ప్రగతిని సమీక్షించిన కలెక్టర్ సెప్టెంబర్ 15లోపు నిర్దేశిత లక్ష్యాన్ని పూర్తిచేయాలని గడువు విధించారు. జాబ్ కార్డులు కలిగిన ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారులకు వీబీజీరాంజీ కింద వ్యక్తిగత మరుగుదొడ్లు మంజూరు చేయాలని సూచించారు. గుడిసెల్లో నివసిస్తున్న కుటుంబాలకు యుద్ధప్రాతిపదికన ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేసేందుకు లబ్ధిదారుల జాబితా రూపొందించాలని, రెండు పడక గదుల ఇళ్లను అర్హులకు కేటాయించేందుకు జాబితాలను తక్షణమే తహసీల్దార్లకు అందజేయాలని ఎంపీడీఓలను ఆదేశించారు. గ్రామపంచాయతీల స్థాయిలో సమావేశాలు నిర్వహించి ఫాంపాండ్లు, సోక్‌పిట్ల నిర్మాణం, ప్రత్యామ్నాయ పంటలు, ఆయిల్‌పామ్ సాగుపై రైతులకు అవగాహన కల్పించాలని సూచించారు. సమావేశంలో అదనపు కలెక్టర్ వి. భుజంగరావు, ట్రైనీ కలెక్టర్ సురేష్, డీఆర్వో గీత, నగరపాలక సంస్థ కమిషనర్ దిలీప్‌కుమార్, జెడ్పీ సీఈవో సాయాగౌడ్, డీఆర్డీవో సాయన్న, డీపీవో శ్రీనివాస్‌రావు, ఎంపీడీఓలు, ఎంపీఓలు, పంచాయతీరాజ్ ఈఈలు, ఏఈలు తదితరులు పాల్గొన్నారు.

# బాధిత కుటుంబానికి ఎమ్మెల్యే ధన్‌పాల్ పరామర్శ



**నిజామాబాద్ జిల్లా ప్రతినిధి, ఆగస్టు 11 (జనం సాక్షి):** ఎస్సారెస్పీ బ్యాక్‌వాటర్ వద్ద ఇటీవల మృతి చెందిన యువకుడు అజీమ్ కుటుంబాన్ని నిజామాబాద్ అర్బన్ ఎమ్మెల్యే ధన్‌పాల్ సూర్యనారాయణ మంగళవారం పరామర్శించారు. ఆటోనగర్‌లోని అజీమ్ నివాసానికి వెళ్లిన ఎమ్మెల్యే కుటుంబ సభ్యులను ఓదార్చి ధైర్యం చెప్పారు. కుటుంబానికి ఆసరాగా నిలిచిన నవయువకుడు మృతి చెందడం బాధాకరమని అన్నారు. ఎస్సారెస్పీ బ్యాక్‌వాటర్ ప్రాంతంలో ప్రమాదాల నివారణకు ఇరిగేషన్ శాఖ తగిన ముందస్తు చర్యలు చేపట్టాలని సూచించారు. ప్రమాదకర ప్రాంతాల్లో హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేయడంతో పాటు లోతట్టు, ప్రమాదకర ప్రాంతాలకు ప్రజలను అనుమతించకుండా చర్యలు తీసుకోవాలని అన్నారు. ఈ విషయాన్ని కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లి అవసరమైన చర్యలకు కృషి చేస్తానని తెలిపారు. బాధిత కుటుంబానికి తనవంతు సహకారం అందిస్తానని ఎమ్మెల్యే హామీ ఇచ్చారు. ఆయన వెంట బీజేపీ మైనార్టీ మోర్చా నాయకులు కైసర్, కార్పొరేటర్లు నాగోల్ల లక్ష్మీనారాయణ, బెల్లాల్ శశాంక్, రాము, శ్రీనివాస్‌రెడ్డి తదితరులు ఉన్నారు.

# స్వాతంత్ర్య వేడుకలకు పకడ్బందీ ఏర్పాట్లు



**రాజన్న సిరిసిల్ల బ్యూరో, ఆగస్టు 11 (జనం సాక్షి):** జిల్లాలో ఈ నెల 15న నిర్వహించనున్న స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలను ఘనంగా, పకడ్బందీగా నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ అధికారులను ఆదేశించారు. సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయంలోని సమావేశ మందిరంలో జిల్లా ఎస్పీ మహేష్ బి. గితేతో కలిసి మంగళవారం సంబంధిత శాఖల అధికారులతో వేడుకల ఏర్పాట్లపై సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలోని అన్ని ప్రభుత్వ శాఖల అధికారులు, సిబ్బంది వేడుకలకు తప్పనిసరిగా హాజరయ్యేలా చర్యలు తీసుకోవాలన్నారు. జెండా ఆవిష్కరణ, వేదిక, మైదానం తదితర ఏర్పాట్లను పోలీస్, రెవెన్యూ, మున్సిపల్ శాఖల అధికారులు సమన్వయంతో పూర్తి చేయాలని సూచించారు. వివిధ ప్రభుత్వ శాఖల ఆధ్వర్యంలో అమలు చేస్తున్న అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను ప్రతిబింబించేలా స్టాళ్లు, శకటాలు ఏర్పాటు చేయాలని ఆదేశించారు. ప్రజా ప్రభుత్వ ప్రాధాన్యతా కార్యక్రమాలపై ప్రజలకు అవగాహన కల్పించేలా స్టాళ్లను తీర్చిదిద్దాలని తెలిపారు. దేశభక్తిని ప్రతిబింబించేలా విద్యార్థులతో సాంస్కృతిక, నృత్య కార్యక్రమాలు నిర్వహించాలని సూచించారు. విధి నిర్వహణలో ఉత్తమ ప్రతిభ కనబరిచిన అధికారులు, సిబ్బందికి ప్రశంసా పత్రాలు అందజేసేందుకు ప్రతిపాదనలు నిర్ణీత గడువులోగా సమర్పించాలని ఆదేశించారు. ముఖ్య అతిథి ప్రసంగం కోసం వివిధ శాఖలు చేపట్టిన ముఖ్యమైన అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలపై సంక్షిప్త నివేదికలను జిల్లా పౌర సంబంధాల అధికారికి అందజేయాలని తెలిపారు. జిల్లాకు చెందిన ప్రముఖులు, వివిధ రంగాల్లో విశిష్ట సేవలందిస్తున్న వారిని వేడుకలకు ఆహ్వానించేలా చర్యలు తీసుకోవాలన్నారు. ప్రతి ప్రభుత్వ శాఖ తమ కార్యాలయాల్లోనూ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలు నిర్వహించడంతో పాటు జిల్లా స్థాయి కార్యక్రమానికి అధికారులు, సిబ్బంది హాజరయ్యేలా చూడాలని సూచించారు. వేడుకల సమయంలో విద్యుత్ అంతరాయం లేకుండా చర్యలు తీసుకోవాలని విద్యుత్ శాఖ అధికారులను ఆదేశించారు. స్వశక్తి మహిళా సంఘాల ప్రతినిధులు వేడుకల్లో పాల్గొనేలా చూడాలని, ప్రజలు, అధికారులు, విద్యార్థులకు తాగునీటి వసతి కల్పించాలని సూచించారు. సమావేశంలో అదనపు కలెక్టర్ గడ్డం నగేష్, డీఆర్‌ఓ జయశ్రీ, సిరిసిల్ల ఆర్డీఓ శ్రీధర్‌బాబు, వివిధ ప్రభుత్వ శాఖల జిల్లా అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# ప్రతి ఇంటా ఒక మొక్క నాటాలి



**ఆర్మూర్, ఆగస్టు 11 (జనం సాక్షి):** పర్యావరణ పరిరక్షణలో భాగంగా ఆర్మూర్ నియోజకవర్గంలోని ప్రతి ఇంటిలో ఒక మొక్కను నాటి సంరక్షించాలని ఆర్మూర్ కాంగ్రెస్ నియోజకవర్గ ఇన్‌చార్జి వినయ్‌కుమార్‌రెడ్డి పిలుపునిచ్చారు. ఆర్మూర్ పట్టణంలోని గుండ్ల చెరువు పరిధిలో మంగళవారం మున్సిపల్ చైర్మన్ గోనె లహరి రఘుతో పాటు కాంగ్రెస్ నాయకులు, కౌన్సిలర్లతో కలిసి ఆయన మొక్కలు నాటారు. ఈ సందర్భంగా వినయ్‌కుమార్‌రెడ్డి మాట్లాడుతూ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఆదేశాల మేరకు రాష్ట్రవ్యాప్తంగా వన మహోత్సవం కార్యక్రమం విస్తృతంగా కొనసాగుతోందన్నారు. పర్యావరణ పరిరక్షణ, పచ్చదనం పెంపు ప్రతి ఒక్కరి బాధ్యత అని పేర్కొన్నారు. మొక్కలు నాటడంతో పాటు వాటిని సంరక్షించే బాధ్యతను కూడా ప్రజలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో ఆర్మూర్ పట్టణ కాంగ్రెస్ అధ్యక్షుడు సాయిబాబాగౌడ్, కౌన్సిలర్లు సడక్ వినోద్, భూపేందర్, నాయకులు గోనె దాము, తాటి హన్మండ్లు, శాల ప్రసాద్, గంగులీగౌడ్, సుమన్ తదితరులు పాల్గొన్నారు.

# జనగణన హ్యాండ్‌బుక్‌కు ఖచ్చితమైన సమాచారం ఇవ్వాలి



**నిజామాబాద్ జిల్లా ప్రతినిధి, ఆగస్టు 11 (జనం సాక్షి):** జిల్లా జనగణన హ్యాండ్‌బుక్ (డీసీహెచ్‌బీ) రూపకల్పనకు ఖచ్చితత్వంతో కూడిన నాణ్యమైన సమాచారాన్ని అందించాలని కలెక్టర్ భవేష్ మిశ్రా అధికారులను ఆదేశించారు. సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయంలోని కాన్ఫరెన్స్ హాల్‌లో మంగళవారం వివిధ శాఖల అధికారులు, ఆయా రంగాల ప్రముఖులతో జనగణన–2027కు సంబంధించి జిల్లా స్థాయిలో రూపొందించనున్న హ్యాండ్‌బుక్‌పై కలెక్టర్ సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలోని విద్య, వైద్యం, తాగునీరు, పారిశుద్ధ్యం, రవాణా, సమాచార వ్యవస్థ, బ్యాంకింగ్, రుణ సదుపాయాలు, విద్యుత్, ఇంధన వనరులు, భూమి, సాగునీటి వినియోగం, వ్యవసాయం, చేతివృత్తులు, కళలు, సాహిత్యం, ప్రముఖ వ్యక్తులు, గిరిజన సంస్కృతి, సంప్రదాయాలు, దేవాలయాలు, చారిత్రక ప్రదేశాలు, అటవీ ప్రాంతాలు, ఆహారపు అలవాట్లు, పరిశ్రమలు, పురావస్తు సంపద తదితర అంశాలకు సంబంధించిన సమాచారాన్ని సేకరించేటప్పుడు ప్రత్యేక శ్రద్ధ వహించాలని సూచించారు. జిల్లా జనగణన హ్యాండ్‌బుక్ రానున్న పదేళ్లపాటు సమాచార సేకరణ, అభివృద్ధి ప్రణాళికల రూపకల్పనకు కీలక ఆధారంగా నిలుస్తుందని తెలిపారు. అందువల్ల సమాచారంలో ఎలాంటి పొరపాట్లకు తావులేకుండా వాస్తవాలను నిర్ధారించుకుని వివరాలు అందించాలని సూచించారు. సంబంధిత శాఖలు వారం రోజుల్లోగా తమకు సంబంధించిన సమాచారాన్ని సేకరించి అందించాలని ఆదేశించారు. సమావేశంలో అదనపు కలెక్టర్ వి. భుజంగరావు, నగరపాలక సంస్థ కమిషనర్ దిలీప్ కుమార్, ఇన్‌చార్జి సీపీఓ కిషన్, సంబంధిత శాఖల అధికారులు, వివిధ రంగాల ప్రముఖులు పాల్గొన్నారు.

# చేయూత పెన్షన్‌కు దరఖాస్తుల స్వీకరణ



**ఇల్లంతకుంట, జూలై 11 (జనం సాక్షి):** తెలంగాణ ప్రభుత్వం అమలు చేస్తున్న చేయూత పెన్షన్ పథకం కింద అర్హులైన లబ్ధిదారుల నుంచి నూతన దరఖాస్తుల స్వీకరణ ప్రారంభమైనట్లు ఇల్లంతకుంట గ్రామ సర్పంచ్ మామిడి రాజు తెలిపారు. గ్రామంలోని అర్హులైన వితంతువులు, దివ్యాంగులు, ఒంటరి మహిళలు, కల్లుగీత కార్మికులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు. పెన్షన్‌కు అర్హత ఉన్న వారు అవసరమైన ధ్రువపత్రాలతో గ్రామపంచాయతీ కార్యాలయంలో దరఖాస్తులు సమర్పించాలని సూచించారు. అర్హులైన ప్రతి ఒక్కరూ నూతన పెన్షన్ కోసం దరఖాస్తు చేసుకుని ప్రభుత్వ సంక్షేమ పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలని సర్పంచ్ మామిడి రాజు కోరారు.

# హిందువుల ఐక్యతతోనే సనాతన ధర్మ పరిరక్షణ

- వీరాపూర్‌లో ఘనంగా శ్రీరామ హృదయ కలశ యాత్ర
- భగవద్గీత ధర్మ ప్రచారకుడు జవ్వాజీ శ్రీనివాస్‌గౌడ్



**రాయికల్, ఆగస్టు 11 (జనం సాక్షి):** హిందువులు ఐక్యంగా ఉండటం ద్వారా దేవాలయాలు, సనాతన ధర్మంపై జరిగే దాడులను అరికట్టవచ్చని భగవద్గీత ధర్మ ప్రచారకుడు జవ్వాజీ శ్రీనివాస్‌గౌడ్ అన్నారు. శ్రీశ్రీశ్రీ త్రిదండి చిన్న శ్రీమన్నారాయణ రామానుజ జీయర్ స్వామివారి 70వ తిరునక్షత్ర మహోత్సవాల సందర్భంగా దేశంలో సమృద్ధిగా వర్షాలు కురవాలని, లోకకల్యాణం, ధర్మస్థాపన, ధర్మపాలకుల రక్షణ జరగాలని, దేశం విద్రోహులు, తీవ్రవాదుల నుంచి రక్షించబడాలని ఆకాంక్షిస్తూ వికాస తరంగిణి ఆధ్వర్యంలో వీరాపూర్‌లో శ్రీరామ హృదయ కలశ యాత్ర నిర్వహించారు. భగవద్గీత ధర్మ ప్రచారకుడు జవ్వాజీ శ్రీనివాస్‌గౌడ్ నేతృత్వంలో గ్రామపంచాయతీ నుంచి శ్రీ హనుమాన్ దేవాలయం వరకు యాత్ర కొనసాగింది. ఆలయ అర్చకుడు చెరుకు మధుశర్మ, వికాస తరంగిణి బాధ్యులు చిలుకమర్రి శ్యామసుందరాచారి, వేల్పుల స్వామియాదవ్, గన్నవరం గంగాధర్ శ్రీరామ కలశం, చిన్నజీయర్ స్వామివారి చిత్రపటాన్ని సర్పంచ్ డిండిగాల గంగురామస్వామిగౌడ్, ఆలయ కమిటీ అధ్యక్షుడు నీలి మహేందర్, ఉపసర్పంచ్ దంపాల నర్సారెడ్డికి అందజేశారు. అనంతరం జై శ్రీరామ్ నినాదాలతో భక్తులు పాదయాత్రగా ఆలయానికి చేరుకున్నారు. ఈ సందర్భంగా శ్రీనివాస్‌గౌడ్ మాట్లాడుతూ కులాలు, రాజకీయాల పేరుతో హిందువులు విడిపోవడం వల్ల అనైక్యత ఏర్పడుతోందని అన్నారు. హిందువుల శక్తిపీఠాలు, దేవాలయాలు, సనాతన ధర్మంపై కొందరు విద్రోహులు దాడులు చేయడం బాధాకరమని పేర్కొన్నారు. సనాతన ధర్మంలోని 'లోకా సమస్తా సుఖినోభవంతు' భావన, స్వీయ ఆరాధనతో పాటు సర్వుల పట్ల గౌరవం వంటి విలువలు ఆదర్శప్రాయమన్నారు. హిందువుల ఐక్యతతోనే సనాతన ధర్మాన్ని, దేవాలయాలను పరిరక్షించుకోవచ్చని, ఇకనైనా అందరూ ఐక్యంగా ఉండాలని పిలుపునిచ్చారు. ఆర్ఎస్ఎస్ జిల్లా సహకార్యవాహ్ కొంగరి సాయికృష్ణ మాట్లాడుతూ శ్రీరాముడిని ఆదర్శంగా తీసుకుని ఆయన విలువలను నిత్యజీవితంలో ఆచరించాలని సూచించారు. అనంతరం ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించి భక్తులకు తీర్థప్రసాదాలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో కవి, రచయిత కనికరపు స్వామి, జవ్వాజీ రాములు, సోమరాజు, మోతె ప్రదీప్, దమ్మ రాజు, కోమటి రమేష్, నారాయణ, బైరి అక్షయ్, నరేందర్, లచ్చన్న, లత, లలిత, శ్రీమతి, లావణ్య, మమతతో పాటు సుమారు 200 మంది అంజనేయస్వామి భక్తులు, గ్రామస్థులు పాల్గొన్నారు.

# తండాలో ఘనంగా బంజారా తీజ్ వేడుకలు

**బంజారా సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీకగా వేడుకలు**

**సంప్రదాయ దుస్తుల్లో మహిళలు, యువతుల సందడి**



**సిరికొండ, ఆగస్టు 11 (జనం సాక్షి):** బంజారా సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీకగా నిలిచే తీజ్ పండుగ వేడుకలను గడ్డమీది తండాలో మంగళవారం ఘనంగా నిర్వహించారు. తండాకు చెందిన మహిళలు, యువతులు సంప్రదాయ బంజారా దుస్తులు ధరించి వేడుకల్లో ఉత్సాహంగా పాల్గొన్నారు. తీజ్ పండుగలో భాగంగా మహిళలు, యువతులు తీజ్ బుట్టలను నెత్తిన పెట్టుకుని తండాలో ఊరేగింపుగా వెళ్లారు. బంజారా సంప్రదాయ పాటలు, నృత్యాలతో సందడి చేస్తూ పండుగను ఆనందోత్సాహాల మధ్య జరుపుకున్నారు. ఈ సందర్భంగా పలువురు తీజ్ పండుగ విశిష్టతతో పాటు బంజారా సంస్కృతి, సంప్రదాయాల గురించి వివరించారు. వేడుకలతో తండాలో పండుగ వాతావరణం నెలకొంది. కార్యక్రమంలో తండా నాయక్ బాల్ రాజ్ నాయక్, తండా కారోబారీ బద్య, కాశీరామ్, మోహన్, గంగాధర్, దరిసింగ్, రాజు, ప్రకాష్, రాజేందర్, రామ్ రాజు, ఉప సర్పంచ్ రవి, బాల్ కిషన్ నాయక్, గిరిజన జన సమితి నిజామాబాద్ జిల్లా అధ్యక్షుడు తదితరులు పాల్గొన్నారు.

## ఇంటిపై జాతీయ జెండా ఎగురవేసిన దర్పల్లి బాబురావు



**సిరికొండ, ఆగస్టు 11 (జనం సాక్షి):** ప్రధాని నరేంద్ర మోదీ పిలుపు మేరకు నిర్వహిస్తున్న హర్ ఘర్ తిరంగా కార్యక్రమంలో భాగంగా బీజేపీ మండల ప్రధాన కార్యదర్శి దర్పల్లి బాబురావు సిరికొండ మండల కేంద్రంలోని తన ఇంటిపై జాతీయ త్రివర్ణ పతాకాన్ని ఎగురవేశారు. ఈ సందర్భంగా జాతీయ జెండాకు గౌరవ వందనం చేసి దేశభక్తిని చాటుకున్నారు. ప్రతి ఇంటిపై జాతీయ జెండాను ఎగురవేయడం ద్వారా దేశ ఐక్యత, సమగ్రతను చాటాలని బాబురావు అన్నారు. హర్ ఘర్ తిరంగా కార్యక్రమం ప్రజల్లో దేశభక్తి, జాతీయ భావాన్ని మరింత పెంపొందిస్తుందని పేర్కొన్నారు. యువత, విద్యార్థులు, ప్రజలు కార్యక్రమంలో ఉత్సాహంగా పాల్గొని జాతీయ జెండా ప్రాధాన్యతను చాటాలని పిలుపునిచ్చారు. దేశం కోసం ప్రాణత్యాగం చేసిన స్వాతంత్ర్య సమరయోధుల త్యాగాలను ప్రతి ఒక్కరూ స్మరించుకోవాలని అన్నారు. ప్రతి ఇంటిపై త్రివర్ణ పతాకం రెపరెపలాడేలా ప్రజలు భాగస్వాములు కావాలని కోరారు. ఈ సందర్భంగా 'భారత్ మాతాకీ జై', 'జై హింద్' అంటూ నినాదాలు చేశారు.

## బీజేపీ ప్రభుత్వాన్ని గద్దె దించాలి



**ముత్తారం, ఆగస్టు 11 (జనం సాక్షి):** ప్రజా వ్యతిరేక విధానాలను అవలంబిస్తున్న కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వాన్ని గద్దె దించాలని సీపీఐ జిల్లా కార్యదర్శి తాండ్ర సదానందం పిలుపునిచ్చారు. కేంద్ర ప్రభుత్వ విధానాలకు నిరసనగా మంగళవారం ముత్తారం మండల కేంద్రంలో సీపీఐ ఆధ్వర్యంలో జిల్లా ప్రజా చైతన్య యాత్ర నిర్వహించారు. ఈ సందర్భంగా తాండ్ర సదానందం మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం అనుసరిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలను ప్రజలు తిప్పికొట్టాలని కోరారు. దేశ ప్రజల హక్కులు, ప్రయోజనాల పరిరక్షణ కోసం ప్రజా ఉద్యమాలను మరింత బలోపేతం చేయాల్సిన అవసరం ఉందన్నారు. 'బీజేపీ హఠావో.. దేశ్ కో బచావో' నినాదంతో సెప్టెంబరు 1న ఢిల్లీలోని రామ్‌లీలా మైదానంలో భారీ బహిరంగ సభ నిర్వహించనున్నట్లు తెలిపారు. సభకు ప్రజలు, కార్మికులు, కర్షకులు, ప్రజాసంఘాల ప్రతినిధులు పెద్ద సంఖ్యలో తరలివచ్చి విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. కేంద్ర ప్రభుత్వ ప్రజా వ్యతిరేక విధానాలపై ప్రజల్లో చైతన్యం తీసుకురావడమే లక్ష్యంగా ప్రజా చైతన్య యాత్ర కొనసాగిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో సీఐటీయూ కార్యదర్శి కడారి సునీల్, గౌతమ్ గోవర్ధన్, గోశిక మోహన్, మల్లయ్య, కేడెం స్వామి, కన్నం లక్ష్మీనారాయణ, నవీన్, రాజయ్య, ఎజ్జ రాజయ్య, అసాల రమా తదితరులు పాల్గొన్నారు.

## కోరెం ప్రభుత్వ పాఠశాలలో ఘనంగా బోనాల పండుగ



**బోయినపల్లి, ఆగస్టు 11 (జనం సాక్షి):** బోయినపల్లి మండలం కోరెం ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో మంగళవారం బోనాల పండుగను విద్యార్థులు, ఉపాధ్యాయులు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులు వివిధ దేవతామూర్తుల వేషధారణలతో అలరించారు. విద్యార్థినులు బోనాలు ఎత్తుకుని సంప్రదాయ దుస్తుల్లో పాల్గొని సందడి చేశారు. చిన్నారుల వేషధారణలు, సాంస్కృతిక ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. పండుగ విశిష్టతను తెలియజేస్తూ విద్యార్థులకు తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలపై ఉపాధ్యాయులు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయుడు పరుశురాం, ఉపాధ్యాయులు నరేందర్, రఘు, విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

# 'వికసిత్ భారత్-వికసిత్ గ్రామం'పై వ్యాసరచన పోటీలు

- విద్యార్థుల్లో దేశభక్తి, సామాజిక బాధ్యత పెంపొందించడమే లక్ష్యం
- 60 మంది విద్యార్థుల భాగస్వామ్యం.. ప్రతిభావంతులకు ప్రోత్సాహక బహుమతులు

**కరీంనగర్ కల్చరల్, ఆగస్టు 11 (జనం సాక్షి):** 80వ స్వాతంత్ర్య దినోత్సవాన్ని పురస్కరించుకుని 'వికసిత్ భారత్--వికసిత్ గ్రామం' అంశంపై వ్యాసరచన పోటీలను మంగళవారం కరీంనగర్‌లోని కపిల్ బాల కుటీర్ సంక్షేమ చారిటబుల్ ట్రస్ట్‌లో సుశీల ట్రస్ట్ ఆధ్వర్యంలో నిర్వహించారు. సీనియర్ ఫిజీషియన్ డాక్టర్ డి. రఘురామన్ కార్యక్రమ వివరాలను వెల్లడించారు. విద్యార్థుల్లో దేశభక్తి, జాతీయ సమైక్యతతో పాటు గ్రామీణాభివృద్ధి, స్వయం సమృద్ధి, సాంకేతిక ప్రగతి, పర్యావరణ పరిరక్షణపై అవగాహన కల్పించడమే పోటీల ఉద్దేశమని తెలిపారు. అభివృద్ధి చెందిన భారతదేశ నిర్మాణంలో గ్రామాల పాత్ర, విద్య, వైద్యం, మౌలిక సదుపాయాలు, ఉపాధి అవకాశాలు, మహిళా సాధికారత, యువత భాగస్వామ్యం తదితర అంశాలపై 60 మంది విద్యార్థులు తమ ఆలోచనలను వ్యాస రూపంలో వ్యక్తపరిచారు. దేశంలోని ప్రతి గ్రామం అభివృద్ధి చెందినప్పుడే 'వికసిత్ భారత్' లక్ష్యం సాకారమవుతుందని డాక్టర్ రఘురామన్ అన్నారు. విద్యార్థుల్లో సృజనాత్మకత, సామాజిక బాధ్యత, దేశాభివృద్ధి పట్ల నిబద్ధత పెంపొందించేందుకు ఇటువంటి కార్యక్రమాలు దోహదపడతాయని పేర్కొన్నారు. ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు ప్రోత్సాహక బహుమతులు, పోటీల్లో పాల్గొన్న వారందరికీ ప్రశంసాపత్రాలు అందజేశారు. కార్యక్రమంలో కళావతి, నూనె శ్రీనివాస్, గీకురు శ్రీనివాస్, దీకొండ రాజు, కృష్ణవేణి, కొత్తకొండ చందు, సుమన్ నాయక్ తదితరులు పాల్గొన్నారు.



# ఆర్థిక ఆరోపణలపై సీనియర్ అసిస్టెంట్ సస్పెన్షన్



**మంథని, ఆగస్టు 11 (జనం సాక్షి):** మంథని మండల పరిషత్ కార్యాలయంలో సీనియర్ అసిస్టెంట్‌గా పనిచేస్తున్న కె.ఎన్. జయ ప్రకాశ్‌పై వచ్చిన ఆర్థిక ఆరోపణల నేపథ్యంలో సస్పెన్షన్ ఉత్తర్వులు జారీ చేసినట్లు పెద్దపల్లి జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష తెలిపారు. ఆగస్టు 7న మంథని మండల పరిషత్ కార్యాలయంలో మండల స్థాయి అధికారులు, సర్పంచ్‌లతో నిర్వహించిన ప్రత్యేక సమావేశంలో ప్రజాప్రతినిధులు, ఉద్యోగులు, పదవీ విరమణ పొందిన ఉద్యోగులు జయ ప్రకాశ్‌పై పలు ఆర్థిక ఆరోపణలు చేసినట్లు తెలిపారు. సమావేశంలో వచ్చిన ఫిర్యాదులను తీవ్రంగా పరిగణించి ప్రాథమిక విచారణ చేపట్టగా విధుల నిర్వహణలో తీవ్ర నిర్లక్ష్యం, విధుల పట్ల అంకితభావం లోపించడం, ప్రభుత్వ ఉద్యోగికి తగని ప్రవర్తన వంటి అంశాలు ప్రాథమికంగా నిర్ధారణకు వచ్చినట్లు కలెక్టర్ పేర్కొన్నారు. తెలంగాణ రాష్ట్ర సివిల్ సర్వీసెస్ (ప్రవర్తనా) నిబంధనలు, 1964లోని రూల్ 3(1), 3(2)లను ఉల్లంఘించినట్లు ప్రాథమికంగా నిర్ధారించిన నేపథ్యంలో శాఖాపరమైన విచారణ చేపట్టనున్నట్లు తెలిపారు. తెలంగాణ రాష్ట్ర సివిల్ సర్వీసెస్ (క్లాసిఫికేషన్, కంట్రోల్ అండ్ అప్పీల్) రూల్స్, 1991లోని రూల్ 20 ప్రకారం తదుపరి చర్యలు చేపట్టనున్నట్లు వెల్లడించారు. విచారణ పూర్తయ్యే వరకు అదే నిబంధనల్లోని రూల్ 8(1) ప్రకారం జయ ప్రకాశ్‌ను తక్షణమే సస్పెండ్ చేస్తూ ఉత్తర్వులు జారీ చేసినట్లు తెలిపారు. సస్పెన్షన్ కాలంలో ముందస్తు అనుమతి లేకుండా ప్రధాన కార్యాలయాన్ని విడిచి వెళ్లరాదని ఆదేశించినట్లు పేర్కొన్నారు. నిబంధనల ప్రకారం సస్పెన్షన్ కాలంలో జీవనాధార భత్యంతో పాటు డీఏ, ఇతర పరిహార భత్యాలు చెల్లించనున్నట్లు తెలిపారు. ప్రభుత్వ కార్యాలయాల్లో పనిచేసే అధికారులు, సిబ్బంది నిబంధనలకు అనుగుణంగా బాధ్యతాయుతంగా విధులు నిర్వర్తించాలని కలెక్టర్ కోయ శ్రీహర్ష స్పష్టం చేశారు. ప్రజల నుంచి వచ్చే ఫిర్యాదులను నిర్లక్ష్యం చేయకుండా, ఎలాంటి అవకతవకలకు తావులేకుండా పారదర్శకంగా విధులు నిర్వహించాలని ఆదేశించారు.

## కమాన్‌పూర్‌లో కొత్త పింఛన్లకు దరఖాస్తుల స్వీకరణ

**చేయూత పథకం కింద అర్హులకు పింఛన్లు**

**అవసరమైన ధ్రువపత్రాలతో దరఖాస్తు చేసుకోవాలని సూచన**



**కమాన్‌పూర్, ఆగస్టు 11 (జనం సాక్షి):** పెద్దపల్లి జిల్లా కమాన్‌పూర్ గ్రామపంచాయతీ కార్యాలయంలో మంగళవారం తెలంగాణ ప్రభుత్వం అమలు చేస్తున్న చేయూత పథకం కింద కొత్త పింఛన్ల కోసం అర్హులైన వారి నుంచి దరఖాస్తుల స్వీకరణ చేపట్టారు. ఈ సందర్భంగా గ్రామ సర్పంచ్ రంగు సత్యనారాయణ గౌడ్, ఉపసర్పంచ్ రఫీక్ సోహెల్ మాట్లాడుతూ చేయూత పథకం కింద అర్హత కలిగిన వారికి కొత్త పింఛన్లు మంజూరు కానున్నందున అర్హులైన ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కొత్త పింఛన్ల కోసం దరఖాస్తు చేసుకునే వారు అవసరమైన ధ్రువీకరణ పత్రాలతో గ్రామపంచాయతీ కార్యాలయానికి హాజరై దరఖాస్తులు సమర్పించాలని సూచించారు. దరఖాస్తుల పరిశీలన అనంతరం ప్రభుత్వ నిబంధనల ప్రకారం అర్హులైన వారికి పింఛన్లు మంజూరు అవుతాయని తెలిపారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి రాము, వార్డు సభ్యులు పచ్చునూరి రాజ్‌కుమార్, మెరుగు కుమార్, మిట్ట సందీప్, గోడిశెల లింగస్వామి తదితరులు పాల్గొన్నారు.

## ఎరువుల యాప్‌పై రైతులకు అవగాహన

**ఆగస్టు 13 నుంచి కొత్త విధానం అమల్లోకి**



**చొప్పదండి, ఆగస్టు 11 (జనం సాక్షి):** కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఫ్రేమ్‌వర్క్ ఫర్ ఫర్టిలైజర్ సేల్ (ఎఫ్‌ఎఫ్‌ఎస్) యాప్‌పై చొప్పదండి రైతు వేదికలో వ్యవసాయ శాఖ అధికారులు రైతులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా మండల వ్యవసాయ అధికారి మమత మాట్లాడుతూ ఆగస్టు 13, 2026 నుంచి నూతన ఎరువుల యాప్ అందుబాటులోకి రానున్నట్లు తెలిపారు. రైతులు యూరియాతో పాటు ఇతర అన్ని రకాల ఎరువులను కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఎఫ్‌ఎఫ్‌ఎస్ యాప్ ద్వారా బుక్ చేసుకుని, అనంతరం సంబంధిత ఎరువుల డీలర్ల వద్ద కొనుగోలు చేయాల్సి ఉంటుందని వివరించారు. యాప్‌లో ఎరువులను బుక్ చేసుకునే విధానాన్ని రైతులకు ఆమె వివరించారు. కార్యక్రమంలో ఏఈఓలు రమ్యజ్యోత్స్న, సంపత్, వివిధ గ్రామాలకు చెందిన రైతులు పాల్గొన్నారు.

# ప్రత్యామ్నాయ పంటలపై రైతులకు ఇబ్బందులెందుకు?

- గతంలోనే కేసీఆర్ సూచించారు.
- కోతుల బెడదను తొలగించాలి: కల్వకుంట్ల గోపాలరావు

**ముస్తాబాద్, ఆగస్టు 11 (జనం సాక్షి):** ప్రత్యామ్నాయ పంటలు సాగు చేయాలని ప్రభుత్వం, అధికారులు పదేపదే చెబుతున్నారని, అయితే రైతులు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించడంలో ప్రభుత్వం దృష్టి సారించాలని మాజీ రైతుబంధు అధ్యక్షుడు, బీఆర్ఎస్ సీనియర్ నాయకుడు కల్వకుంట్ల గోపాలరావు అన్నారు. ముస్తాబాద్ మండల కేంద్రంలో మంగళవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ హయాంలోనే రైతులు ప్రత్యామ్నాయ పంటల వైపు మళ్లాలని సూచించారని గుర్తుచేశారు. ప్రస్తుతం అధికారంలో ఉన్న కాంగ్రెస్ పార్టీ ప్రతిపక్షంలో ఉన్న సమయంలో రైతులు వరి పంటలు ఎక్కువగా సాగు చేసేలా ప్రోత్సహించిందని, ఇప్పుడు ప్రత్యామ్నాయ పంటలు సాగు చేయాలని చెబుతోందని విమర్శించారు. రైతులు ఎదుర్కొంటున్న వాస్తవ సమస్యలను ప్రభుత్వం గుర్తించాలని కోరారు.



యూరియా కోసం ప్రత్యేక యాప్ ప్రవేశపెట్టడంతో రైతులు ఇబ్బందులు పడుతున్నారని అన్నారు. ప్రస్తుతం రైతులు ప్రత్యామ్నాయ పంటలు సాగు చేసేందుకు సిద్ధంగా ఉన్నప్పటికీ కోతుల బెడద తీవ్రంగా ఉండటంతో పంటలు వేసేందుకు వెనుకంజ వేస్తున్నారని తెలిపారు. కోతుల సమస్యను పరిష్కరించేందుకు అధికారులు, ప్రభుత్వం సమగ్ర చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు. రైతులపై ప్రభుత్వానికి నిజమైన ప్రేమ ఉంటే సమావేశాల్లో సూచనలు చేయడం మాత్రమే కాకుండా క్షేత్రస్థాయిలో రైతులు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించాలని గోపాలరావు కోరారు.

# బాధిత కుటుంబాన్ని పరామర్శించిన మాజీ ఎమ్మెల్యే



**సదాశివనగర్, ఆగస్టు 11 (జనం సాక్షి):** సదాశివనగర్ మండలం ఉత్నూర్ గ్రామానికి చెందిన మద్దికుంట సాయిలు కుమారుడు మద్దికుంట సాయికుమార్ ఇటీవల బైక్ ప్రమాదంలో మృతి చెందడంతో ఆయన కుటుంబాన్ని ఎల్లారెడ్డి మాజీ ఎమ్మెల్యే జాజాల సురేందర్ మంగళవారం పరామర్శించారు. కుటుంబ సభ్యులను ఓదార్చి, సాయికుమార్ మృతికి సంతాపం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా కుటుంబానికి అండగా ఉంటామని భరోసా ఇచ్చారు. మాజీ ఎమ్మెల్యే వెంట గ్రామ బీఆర్ఎస్ అధ్యక్షుడు గుడ్ల శ్రీకాంత్, సీనియర్ నాయకులు దొడ్లే రవి, మాజీ ఉపసర్పంచ్ శివపాటిల్, వార్డు సభ్యుడు చాకలి మహేష్, మానంజీ శ్రీకాంత్, విశ్వనాథ్ సతీష్, గుడ్ల శేఖర్, కయ్యల రవి తదితరులు ఉన్నారు.

# విద్యుత్ ఉద్యోగుల నిరసన 28వ రోజుకు




**కరీంనగర్ టౌన్, ఆగస్టు 11 (జనం సాక్షి):** యాదాద్రి థర్మల్ పవర్ ప్లాంట్‌లోని కోల్, యాష్ హ్యాండ్లింగ్ విభాగాల నిర్వహణను ప్రైవేటుపరం చేసేందుకు ప్రభుత్వం పిలిచిన టెండర్లను రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ విద్యుత్ ఉద్యోగులు చేపట్టిన నిరసన మంగళవారం 28వ రోజుకు చేరింది. టీజీఎన్‌పీడీసీఎల్ కరీంనగర్ సూపరింటెండింగ్ ఇంజనీర్ కార్యాలయ ఆవరణలో ఉద్యోగులు నల్లబ్యాడ్జీలు ధరించి విధులకు హాజరై నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ఉద్యోగ సంఘాల నాయకులు మాట్లాడుతూ రాష్ట్రవ్యాప్తంగా విద్యుత్ ఉద్యోగులు 40--45 రోజులుగా ఆందోళనలు చేస్తున్నప్పటికీ మేనేజ్‌మెంట్ టెండర్లను రద్దు చేయడంపై నిర్ణయం తీసుకోకపోవడం విచారకరమన్నారు. విద్యుత్ రంగంలోని కీలక విభాగాలను ప్రైవేటుపరం చేయడం వల్ల ఉద్యోగులు, కార్మికుల ప్రయోజనాలకు నష్టం వాటిల్లే అవకాశం ఉందని పేర్కొన్నారు. మేనేజ్‌మెంట్ మొండి వైఖరిని కొనసాగిస్తే ఉద్యమాన్ని మరింత తీవ్రతరం చేస్తామని హెచ్చరించారు. అనంతరం కార్యాలయ ప్రాంగణంలో ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. కార్యక్రమంలో రమణారావు, మహేందర్‌రావు, శ్రీనివాస్, రమేష్, సంతోష్, నిఖిల్‌తో పాటు పలువురు విద్యుత్ ఉద్యోగులు పాల్గొన్నారు.

# గన్నేరువరం పోలీస్‌స్టేషన్‌లో అడిషనల్ డీసీపీ వార్షిక తనిఖీ



గన్నేరువరం, ఆగస్టు 11 (జనం సాక్షి): వార్షిక తనిఖీలో భాగంగా కరీంనగర్ కమిషనరేట్ అడిషనల్ డీసీపీ వెంకటరమణ గన్నేరువరం పోలీస్‌స్టేషన్‌ను మంగళవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా పోలీస్‌స్టేషన్‌లోని రికార్డులను క్షుణ్ణంగా పరిశీలించారు. స్టేషన్ పరిసరాలు, రికార్డుల నిర్వహణ తీరును పరిశీలించిన అనంతరం సిబ్బందితో మాట్లాడి విధుల నిర్వహణపై పలు సూచనలు చేశారు. రికార్డులను ఎప్పటికప్పుడు క్రమబద్ధంగా నిర్వహిస్తూ, విధుల్లో అప్రమత్తంగా ఉండాలని సూచించినట్లు తెలిసింది. పోలీస్‌స్టేషన్‌కు వచ్చే ప్రజల సమస్యలను సానుకూలంగా పరిష్కరించేలా బాధ్యతగా విధులు నిర్వర్తించాలని సిబ్బందికి సూచించారు. ఈ తనిఖీలో అడిషనల్ డీసీపీతో పాటు కరీంనగర్ రూరల్ డివిజన్ ఏసీపీ విజయ్‌కుమార్, తిమ్మాపూర్ సీఐ బొల్లం రమేష్, ఎస్సై జి.నరేందర్‌రెడ్డి, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

# మై భారత్ వాలంటీర్‌గా చల్లా అనూష్ ఎంపిక

**చొప్పదండి, ఆగస్టు 11 (జనం సాక్షి):** మై భారత్ చొప్పదండి-చిగురుమామిడి బ్లాక్‌కు చొప్పదండికి చెందిన చల్లా అనూష్ వాలంటీర్‌గా ఎంపికయ్యారు. ఈ సందర్భంగా అనూష్ మాట్లాడుతూ తనను మై భారత్ వాలంటీర్‌గా ఎంపికయ్యేలా ప్రోత్సహించి, సహకరించిన ప్రతి ఒక్కరికీ కృతజ్ఞతలు తెలిపారు. ముఖ్యంగా డీవైఓ తిరుపతిరెడ్డి, డీజీ



నామినీ ప్రవీణ్‌రెడ్డి, హరికాంత్ ప్రత్యేకంగా సహకరించారని, వారికి ధన్యవాదాలు తెలిపారు. మై భారత్ వేదికగా యువతను సామాజిక సేవా కార్యక్రమాల్లో భాగస్వామ్యం చేయడంతో పాటు వారిలో నాయకత్వ లక్షణాలను పెంపొందించేందుకు కృషి చేస్తానని పేర్కొన్నారు. దేశాభివృద్ధిలో యువత పాత్రను మరింత బలోపేతం చేసేందుకు తనవంతు కృషి చేస్తానన్నారు. యువతకు అందుబాటులో ఉన్న అవకాశాలను సద్వినియోగం చేసుకునేలా ప్రోత్సహిస్తూ, సమాజ సేవా కార్యక్రమాల్లో మరింత మంది యువతను భాగస్వామ్యం చేసేలా కృషి చేస్తానని అనూష్ తెలిపారు.

# పోచమ్మ బండను పర్యాటక కేంద్రంగా తీర్చిదిద్దుతాం

- రూ.5 లక్షల సొంత నిధులతో అభివృద్ధి పనులు
- వెలుగులోకి కాలభైరవ, పురాతన నాగదేవత విగ్రహాలు

**చిగురుమామిడి, ఆగస్టు 11 (జనం సాక్షి):** మొక్కిన మొక్కులు వెంటనే తీర్చే అమ్మవారిగా ప్రసిద్ధి చెందిన ముదిమాణిక్యం గ్రామ శివారులోని స్వయంభు పోచమ్మ బండను గ్రామస్థుల సహకారంతో పర్యాటక కేంద్రంగా తీర్చిదిద్దుతామని సర్పంచ్ బోయిని రమేష్, గ్రామ యువకుడు ఏలేటి సంతోష్‌రెడ్డి తెలిపారు. మంగళవారం వారు గ్రామస్థులతో కలిసి పోచమ్మ తల్లి ఆలయంలో ఇటీవల తవ్వకాల్లో వెలుగుచూసిన కాలభైరవుడి విగ్రహం వద్ద ప్రత్యేక పూజలు నిర్వహించారు. కాలభైరవుడి విగ్రహం బయటపడటంతో గ్రామస్థులు పెద్ద సంఖ్యలో తరలివచ్చి పూజలు చేస్తున్నారు. ఈ సందర్భంగా సర్పంచ్ రమేష్ మాట్లాడుతూ సుమారు 30 ఎకరాల్లో విస్తరించి ఉన్న పోచమ్మ బండపై గతంలో పురాతన ఆలయం ఉన్నట్లు తెలుస్తోందన్నారు. గ్రామ యువకుడు ఏలేటి సంతోష్‌రెడ్డికి పోచమ్మ బండ వద్ద విగ్రహాలు ఉన్నట్లు కలలో కనిపించడంతో వాటిని వెలికితీసి ప్రతిష్ఠించాలని సంకల్పించినట్లు తెలిపారు. దీంతో సంతోష్‌రెడ్డి సుమారు రూ.5 లక్షల సొంత ఖర్చుతో ఆలయ పరిసరాల్లో అభివృద్ధి పనులు






చేపట్టడంతో పాటు తాగునీటి కోసం బోరు, విద్యుత్ సౌకర్యం ఏర్పాటు చేశారని వివరించారు. పోచమ్మ బండ గుట్టపై సుమారు 30 ఎకరాల ప్రభుత్వ స్థలం ఉండగా, దాదాపు 10 ఎకరాల విస్తీర్ణంలో ఉన్న గుడిబండపై కాకతీయుల కాలం నాటి కళాతోరణంతో పాటు పలు పురాతన విగ్రహాలు ఉన్నట్లు గుర్తించామని చెప్పారు. కాలభైరవుడి విగ్రహంతో పాటు పురాతన నాగదేవత విగ్రహాలు కూడా వెలుగులోకి వచ్చినట్లు తెలిపారు. ఈ విషయాన్ని పురావస్తు శాఖ అధికారుల దృష్టికి తీసుకెళ్లినట్లు పేర్కొన్నారు. చారిత్రక ప్రాధాన్యమున్న పోచమ్మ బండను అందరి సహకారంతో పర్యాటక కేంద్రంగా అభివృద్ధి చేస్తామని సర్పంచ్ రమేష్, ఏలేటి సంతోష్‌రెడ్డి తెలిపారు. సొంత ఖర్చులతో అభివృద్ధి పనులు చేపడుతున్న సంతోష్‌రెడ్డిని గ్రామస్థులు, మండల ప్రజలు అభినందించారు. పోచమ్మ తల్లి ఆశీస్సులు ప్రజలందరిపై ఉండాలని, గ్రామ ప్రజలను సుఖసంతోషాలతో చల్లగా చూడాలని సంతోష్‌రెడ్డి ఆకాంక్షించారు. తన సర్పంచ్ పదవీకాలంలో పురాతన విగ్రహాలు వెలుగులోకి రావడం సంతోషంగా ఉందని రమేష్ అన్నారు.

# మాల మృతవీరులను స్మరించుకుందాం.. హక్కుల కోసం ఉద్యమిద్దాం

## ఎస్సీ వర్గీకరణకు వ్యతిరేకంగా ఐక్యంగా పోరాడాలి: రాజ్‌వీర్




**గంభీరావుపేట, ఆగస్టు 11 (జనం సాక్షి):** ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో మాలల హక్కుల కోసం జరిగిన ఉద్యమంలో ప్రాణాలు కోల్పోయిన మాల మృతవీరుల త్యాగాలు ఎన్నటికీ వృథా కావని మాల మహానాడు జిల్లా అధికార ప్రతినిధి మల్యాల రాజ్‌వీర్ అన్నారు. 1997 ఆగస్టు 11న అప్పటి ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ప్రభుత్వ హయాంలో మాలల ఉద్యమంపై జరిగిన లాఠీచార్జిలో పాసంగి శేషయ్య, గోపతోటే నారాయణ అనే మాల యువకులు మృతి చెందారని తెలిపారు. వారి త్యాగం మాల సమాజానికి తీరని లోటని పేర్కొన్నారు. ఎస్సీలను వర్గీకరించడం రాజ్యాంగపరంగా, చట్టబద్ధంగా వ్యతిరేకమని, ఎస్సీలను విభజించడం వల్ల దళితుల ఐక్యత దెబ్బతింటుందని అన్నారు. మాలలకు జరుగుతున్న అన్యాయానికి వ్యతిరేకంగా ప్రతి ఒక్కరూ ఐక్యంగా ఉద్యమించాలని పిలుపునిచ్చారు. గతంలో మాలలకు అన్యాయం జరిగినట్లుగానే ప్రస్తుతం కూడా ప్రభుత్వాలు మాలల హక్కుల విషయంలో అన్యాయం చేస్తున్నాయని ఆరోపించారు. వివిధ రాజకీయ పార్టీల్లో ఉన్న మాలలు మృతవీరుల త్యాగాలను స్మరించుకుని, మాలల హక్కుల పరిరక్షణ కోసం గళం విప్పాలని కోరారు. మాల మృతవీరుల త్యాగాలను స్మరించుకుంటూ ప్రతి ఏటా ఆగస్టు 11న మృతవీరుల దినోత్సవాన్ని నిర్వహిస్తున్నట్లు మల్యాల రాజ్‌వీర్ తెలిపారు.

## కోతీరాంపూర్‌లో ఘనంగా మైసమ్మ తల్లి బోనాలు



**కరీంనగర్ టౌన్,ఆగస్టు11,(జనం సాక్షి)**కరీంనగర్ జిల్లా కేంద్రంలోని కోతీరాంపూర్ ప్రభుత్వ ఉన్నత పాఠశాల సమీపంలో మైసమ్మ తల్లి బోనాల వేడుకలు మంగళవారం ఘనంగా నిర్వహించారు. సరస్వతి నగర్, గిద్దె పెరుమాండ్ల కాలనీవాసులు, మాజీ కార్పొరేటర్ జంగిలి ఐలందర్ యాదవ్ ఆధ్వర్యంలో జరిగిన వేడుకలకు ఎమ్మెల్యే, మాజీ మంత్రి గంగుల కమలాకర్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా కాలనీవాసులు ఎమ్మెల్యే గంగుల కమలాకర్‌కు ఘన స్వాగతం పలికి తిలకం దిద్ది, మంగళహారతి ఇచ్చి శాలువాతో సత్కరించారు. అనంతరం గంగుల బోనం ఎత్తుకుని అమ్మవారి ఆలయం వరకు నడుచుకుంటూ వెళ్లి కొబ్బరికాయ కొట్టి మొక్కులు చెల్లించారు. శివశక్తుల పూనకాలతో వేడుకలు భక్తిశ్రద్ధల మధ్య కోలాహలంగా జరిగాయి. అమ్మవారికి పూనకం వచ్చిన మహిళా భక్తురాలు శాశ్వత ఆలయం నిర్మించాలని కోరగా, ఎమ్మెల్యే సానుకూలంగా స్పందించారు. వచ్చే దసరా నాటికి ప్రజల సహకారంతో నూతన ఆలయాన్ని నిర్మించి ఇస్తామని హామీ ఇచ్చారు. ఎల్లమ్మ తల్లి కలలో కనిపించి స్థానిక పెంట కుప్పలో వెలిశానని చెప్పడంతో కాలనీవాసులంతా కలిసి అమ్మవారిని ప్రతిష్ఠించినట్లు తెలిపారు. భక్తులు బోనం సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. కార్యక్రమంలో మాజీ మేయర్ సర్దార్ రవీందర్ సింగ్, మాజీ గ్రంథాలయ సంస్థ చైర్మన్ అనిల్ కుమార్ గౌడ్, మాజీ కార్పొరేటర్లు ఎడ్ల అశోక్, దురిశెట్టి అనూప్ కుమార్, బీఆర్ఎస్ నాయకులు మిడిదొడ్డి నవీన్, పబ్బతి శ్రీనివాస్ రెడ్డి, జీపీ స్వామి, కాలనీవాసులు, మహిళా భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# ఖండ్‌గావ్ ప్రభుత్వ పాఠశాల ఆవరణలో కోతుల బెడద భయాందోళనలో విద్యార్థులు



**బోధన్, ఆగస్టు 11 (జనంసాక్షి** బోధన్ మండలంలోని ఖండ్‌గావ్ గ్రామంలోని ప్రభుత్వ పాఠశాలలో నెలకొన్న కోతుల బెడదను నివారించి విద్యార్థులను సురక్షితమైన వాతావరణంలో విద్యను అభ్యసించే విధంగా చర్యలు తీసుకోవాలని తెలంగాణ విద్యార్థి పరిషత్ డివిజన్ అధ్యక్షులు మీసాలే నగేష్ కోరారు. మంగళవారం గ్రామంలోని పాఠశాలను సందర్శించి,పాఠశాలలోని సమస్యలను పరిశీలించారు. ఈ సందర్భంగా విద్యార్థులకు అందుతున్న మధ్యాహ్న భోజనాన్ని తనిఖీ చేయడంతో పాటు పాఠశాల పరిసరాలను పరిశీలించారు. పాఠశాల పరిసర ప్రాంతాల్లో కోతుల బెడద పెరిగిపోవడంతో విద్యార్థులు తీవ్ర భయాందోళనలకు గురవుతున్నారని గుర్తించారు. కోతులు పాఠశాల ఆవరణలోకి రావడంతో విద్యార్థులు భయపడుతున్నారని, ఏదైనా ప్రమాదం జరిగే అవకాశం ఉందని తెలంగాణ విద్యార్థి పరిషత్ బోధన్ డివిజన్ అధ్యక్షులు మీసాలే నాగేష్ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, విద్యార్థుల భద్రత విషయంలో అధికారులు ఏమాత్రం నిర్లక్ష్యం వహించకూడదని అన్నారు. పాఠశాల ఆవరణలోకి కోతులు రాకుండా రక్షణ చర్యలు, సంబంధిత శాఖల ద్వారా కోతుల బెడదకు శాశ్వత పరిష్కారం చూపించాలని డిమాండ్ చేశారు. అలాగే విద్యార్థులకు ఎలాంటి ప్రమాదం జరగకముందే సంబంధిత అధికారులు స్పందించి తక్షణ చర్యలు చేపట్టాలని కోరారు. సమస్యను నిర్లక్ష్యం చేసి ఏదైనా ప్రమాదం జరిగితే దానికి అధికారులే బాధ్యత వహించాల్సి ఉంటుందని హెచ్చరించారు. విద్యార్థుల భద్రతకు అత్యంత ప్రాధాన్యత ఇచ్చి, ఖండ్‌గాం ప్రభుత్వ పాఠశాలలో కోతుల బెడదను వెంటనే నివారించాలని తెలంగాణ విద్యార్థి పరిషత్ డిమాండ్ చేస్తోంది. ఈ కార్యక్రమంలో పట్టణ కార్యదర్శి వీరేష్, విద్యార్థులు పాల్గొన్నారు

# ప్రభుత్వ పాఠశాలలో చదువుతున్న విద్యార్థులకు యూనిఫామ్ అందించని ప్రభుత్వం



**ముస్తాబాద్ ఆగస్టు 11 (జనం సాక్షి)** ముస్తాబాద్ మండలం కేంద్రంలోని బిఆర్ఎస్వి మండల అధ్యక్షులు ఎండి నవాజ్ మాట్లాడుతూ మండలంలోని ప్రభుత్వ పాఠశాలల్లో విద్యను అభ్యసిస్తున్న విద్యార్థులకు విద్యా సంవత్సరం ప్రారంభమై దాదాపు రెండు నెలలు పూర్తయి నప్పటికీ, ప్రభుత్వం అందించాల్సిన యూనిఫామ్స్ అందలేదు కాబట్టి ఈ విషయాన్ని అత్యవసరంగా పరిగణించి సంబంధిత అధికారులతో మాట్లాడి ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులందరికీ వెంటనే యూనిఫామ్స్ అందేలా చర్యలు తీసుకోవాలని బి ఆర్ ఎస్ వి మండల శాఖ ఆధ్వర్యంలో ఎం ఈఓ గారికి వినతి పత్రం ఇవ్వడం జరిగిందిప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న పేద మధ్యతరగతి కుటుంబాలకు చెందిన విద్యార్థులకు ప్రభుత్వం అందించే యూని దీఫామ్స్ విద్యా సంవత్సరం ప్రారంభమై రెండు నెలలు గడిచినా యూనిఫామ్స్ అందకపోవడం ప్రభుత్వం విద్యార్థుల పట్ల వహిస్తున్న నిర్లక్ష్యనికి నిదర్శనం, గతంలో కేసీఆర్ గారి బిఆర్ఎస్ ప్రభుత్వం లో విద్యా సవంవత్సరం ప్రారంభంఅయిన వెంటనే పుస్తకాల తో పటే యూనిఫామ్స్ అందించే వారు , కానీ ఈ అసమర్థ కాంగ్రెస్ ప్రభుత్వం పాఠశాలలు ప్రారంభంఅయ్యి రెండు నెలలు గడిచినా ఎక్కడ వేసిన గొంగడి అక్కడే ఉంది ,ఈ అసమర్థ కాంగ్రెస్ ప్రభుత్వం విద్యాశాఖ మంత్రిని నియమించాలి లేదా విద్యాశాఖ మంత్రి గా ఉన్న ముఖ్యమంత్రి వెంటనే రాజీనామా చెయ్యాలి అని విద్యార్థుల పక్షాన మండల నాయకుల డిమాండ్ చెయ్యడం జరిగింది,ఇట్టి కార్యక్రమం లో మండల అధ్యక్షులు ఎండి నవాజ్ ,మొర్రైపల్లి ఉప సర్పంచ్ పల్లె ఆనంద్ నాయకులు ముక్క గుణశేఖర్ ,కస్తూరి సాయి ,బండ రమేష్,కొల్లూరి మహేష్ ,సృజిత్, దేవేందర్ ,మహేష్ ,ప్రభాస్ , చరణ్ తదితరులు పాల్గొన్నారు

## అన్నదమ్ముల భూ వివాదం గొడవలో సాగుకు అడ్డంకులు



**వీణవంక ఆగస్టు11(జనంసాక్షి)** వీణవంక మండల ఉన్నతాధికారులు న్యాయం చేయాలని రైతులు తమ ఆవేదన వ్యక్తం చేశారు. వివరాలలోకి వెళ్తే వీణవంక మండలంలోని వల్భాపూర్ గ్రామానికి చెందిన ఈరబోయిన శ్రీనివాస్,రవీందర్, దేవేందర్ లు ముగ్గురు అన్నదమ్ములు తండ్రి ద్వారా వారసత్వం నుండి వచ్చిన వ్యవసాయ భూమిని 20 సంవత్సరాల క్రితం ముగ్గురు అన్నదమ్ములు ఇట్టి వ్యవసాయ భూమిని మూడు వాటాలుగా పంచుకునీ వ్యవసాయం చేసుకుంటున్నామని అన్నారు. అన్నదమ్ముళ్లలో రెండో వ్యక్తి రవీందర్ సంవత్సరం క్రితం నుండి తమని తీవ్ర ఇబ్బందులకు గురి చేస్తున్నాడని రెండు నెలల క్రితం వ్యవసాయ పొలానికి నారు పోసిన నుండి పొలంలో నాటు వేయకుండా వ్యవసాయ బావి కరెంట్ స్టార్టర్ పీకి వేయడం,వైరు కట్ చేసి పొలంలో వైర్ వేయడం చేస్తున్నాడని అతనితో మాకు ప్రాణానికి హాని ఉందని తాము వీణవంక పోలీసు స్టేషన్ లో పలుమార్లు పిర్యాదు చేసిన పోలీసులు పట్టించుకోవడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి సమస్యను పరిష్కరించి రవీందర్ పై చర్యలు తీసుకోవాలని పత్రిక విలేకరుల ద్వారా వేడుకున్నారు.

## అంగన్వాడి చిన్నారులకు పలు అంశాలపై అవగాహన



**బోధన్, ఆగస్టు 11 ( జనంసాక్షి ) :** సాలూర మండలం ఖాజాపూర్ గ్రామంలోని అంగన్వాడి కేంద్రంలో బి.ఎస్సీ అగ్రికల్చర్ జగిత్యాల విద్యార్థుల ఆధ్వర్యంలో పరిశుభ్రత, పోషకాహార అవగాహన కార్యక్రమంను మంగళవారం నిర్వహించారు. చిన్నారులకు భోజనానికి ముందు చేతులు సబ్బుతో కడుక్కోవడం, గోళ్లు శుభ్రంగా ఉంచుకోవడం, రోజూ స్నానం చేయడం, జుట్టు సరిగా దువ్వుకోవడం వంటి వ్యక్తిగత పరిశుభ్రత అలవాట్ల ప్రాముఖ్యతను వివరించారు. పిల్లల ఆరోగ్యకర ఎదుగుదలకు సమతుల్య ఆహారం, పండ్లు, కూరగాయలు, ఆకుకూరలు, పప్పులు, పాలు ప్రాముఖ్యతను తెలియజేశారు. ప్రదర్శన ద్వారా అవగాహన కల్పించారు. బి.ఎస్సీ అగ్రికల్చర్ జగిత్యాల విద్యార్థులు, అంగన్‌వాడీ టీచర్, తల్లిదండ్రులు, చిన్నారులు, గ్రామస్థులు పాల్గొన్నారు.

## గ్రామ పంచాయతీలో ఉప సర్పంచ్ పెత్తనం



**నిజామాబాద్ జిల్లా ప్రతినిధి ఆగస్టు 11 జనం సాక్షి :** బడా భీంగల్ ప్రజలను మభ్యపెట్టి ఎన్నో హామీలు ఇచ్చి గెలిచిన తర్వాత ఏ ఒక్కటి అమలు చేయకుండా సర్పంచ్ అందుబాటులో ఉండడం లేదని మండల కాంగ్రెస్ పార్టీ ప్రధాన కార్యదర్శి రాగుల గంగా మోహన్, గ్రామ శాఖ అధ్యక్షుడు దాకటి స్వామి ఆవేదన వ్యక్తం చేశారు. ఈ మేరకు బడా భీంగల్ గ్రామంలో మండల కాంగ్రెస్ పార్టీ ప్రధాన కార్యదర్శి రాగుల గంగా మోహన్, గ్రామ శాఖ అధ్యక్షుడు దాకటి స్వామి, గ్రామస్తుల ఆధ్వర్యంలో విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ నాయకులు రాగుల గంగా మోహన్ మాట్లాడుతూ.. సర్పంచ్ గా గెలిచిన తరువాత స్థానికంగా ఉంటానని ప్రజలను నమ్మించి మోసం చేశారనీ, అలివి కానీ హామీలు ఇచ్చి, సర్పంచ్ అందుబాటులో ఉండడం లేదన్నారు. ఉప సర్పంచ్ పెత్తనం సాగించడం ఎంటనీ ప్రశ్నించారు. సొంత ఖర్చులతో అంబులెన్స్, జిమ్ ఏర్పాటు చేస్తానని ప్రధాన హామీగా ఇచ్చి, ఎందుకు అమలు చేయడం లేదన్నారు. సర్పంచ్ అందుబాటులో ఉండి గ్రామాన్ని అభివృద్ధి చేయాలని సూచించారు. ఎన్నికల్లో 24 గంటలు గ్రామంలోనే ఉంటూ సేవ చేస్తానని చెప్పడంతో నమ్మి ప్రజలు ఓట్లు వేశారని, గెలిచిన తరువాత సర్పంచ్ భర్త ఉపసర్పంచ్ పెత్తనం చెలాయించడం ఏంటన్నారు. గ్రామస్తులకు సమస్యలు వస్తే సర్పంచ్ కు చెప్పుకుందామంటే కుర్చీ ఖాళీగా ఉంటుందని, మా సమస్యలు ఎవరికి చెప్పుకోవాలో అర్థం కావడం లేదన్నారు. గెలిచిన సర్పంచ్ ప్రజలకు సేవ చేయాల్సిన అవసరం ఎంతైనా ఉందనీ డిమాండ్ చేశారు. గ్రామపంచాయతీ ప్రజా సమస్యలు తీర్చాల్సింది పోయి ప్రైవేట్ పంచాయతీలకు అడ్డగా మార్చారన్నారు. ఈ విలేకరుల సమావేశంలో గ్రామ శాఖ అధ్యక్షుడు దాకటి స్వామి, రాగుల లింబాద్రి, ఆకుల గంగాధర్, జంగం ప్రభు, రాగుల కిషన్, మాజీ ఎంపీటీసీ వల్లి, ముచ్కూర్ నరేష్, పల్లె మహిపాల్, సూల్ల భూమన్న, అయేటి రవీందర్, గురిజల రాజ గంగారం, దండు మహేష్ తదితరులు పాల్గొన్నారు.

# వ్యక్తిగత గొడవను ఎమ్మెల్యే గంగుల

**కరీంనగర్ బ్యూరో, ఆగస్టు 11 (జనంసాక్షి)** :కరీంనగర్ శాసన సభ్యులు గంగుల కమలాకర్ వ్యక్తిగత గొడవలు, తగాదాలను సాకుగా మలుచుకొని భారతీయ జనతా పార్టీకి వాటిని అంటగట్టడం చాలా ధారుణమని బీజేపీ రాష్ట్ర అధికార ప్రతినిధి, నగర డిప్యూటీ మేయర్ యాదగిరి సునీల్ రావు మండిపడ్డారు. కరీంనగర్ లో మంగళవారం ఓ ప్రైవేటు ఫంక్షన్ హాల్ లో విలేకరుల సమావేశంలో డిప్యూటీ మేయర్ యాదగిరి సునీల్ రావు కిసాన్ నగర్ ప్రాంతంలో జరిగిన గొడవ పై ఘాటుగా స్పందించారు. వ్యక్తిగత గొడవను, తగాధాలను ఎమ్మెల్యే గంగుల కమలాకర్ బీజేపీ పార్టీకి అంటగడుతూ, వాఖ్యలు చేయడం పట్ల ఫైర్ అయ్యారు. ఈ సందర్భంగా సునీల్ రావు మాట్లాడుతూ... బీజేపీ కార్పోరేటర్ సోమిడి వేణు గతంలోనే కారుతో ఢీ కొట్టి ధాడిచేసి గాయపరిచి, ఆయన పోలీస్ స్టేషన్ లో ఫిర్యాదు చేసినా మేము ఎవరిపై నిందారోపణలు చేయలేదని స్పష్టం చేశారు. ఆయన పై చేసిన ధాడిని వ్యక్తిగత ధాడిగానే భావించాం తప్పా బీఆర్ఎస్ పార్టీ నాయకులకు అంటగట్టే ప్రయత్నం చేయలేదని ద్వజమెత్తారు. ఈ విషయాన్ని శాసన సభ్యులు గంగుల కమలాకర్ గమనించాలని హితువు పలికారు. 4 సార్లు శాసన సభ్యులుగా గెలిచామని చెబుతున్న గంగుల కమలాకర వ్యక్తిగత కక్షలను, ధాడులను మా పార్టీ పై రుద్దడం మానుకోవాలని, కిసాన్ నగర్ ఘటనను బీజేపీ పార్టీకి అంటగడ్డి రాజకీయ పబ్బం గడుపుకోవడం మంచిదికాదని మండిపడ్డారు. . ఈ



ఘటన విషయంలో ప్రధానంగా మా నాయకులు బండి సంజయ్ కుమార్ పేరును వాడటం చాలా దుర్మార్గమని నిప్పులు చెరిగారు. బీజేపీ పార్టీకి మేయర్ పదవిని కట్టబెడితే, ధాడులకు పాల్పడుతున్నారని ఘోరమైన వాఖ్యలు చేయడం చాలా సిగ్గుచేటని ద్వజమెత్తారు.ు. మీరు కరీంనగర్ ను అభివృద్ధి చేస్తే, మీ పార్టీకి ఎందుకు సీట్లు రాలేదని, ప్రజలు మిమ్మల్ని ఎందుకు ఆదరించలేదని చెప్పాలని డిమాండ్ చేశారు. సీనియర్ శాసన సభ్యులుగా కొనసాగుతూ, మంత్రిగా పనిచేసి ఈ విధమైన వాఖ్యలు చేయడం సరికాదని, అధికారం ఎవరికి శాశ్వతం కాదని, అధికారం ఉన్నప్పుడు ఒక రకంగా, లేనప్పుడు ఇంకో రకంగా మాట్లాడటం మంచి పద్దతి కాదని హెచ్చరించారు. కేంద్ర మంత్రి బండి సంజయ్ కుమార్ నేతృత్వంలో కరీంనగర్ నగర అభివృద్ధి జరిగిందని ప్రజలు విశ్వసించి, భారతీయ జనతా పార్టీని అధిక స్థానాల్లో గెలిపించి మేయర్ పీఠం కట్టబెట్టారని స్పష్టం చేశారు. గత పది సంవత్సరాల బీఆర్ఎస్ హాయంలో ఎన్ని పోలీస్ కేసులు అయ్యాయో స్టేషన్లలో రికార్డు తీసుకోవాలన్నారు. ఇప్పటికైన గంగుల కమలాకర్ ఇలాంటి చౌకబారు ఆరోపణలు నిందలు వేయడం మానుకోవాలని హెచ్చరించారు. ఈ విలేకరుల సమావేశంలో బీజేపీ కార్పోరేటర్లు బండ రమణారెడ్డి, ఓంటెల సత్యనారాయణ రెడ్డి, చొప్పరి జయశ్రీ, మాసం గణేష్, పొన్నం మొండయ్య గౌడ్, బండారి వేణు, కె ఏపిపి చంద్ర (టింకు), దేవసాని సత్యనారాయణ, నాంపల్లి శ్రీనివాస్, కర్రె అనిల్, తోట అనిల్, కో ఆప్షన్ సభ్యులు కన్న కృష్ణ, చిగురు రవి, నాయకులు పండుగ నాగరాజు, వెంకట్ రెడ్డి, శివ, చంద్రమౌళి, అనిల్, హమీద్ తదితరులు పాల్గొన్నారు.

# చలో కలెక్టరేట్ ను విజయవంతం చేయండి

కరీంనగర్ బ్యూరో, ఆగస్టు 11 (జనంసాక్షి) :ఆగష్టు 17న భారతీయ మజ్దూర్ సంఘ్ (బి.ఎం.ఎస్.) చేపడుతున్న 'చలో కలెక్టరేట్' కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని బీడీ కార్మిక సంఘం జాతీయ ప్రధాన కార్యదర్శి మోత్కూరి సుధీర్ కుమార్ పిలుపునిచ్చారు. మంగళవారం కరీంనగర్ లోని బి.ఎం.ఎస్. కార్యాలయంలో జరిగిన జిల్లా కమిటీ సమావేశానికి ముఖ్యఅతిథిగా హాజరై అనంతరం మాట్లాడుతూ... జార్ఖండ్ రాష్ట్ర రాజధాని రాంచీలో జూలై 26, 27, 28 తేదీలలో జరిగిన బి.ఎం.ఎస్. కేంద్ర కార్యకారిణి సమావేశంలో దేశవ్యాప్తంగా ఉన్న కోట్లాది మంది కార్మికులు, ఉద్యోగుల సమస్యలపై విస్తృతంగా చర్చించారని, దశాబ్దాలుగా పెండింగ్‌లో ఉన్న కార్మిక వర్గ న్యాయమైన డిమాండ్ల సాధనకై 2026 ఆగస్టు 17న దేశవ్యాప్తంగా అన్ని జిల్లా కేంద్రాలలో భారీ నిరసన కార్యక్రమాలు నిర్వహించాలని నిర్ణయించామని తెలిపారు. ఈ పోరాటం కేవలం ఏ ఒక్క రంగానికో పరిమితం కాదని, అసంఘటిత రంగ కార్మికులు, బీడీ కార్మికులు, బ్యాంకులు, ఎల్.ఐ.సి., ఇ.పి.ఎస్. 95 పింఛనుదారులు, పథక కార్మికులు (అంగన్‌వాడీ,




మధ్యాహ్న భోజన పథకం, ఆశా సిబ్బంది), భవన నిర్మాణ కార్మికులు, ప్లాట్‌ఫార్మ్ కార్మికులు, రవాణా కార్మికుల హక్కుల సాధన కోసం జరుగుతున్న చారిత్రాత్మక పోరాటమని మోత్కూరి సుధీర్ కుమార్ పేర్కొన్నారు. ఇ.యస్.ఐ.సి. అర్హత వేతన పరిమితిని రూ. 21,000 నుండి రూ. 42,000 కు పెంచి కార్మికులకు నాణ్యమైన వైద్య సేవలు అందించాలని, ఇ.పి.ఎఫ్. కనీస పెన్షన్‌ను రూ. 1,000 నుండి రూ. 7,500 కు పెంచి దానికి కరువు భత్యం (డి.ఎ.) అనుసంధానించాలని, ఉచిత ఇ.యస్.ఐ. / ఆయుష్మాన్ భారత్ వైద్య సౌకర్యం కల్పించాలని, ఇ.పి.ఎఫ్. వేతన పరిమితిని రూ. 15,000 నుండి రూ. 30,000 కు పెంచాలని, కనీస వేతనం రూ. 30,000 లకు పెంచాలని డిమాండ్ చేశారు. ఒప్పంద, బాహ్య నిర్వహణ ఉద్యోగులకు సర్వోన్నత న్యాయస్థానం (సుప్రీంకోర్టు) తీర్పు ప్రకారం సమాన వేతనం వర్తింపజేయాలని అన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర ఉపాధ్యక్షులు పపుల సురేష్ , జిల్లా అధ్యక్షులు పసుల శ్రవణ్, కార్యదర్శి తొర్తి శ్రీనివాస్, గోంటి సురేందర్, రేజీగుంట శంకర్, ఆవదుర్తి రవి, ప్రసాద్ మధుకర్, మురళి తదితరులు పాల్గొన్నారు.

## నూతన పెన్షన్లకు దరఖాస్తులో బీడీ కార్మికుల ఆప్షన్ లేనందున బీడీ కార్మికుల ధర్నా

**మల్లాపూర్ ఆగస్టు 11(జనంసాక్షి)**ప్రభుత్వం నూతనంగా ప్రవేశపెట్టిన పెన్షన్లలో భాగంగా అప్లికేషన్ ఫామ్ లో బీడీ కార్మికులకు సంబంధించిన చేయూత ఆప్షన్ లేకపోవడం చాలా బాధాకరమని మల్లాపూర్ మండలానికి చెందిన బీడీ కార్మికులు మంగళవారం మల్లాపూర్ మండల కేంద్రంలోని భరతమాత కూడలి వద్ద ధర్నా నిర్వహించారు. సంఘటన స్థలానికి స్థానిక ఎస్సై అనిల్ కుమార్ యాదవ్, ఎంపీడీవో అల్వాల శ్రీకాంత్ ధర్నా వద్దకు వచ్చి మహిళలతో మాట్లాడి ప్రభుత్వం దృష్టికి



తీసుకెళ్తాం బీడీ పెన్షన్ బీడీ కార్మికులకు వచ్చే విధంగా నివేదిక పంపుతామని తెలిపారు అందరితో మహిళలు ధర్న విరమింప చేశారు, అనంతరం బీడీ కార్మికులు ఎంపీడీవోకి వినతి పత్రం అందజేశారు

## ఘనంగా మహంకాళి బోనాల పండుగ



**గంభీరావుపేట ఆగస్టు 11 (జనం సాక్షి;)**గంభీరావుపేటలో అంబేద్కర్ యువజన మాదిగ సంఘం ఆధ్వర్యంలో మహంకాళి బోనాల పండుగను భక్తిశ్రద్ధలతో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా అమ్మవారికి బోనాలు సమర్పించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. మహిళలు పెద్ద సంఖ్యలో పాల్గొని బోనాలు ఎత్తుకుని అమ్మవారిని దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు. ఈ కార్యక్రమానికి సంఘం అధ్యక్షుడు ఇరిగి పరశురాం, ప్రధాన కార్యదర్శి శనిగారపు శ్రీనివాస్, ఉపాధ్యక్షుడు బరుకుటం తిరుపతి, సీనియర్ నాయకులు ఎర్రోళ్ల భీమ్రావు, ఎర్రోళ్ల ప్రభాకర్, ఇరిగి నరసింహులు, ఎర్రోళ్ల శ్రీహరి, ఇరిగి ఎల్లయ్య, ఎర్రోళ్ల బాలరాజు, శనివారం శంకరయ్య, బరుకుటం ప్రమోద్ తదితరులు హాజరయ్యారు. భక్తులు, మహిళలు పెద్ద సంఖ్యలో పాల్గొని మహంకాళి అమ్మవారి ఆశీస్సులు పొందారు

## గుండ్ల చెరువు వద్ద పేకాట స్థావరంపై పోలీసుల దాడి ముగ్గురు అరెస్ట్



**కామారెడ్డి, జిల్లా ప్రతినిధిఆగస్టు 11(జనం సాక్షి)**దోమకొండ మండలం గుండ్ల చెరువు వద్ద నిర్వహిస్తున్న పేకాట స్థావరంపై పోలీసులు ఆకస్మికంగా దాడి చేసి ముగ్గురు వ్యక్తులను పట్టుకున్నారు. విశ్వసనీయ సమాచారం మేరకు దోమకొండ ఎస్సై ప్రభాకర్ ఆధ్వర్యంలో పోలీసు సిబ్బంది ఈ దాడి నిర్వహించారు. పేకాట ఆడుతున్న ముగ్గురు వ్యక్తులను అదుపులోకి తీసుకున్న పోలీసులు, పేకాటలో వినియోగిస్తున్న రూ. 28,000 నగదును స్వాధీనం చేసుకున్నారు. ఘటనపై సంబంధిత చట్టాల ప్రకారం కేసు నమోదు చేసి దర్యాప్తు కొనసాగిస్తున్నారు. ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ మాట్లాడుతూ "జూదం గెలుపు కాదు.. జీవితాన్ని ఓడించే వ్యసనం" అని పేర్కొన్నారు. జూదానికి బానిసై విలువైన సమయం, డబ్బును కోల్పోవడంతో పాటు కుటుంబాల భవిష్యత్తును నాశనం చేసుకోవద్దని సూచించారు. ముఖ్యంగా యువత పేకాట, జూదం వంటి చట్టవిరుద్ధ కార్యకలాపాలకు దూరంగా ఉండి తమ భవిష్యత్తుపై దృష్టి సారించాలని తెలిపారు. జూదం ద్వారా సులభంగా డబ్బు సంపాదించాలనే ఆలోచన చివరకు ఆర్థిక, కుటుంబ సమస్యలకు దారితీస్తుందని ఎస్పీ హెచ్చరించారు. జిల్లాలో ఎక్కడైనా పేకాట, జూదం వంటి చట్టవిరుద్ధ కార్యకలాపాలు జరుగుతున్నట్లు సమాచారం ఉంటే వెంటనే డయల్-100 లేదా సమీప పోలీస్ స్టేషన్‌కు సమాచారం అందించాలని ప్రజలకు విజ్ఞప్తి చేశారు.

## ఇంటి పైన జాతీయ జెండాను ఎగరవేయాలి


**మల్లాపూర్ ఆగస్టు11 (జనం సాక్షి)**మల్లాపూర్ మండలం వేంపల్లి వెంకట్రావుపేట గ్రామంలో మంగళవారం రోజున హర్ ఘర్ తిరంగ బైక్ ర్యాలీ కార్యక్రమం బీజేపీ మండల అధ్యక్షుడు గోపిడిశ్రీనివాస్ రెడ్డి ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో వేంపల్లి గ్రామ సర్పంచ్ గుగ్లావత్ రాజేందర్, మిట్టపల్లి దివాకర్ రెడ్డి, గోపిడేని రాజేందర్,ఆరెల్లి



కిషన్,వేముల నరేష్, , రాజ్ యాదవ్ వేల్పుల, రాగెల్లి రాజేశం, భుక్య మహేష్, పంజాల సత్యనారాయణ, గుగ్లావత్ రాజేష్, గేడెం మారుతి, పన్నాల శ్రీను, శ్రీహరి, మల్లాపూర్ 13వ వార్డు మెంబర్ శేఖర్ వేంపల్లి గ్రామ భారతీయ జనతా పార్టీ కార్యకర్తలు, నాయకులు పాల్గొన్నారు.

# గడపగడపకు సీఎంఆర్‌ఎఫ్ చెక్కులు పంపిణీ

**జమ్మికుంట, ఆగస్టు11(జనం సాక్షి):**హుజురాబాద్ నియోజకవర్గంలో ప్రతీ గడపకు కాంగ్రెస్ ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాన్ని అందజేస్తానని హుజురాబాద్ కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇంచార్జి వొడితల ప్రణవ్ అన్నారు. మంగళవారం రోజున జమ్మికుంట మండల పరిధిలోని మాచ నపల్లి ఎద్దం పల్లి ,జగ్గయ్యపల్లి,సైదాబాద్,కోరపల్లి,విలాసాగర్,నగుర ం,వావిలాల,తనుగుల,గండ్రపల్లి,శాయంపేట,మడి పల్లి గ్రామాల్లో 11 లక్షల విలువ చేసే సిఎం ఆర్ఎఫ్ చెక్కులను 34 మంది లబ్ధిదారులకు నేరుగా వారి ఇంటికి వెళ్లి అందజేశారు. ఈ సంద



ర్భంగా లబ్ధిదారులు ఆత్మీయంగా పలకరించి కాంగ్రెస్ ప్రభుత్వం ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, ఇంచార్జి ప్రణవ్ మాకు అండగా ఉండి కష్టకాలంలో మమ్ములను ఆదుకున్నారని లబ్ధిదారులు తెలిపారు. అనంతరం ప్రణవ్ మాట్లాడుతూ ఇంటి,ఇంటికి వెళ్లి చెక్కులు ఇస్తున్నప్పుడు వారి కష్టాల్లో పాలుపంచుకోవడం జరుగుతుందని,ముఖ్యమంత్రి సహాయనిధి ద్వారా పేదలను ఆదుకుంటామని,గ్రామాల్లో నెలకొన్న సమస్యలను పరిష్కరిస్తామని అన్నారు. ఈ కార్యక్ర మంలో జమ్మికుంట మండల అధ్యక్షుడు వీరవ ఎనేని పరశురామ్,మాచనపల్లి గ్రామ సర్పంచ్ పార్లపల్లి విజయకుమార్ ఇంకా వివిధ గ్రామాల సర్పంచులు ,ఉప సర్పంచులు ,వార్డ్ సభ్యులు, మార్కెట్ డైరెక్టర్లు,పార్టీ సీనియర్ నాయకులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

## తానాకలాన్ లో ముగిసిన ఊర పండుగ వేడుకలు



**ఎడపల్లి, ఆగస్టు 11 ( జనంసాక్షి) :**ఎడపల్లి మండలం తానాకలాన్ గ్రామంలో గత ఐదు రోజుల నుండి నిర్వహిస్తున్న ఊర పండుగ వేడుకలు మంగళవారంతో ముగిసాయి. గ్రామ అభివృద్ధి కమిటీ ఆధ్వర్యంలో ఊర పండుగను ఘనంగా నిర్వహించారు. 12 సంవత్సరాల తర్వాత నిర్వహిస్తున్న ఊర పండుగకు గ్రామంలోని ప్రతి కులాలకు చెందిన మహిళలు ప్రజలు ఆలయాల వద్ద పోటెత్తారు. గ్రామంలోని గ్రామదేవతలకు ప్రత్యేక పూజలు నిర్వహించిన అనంతరం బలి సైతం నిర్వహించడం జరిగింది. గ్రామంలోని గ్రామదేవతలు గ్రామంపై కరుణ చూపడంతో పాటు పాడిపంటలు సమృద్ధిగా పండాలని వర్షాలు బాగా కురవాలని కోరుతూ గ్రామస్తులు ప్రత్యేక పూజలను నిర్వహించారు. ఎంతో వైభవంగా నిర్వహించిన ఊర పండుగలో గ్రామ సర్పంచ్ గెంటే అలేఖ్య శ్రీనివాస్, గ్రామ అభివృద్ధి కమిటీ సభ్యులు, గ్రామ పెద్దలు, మహిళలు పాల్గొన్నారు.

## గుడ్ టచ్ బ్యాడ్ టచ్‌పై విద్యార్థులకు అవగాహన



**గోదావరిఖని,ఆగస్టు 11( జనంసాక్షి ):**రామగుండం పోలీస్ కమిషనర్ ఆదేశాల మేరకు పెద్దపల్లి షీ టీమ్ ఆధ్వర్యంలో గోదావరిఖని అశోక్‌నగర్ జెడ్పీహెచ్ఎస్ హైస్కూల్ విద్యార్థులకు మహిళలు,బాలల భద్రత,సైబర్ నేరాలు, మాదకద్రవ్యాలపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా షీ టీమ్ ఇన్‌చార్జి ఎస్ఐ లావణ్య విద్యార్థులకు గుడ్ టచ్,బ్యాడ్ టచ్, పోక్సో చట్టం,సోషల్ మీడియా వినియోగం, సైబర్ మోసాలు, మాదకద్రవ్యాల దుష్ప్రభావాలపై అవగాహన కల్పించారు. అపరిచిత వ్యక్తుల పట్ల అప్రమత్తంగా ఉండాలని, వేధింపులకు గురైతే భయపడకుండా షీ టీమ్ 6303923700కు సమాచారం అందించాలని సూచించారు. అత్యవసర పరిస్థితుల్లో 100/112,సైబర్ మోసాలకు గురైతే వెంటనే 1930కు ఫిర్యాదు చేయాలని తెలిపారు. మహిళలు ప్రయాణ సమయంలో భద్రత కోసం టీ–సేఫ్ యాప్‌ను వినియోగించుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో హెడ్‌మాస్టర్ మల్లేష్, ఉపాధ్యాయులు,షీ టీమ్ సభ్యులు సురేష్,మౌనిక, స్నేహలత తదితరులు పాల్గొన్నారు.

## ఎడపల్లి ప్రభుత్వ ఆసుపత్రిలో బోనాల వేడుకలు



**ఎడపల్లి, ఆగస్టు 11 ( జనంసాక్షి ) :** ఎడపల్లి మండల కేంద్రంలోని ప్రభుత్వ ఆసుపత్రిలో మంగళవారం బోనాల వేడుకలను ఆరోగ్య సిబ్బంది ఘనంగా నిర్వహించారు. ఆసుపత్రి వైద్యులు డాక్టర్ వినీత్ రెడ్డి, ఏఎన్ఎంలు బోనం ఎత్తుకొని ఆసుపత్రి ఆవరణలోనే నెలకొన్న అమ్మవారి చెంతకు వెళ్లారు. అనంతరం అక్కడ ప్రత్యేక పూజలు నిర్వహించి మక్కులు తీర్చుకున్నారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ వినీత్ రెడ్డి, ఆరోగ్య సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# కేసీఆర్‌ను ఓడించి తప్పు చేశాం

**సదాశివనగర్, ఆగస్టు11 (జనంసాక్షి)**మా బతుకుదెరువు, మా బాగోగులు చూసిన కేసీఆర్‌ను ఓడించి తప్పు చేశాం.. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత మా బతుకులు బజారుపడ్డాయి” అంటూ రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. సదాశివనగర్ మండలం ఉత్తునూర్ గ్రామంలో రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన ఓ కార్యకర్త కుమారుడి కుటుంబాన్ని పరామర్శించి తిరిగి కామారెడ్డి వెళ్తున్న బీఆర్ఎస్ మాజీ ఎమ్మెల్యే జాజాల సురేందర్‌ను దగ్గిరోడ్ వద్ద రైతులు పెద్ద సంఖ్యలో పాల్గొని తమ సమస్యలను ఏకరువు పెట్టారు. మాజీ ఎమ్మెల్యే వాహనాన్ని ఆపిన రైతులు తమతో కలిసి చాయ్ తాగాలని పట్టుబట్టి సమీపంలోని హోటల్‌కు తీసుకెళ్లారు. అక్కడ రైతులతో కాసేపు కూర్చున్న మాజీ ఎమ్మెల్యేకు రైతులు తమ సమస్యలను వివరించారు. ప్రధానంగా యూరియా, ఎరువుల కొరత, వ్యవసాయానికి సక్రమంగా విద్యుత్ సరఫరా లేకపోవడం వంటి సమస్యలను ఆయన దృష్టికి తీసుకెళ్లారు. ఈ సందర్భంగా రైతులు మాట్లాడుతూ.. కేసీఆర్ పాలనలో పదేళ్ల పాటు వ్యవసాయానికి అనుకూల పరిస్థితులు ఉండటంతో తమకు లాభాలు వచ్చి ఆర్థికంగా



నిలదొక్కుకున్నామని తెలిపారు. ప్రస్తుతం కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత రైతుల పరిస్థితి దయనీయంగా మారిందని ఆవేదన వ్యక్తం చేశారు. రాష్ట్రంలో కాంగ్రెస్, కేంద్రంలో బీజేపీ ప్రభుత్వాలు రైతుల సమస్యలను పట్టించుకోవడం లేదని ఆరోపించారు. పంటల సాగు ఖర్చులు, ఎరువుల ధరలు పెరగడంతో రైతులపై భారం మరింత పెరిగిందన్నారు.రైతుల సమస్యలను పరిష్కరిం చడంలో ప్రభుత్వాలు విఫలమవుతున్నాయని వారు ఆవేదన వ్యక్తం చేశారు. రానున్న ఎన్నికల కోసం తాము ఎదురుచూస్తున్నామని, రైతు బాంధవుడిగా భావించే బీఆర్ఎస్ అధినేత కేసీఆర్‌ను మరోసారి ముఖ్యమంత్రిగా గెలిపించుకుంటామని పలువురు రైతులు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే జాజాల సురేందర్‌తో పాటు ఉమ్మడి సదాశివనగర్ మండల మాజీ జెడ్పీటీసీ పడిగెల రాజేశ్వరరావు, బీఆర్ఎస్ సీనియర్ నాయకులు భాస్కర్, బుచ్చయ్య, శీను నాయక్, రమేష్ నాయక్, రవి తదితరులతో పాటు రైతులు సాయిలు, మల్లయ్య, రాజయ్య, రాములు, రాజమల్లయ్య, ఎల్లయ్య, పోచయ్య తదితరులు పాల్గొన్నారు.

# మహిళా న్యాయవాదులకు ఆటల పోటీలు

**కరీంనగర్ లీగల్, ఆగస్టు 11 (జనం సాక్షి):** స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలను పురస్కరించుకుని కరీంనగర్ బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో మహిళా న్యాయవాదులకు నిర్వహిస్తున్న ఆటల పోటీల్లో భాగంగా మంగళవారం మ్యూజికల్ చైర్ పోటీలు ప్రారంభమయ్యాయి. బార్ అసోసియేషన్ అధ్యక్షుడు గడ్డం లక్ష్మణ్, ప్రధాన కార్యదర్శి చంద్రపాటి కిరణ్ కుమార్, స్పోర్ట్స్ అండ్ కల్చరల్ సెక్రటరీ ఆధ్వర్యంలో పోటీలను ప్రారంబి ంచారు. ఈ సందర్భంగా గడ్డం లక్ష్మణ్ మాట్లాడుతూ నిత్యం న్యాయవృత్తిలో తీరిక లేకుండా పనిచేసే మహిళా న్యాయవాదులకు క్రీడలు మానసిక ఉల్లాసాన్ని కలిగించడంతో పాటు పరస్పర స్నేహభావాన్ని పెంపొందిస్తాయని అన్నారు. కిరణ్ కుమార్ మాట్లాడుతూ మ్యూజికల్ చైర్, చెస్, క్యారమ్స్ తదితర విభాగాల్లో పోటీలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. విజేతలకు స్వాతంత్ర్య




దినోత్సవం రోజున ప్రత్యేక కార్యక్రమం లో జిల్లా జడ్జి చేతుల మీదుగా బహుమతులు అందజేస్తామని వెల్లడించారు. యాభై ఏళ్లలోపు మహిళల మ్యూజికల్ చైర్ పోటీలకు బార్ అసోసియేషన్ ఎగ్జిక్యూటివ్ మెంబెర్ ఉపాధ్యాయుల కరుణశ్రీ ఇన్‌చార్జిగా వ్యవహరించారు. పలువురు మహిళా న్యాయవాదులు ఉత్సాహంగా పాల్గొన్నారు.

## అర్హులైన ప్రతి ఒక్కరు పెన్షన్ దరఖాస్తు చేసుకోవాలి



**ఆర్మూర్,ఆగస్టు 11(జనంసాక్షి):** అర్హులైన ప్రతి ఒక్కరూ చేయూత పెన్షన్ దరఖాస్తు చేసుకోవాలని ఆర్మూర్ మున్సిపల్ చైర్ పర్సన్ గోనె లహరి రఘు కోరారు. ఆర్మూర్ మున్సిపల్ కార్యాల యంలో మంగళవారం మొదటి పెన్షన్ దరఖాస్తు స్వీకరణను ప్రారంభించారు. చేయూత పెన్షన్లు వితంతువులు,ఒంటరి మహిళలు, వికలాంగులు,గీత కార్మికులు,చేనేత కార్మికులు, డయాలసిస్,ఫైలేరియా వ్యాధిగ్రస్తులైన అర్హులు దరఖాస్తు చేసుకోవాలన్నారు. ఇందుకు అవసరమైన ధ్రువపత్రాలు సమర్పించాలన్నారు .కాంగ్రెస్ ప్రభుత్వం, సీఎం రేవంత్ రెడ్డి ఇచ్చిన హామీలు ఒక్కొక్కటిగా ప్రజలకు చేరువవుతున్నాయన్నారు.ప్రజలందరూ కాంగ్రెస్ అండగా నిలవాలని కోరారు.ఈ కార్యక్రమంలో కౌన్సిలర్ భూపేందర్,నాయకులు బండారి ప్రసాద్, శ్యామ్ గౌడ్,మున్సిపల్ అధికారులు ఉన్నారు.

## ఆదర్శ పాఠశాల లో బోనాల పండుగ వేడుక



**బాల్కొండ 11 ఆగస్టు (జనం సాక్షి)**నిజామాబాద్ జిల్లాబాల్కొండ మండలం తెలంగాణ ఆదర్శపాఠశాల జూనియర్ కళాశాల లో బోనాల పండుగ బోనం కడా లు పోతాజుల వేశదరణలో విద్యార్థిని విద్యార్థులు తెలంగాణ ఆదర్శ పాఠశాల జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ నేతృత్వంలో తెలంగాణ బోనాలు ర్యాలీ జరిగింది విద్యార్థినిల నృత్యాలు తెలంగాణ పాటలు అందరిని మంత్రముగ్ధులిని చేశాయి

## ఎంపీ అరవింద్ కు కృతజ్ఞతలు

**రాయికల్ 11 ఆగస్టు (జనం సాక్షి ):**రాయికల్ మండలం కురుమపల్లె గ్రామానికి ఎంపీ అరవింద్ ధర్మపురి మరియు డాక్టర్. భోగ శ్రావణి సహకారాలతో ఎంపీ నిధులు మంజూరు అయిన సందర్భంగా.. గ్రామానికి చెందిన ఆరవ వార్డు మెంబర్ పుల్ల లత చిరుపుల్ల మల్లేష్ గత ఎన్నికల్లో ఆరవ వార్డు నుండి వార్డ్ మెంబర్ గా ఏకగ్రీవంగా ఎన్నుకున్న సందర్భంగా ఎన్నికల్లో వార్డు ప్రజలకు హామీ ఇవ్వడం జరిగింది. సీసీ రోడ్డు గురించి అతి తక్కువ సమయంలో నిధులు తీసుకువచ్చి హామీని నెరవేర్చడం జరిగింది. నిధులు మంజూరుకు కృషిచేసిన ఎంపీ అరవింద్ మరియు డాక్టర్ భోగ శ్రావణి గారికి గ్రామ ప్రజలు కృతజ్ఞతలు తెలిపారు.

## ఫర్టిలైజర్ షాపులను తనిఖీ చేసిన డి.ఎ.ఓ



**మల్యాల ఆగస్టు 11 (జనం సాక్షి)**మండల కేంద్రంలోని ఫర్టిలైజర్ షాప్ లను మరియు తక్కళ్ళపెల్లి సొసైటీ లను డి.ఎ.ఓ.విభాస్కర్ సోమవారం తనిఖీ చేశారు.షాపుల్లో ఉన్న ఫెర్టిలైజర్ నిలువలు,స్టాక్ రిజిస్టర్ మరియు ఈపాస్ మెషిన్ లను పరిశీలించి,నాసిరకం,అధిక ధరలకు ఎరువులను అమ్మిన చట్టరీత్య చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.తనిఖీలో ఎం.ఎ.ఓ. కే చంద్ర దీపక్,ఏఈఓ లు ఉన్నారు.

# సి ఆర్ పి లకు రిటైర్మెంట్ బెనిఫిట్స్ ఇవ్వాలి



**కోరుట్ల, ఆగస్టు 11(జనం సాక్షి )**జిల్లా పరిషత్ సెకండరీ పాఠశాల (బి) కోరుట్ల స్కూల్ కాంప్లెక్స్ క్లస్టర్ రిసోర్స్ పర్సన్ (సి ఆర్ పి )గా పదిహేను సంవత్సరాలు విశిష్ట సేవలందించి ఉద్యోగ విరమణ పొందిన సత్యనారాయణ ని టి జి యు యస్ జగిత్యాల జిల్లా అధ్యక్షులు నునావత్ రాజు ఘనంగా సన్మానించారు.ఈ సందర్భంగా నునావత్ రాజు మాట్లాడుతూ, విద్యాభివృద్ధికి, ఉపాధ్యాయులకు మార్గదర్శకత్వం అందించడంలో సత్యనారాయణ అందించిన సేవలు చిరస్మరణీయమని అన్నారు. విధి నిర్వహణలో నిబద్ధతతో పనిచేసి ఉపాధ్యాయులు, విద్యార్థులకు అందించిన సేవలు అభినందనీయమని కొనియా డారు.సి ఆర్ పి ల శ్రమను ప్రభుత్వం గుర్తించాలిసర్వశిక్షా అభియాన్ పరిధిలో ఎన్నో సంవత్సరాలుగా విద్యాంగానికి సేవలందించిన సి ఆర్ పి లను ఎలాంటి రిటైర్మెంట్ బెనిఫిట్స్ లేకుండా ఖాళీ చేతులతో ఇంటికి పంపడం తీవ్రంగా బాధాకరమని నునావత్ రాజు అన్నారు.సి ఆర్ పి లు, సర్వశిక్షా అభియాన్ సిబ్బందికి గౌరవప్రదమైన రిటైర్మెంట్ బెనిఫిట్‌గా ప్రభుత్వం ప్రత్యేకంగా ఆర్థిక సహాయం అందించాలని, వారి సేవలకు తగిన గుర్తింపు కల్పించాలని టి జి యు యస్ తరపున డిమాండ్ చేశారు. భవిష్యత్తులో ఉద్యోగ విరమణ పొందే ప్రతి సి ఆర్ పి కు గౌరవప్రదమైన రిటైర్మెంట్ ప్రయోజనం కల్పించేలా ప్రభుత్వం వెంటనే విధానపరమైన నిర్ణయం తీసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో మండల విద్యాధికారి గంగుల నరేశం, స్కూల్ కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయులు ఆనంద్ రావు, జోస్నా, గంగాధర్, బారి, ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు

# ఆనాడు బీఆర్ఎస్ కబ్జాలు నేడు బీజేపీ దాడులు




**కరీంనగర్ బ్యూరో, ఆగస్టు 11 (జనంసాక్షి) :** కరీంనగర్ మున్సిపల్ కార్పొరేషన్ ను ప్రజలు ఆనాడు బీఆర్ఎస్ కు అప్పగిస్తే కొందరు కార్పొరేటర్లు స్వయంగా కబ్జాలకు పాల్పడ్డారని నేడు బీజేపీ కి అప్పగిస్తే దాడులకు పాల్పడుతున్నారని సుడా మాజీ చైర్మన్ కోమటిరెడ్డి నరేందర్ రెడ్డి మండిపడ్డారు. స్థానిక ముఖరంపురలోని సుడా క్యాంప్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ... బీఆర్ఎస్ పార్టీ అధికారంలో ఉన్నప్పుడు బీఆర్ఎస్ కార్పొరేటర్లు భూకబ్జాలకు పాల్పడ్డారని మొన్న జరిగిన మున్సిపల్ ఎన్నికల్లో బీజేపీ నాయకులు అనేక మాయ మాటలు చెప్పి ఓట్లు వేయించుకున్నారని ఇప్పుడు కొందరు బీజేపీ కార్పొరేటర్లు దాడులకు దిగుతున్నారని కాంగ్రెస్ ప్రభుత్వం ఇటువంటి వాటిని సహించదని ప్రశాంత కరీంనగర్ ప్రజలను పరేషాన్ చేస్తామంటే చూస్తూ ఊరుకోదని నరేందర్ రెడ్డి హెచ్చరించారు. బాధ్యత గల పదవిలో ఉన్న బండి సంజయ్ కుమార్ జరుగుతున్న దాడుల పై ప్రజలకు సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. ఏ పార్టీకి చెందిన వారైనా స్థానిక ఎమ్మెల్యే అధికారిక క్యాంపు కార్యాలయం పై స్వయంగా బీజేపీ కార్పొరేటర్లు దాడికి దిగారని, ఢిల్లీలో విద్యార్థులపై, యువకుల పై బాష్పవాయువు, లాఠీ చార్జి, పెల్లెట్ గన్స్ తో దాడి జరుగుతే కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి ఆఫీసు ముందు శాంతియుతంగా నిరసన చేద్దామని కాంగ్రెస్ నాయకులం వెళ్తే ఒక బీజేపీ కార్పొరేటర్ కర్రలతో దాడికి దిగాడని, నేడు కిసాన్ నగర్ లో ఇంకొక బీజేపీ కార్పొరేటర్ కు సంబంధించిన వ్యక్తులు ఏకంగా కత్తులతో, బీరు సీసాలతో దాడులకు పాల్పడ్డారని ఇటువంటి సంస్కృతి మంచిది కాదని నరేందర్ రెడ్డి అన్నారు. పోలీసులు వెంటనే స్పందించి నిందుతులను అరెస్ట్ చేశారని ప్రజలు భయభ్రాంతులకు గురి కావాల్సిన అవసరం లేదని ఇటువంటివి పునరావృతం కాకుండా రాష్ట్ర ప్రభుత్వం కఠిన చర్యలు తీసుకుంటుందని నరేందర్ రెడ్డి పేర్కొన్నారు. ఈ విలేకరుల సమావేశంలో మైనారిటీ సెల్ అధ్యక్షుడు ఎండి తాజ్, కార్పొరేటర్లు వారాల నర్సింగం, పర్వతం మల్లేశం, కాంతాల జగన్ రెడ్డి, గుండాటి శ్రీనివాస్ రెడ్డి, లయిక్, దండి రవీందర్, కుర్ర పోచయ్య, ముక్క భాస్కర్, జీడి రమేష్, ఎండి చాంద్, షబానా మహమ్మద్, తోట అంజయ్య, గుడిపాటి రమణా రెడ్డి, బషీర్, భారీ, బత్తుల రాజ్ కుమార్, ఖలీల్, మేకల నర్సయ్య, జాఫర్, ఇమామ్ తదితరులు పాల్గొన్నారు.

## ఏళ్లు గడుస్తున్న రోడ్డు కష్టాలు తీరడం లేదు శాశ్వత పరిష్కారం ఎప్పుడో





**బోయినపల్లి ఆగస్టు 11 (జనం సాక్షి)**మండలంలోని దేశాయిపల్లి నుంచి కొదురుపాకకు వెళ్లే ప్రధాన రహదారి దుస్థితిపై సీపీఎం మండల నాయకులు ఆగ్రహం వ్యక్తం చేశారు. వరద కాలువ బ్రిడ్జి సమీపంలో రహదారి అధ్వానంగా మారి ప్రయాణికులకు నరకాన్ని తలపిస్తోందని ఆవేదన వ్యక్తం చేశారు.ఏళ్లు గడుస్తున్న రోడ్డు సమస్యకు శాశ్వత పరిష్కారం చూపడంలో పాలకులు, అధికారులు విఫలమయ్యారని సీపీఎం మండల కన్వీనర్ గురిజాల శ్రీధర్ ఆరోపించారు. రహదారి అధ్వానంగా ఉండటంతో స్థానిక ప్రజలు, రైతులు, ద్విచక్ర వాహనదారులు, భారీ వాహనదారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు.ఎమ్మెల్యే దృష్టి సారించాలచొప్పదండి ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం రహదారి సమస్యపై ప్రత్యేక దృష్టి సారించి నిధులు మంజూరు చేయించి శాశ్వత ప్రాతిపదికన రోడ్డు నిర్మాణం చేపట్టాలని సీపీఎం నాయకులు డిమాండ్ చేశారు. జిల్లా కలెక్టర్ స్పందించి సమస్యకు పరిష్కారం చూపాలని కోరారు.కార్యక్రమంలో రైతు సంఘం అధ్యక్షుడు రామంచా అశోక్, గ్రామస్థులు మాడిశెట్టి గంగన్న, గోపాల్‌రెడ్డి, కొంకటి ప్రవీణ్ తదితరులు పాల్గొన్నారు

## ప్రతి ఇంటిపై జాతీయ జెండాను ఎగురవేసి దేశ సమైక్యత చాటాలి



**కమాన్ పూర్, ఆగస్టు 11, ( జనంసాక్షి ) :** హర్ ఘర్ తిరంగా కార్యక్రమంలో భాగంగా భారతీయ జనతా పార్టీ జాతీయ, రాష్ట్ర శాఖల పిలుపు మేరకు మంగళవారం కామన్పూర్ మండల కేంద్రంలో బీజేపీ కామన్పూర్ మండల అధ్యక్షులు కొయ్యడ సతీష్ యాదవ్ పాల్గొని జాతీయ జెండాను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి భారతీయుడిలో దేశభక్తి, జాతీయతా భావాన్ని మరింత బలోపేతం చేయడమే హర్ ఘర్ తిరంగా కార్యక్రమం ముఖ్య ఉద్దేశమని అన్నారు. ప్రతి ఇంటిపై జాతీయ జెండాను ఎగురవేసి దేశ సమైక్యత, సమగ్రత, సార్వభౌమత్వాన్ని చాటాలని ఆయన పిలుపునిచ్చారు. దేశం కోసం త్యాగాలు చేసిన స్వాతంత్ర్య సమరయోధులను స్మరించుకుంటూ, జాతీయ జెండాకు గౌరవం ఇవ్వడం ప్రతి భారతీయుడి బాధ్యత అని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఉపాధ్యక్షులు మచ్చగిరి రాము కార్యక్రమ కన్వీనర్ సాగంటి లక్ష్మణస్వామి సీనియర్ నాయకులు మట్ట శంకర్ ఇరువురాల పోశం జంగపల్లి అజయ్ మల్లారపు అరుణ్ కుమార్ జనరల్ సెక్రెటరీ విశ్వతేజ ఉపాధ్యక్షులు పిల్లి చంద్రయ్య కొమ్ము శ్రీనివాస్ ప్రశాంత్ తదితరులు పాల్గొన్నారు.

# బాల్కొండ లో జోర్ధార్ గ కొనసాగిన హర్ ఘర్ తిరంగా యాత్ర



**బాల్కొండ లో 11 ఆగస్టు(జనం సాక్షి)**నిజామాబాదు జిల్లా బాల్కొండ అసెంబ్లీ నియోజక వర్గ కేంద్రంలో 79వ స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా నిర్వహించనున్న హర్ ఘర్ తిరంగా అభియాన్2026' సన్నాహక యాత్ర మంగళ వారం రోజున జోర్ధార్ గ కొనసాగింది.ఈ కార్యక్రమాన్ని బాల్కొండ మండల బి. జె. పీ నాయకత్వంలోనిర్వహించారు. హర్ ఘర్ తిరంగాలి యాత్రలో జిల్లా పరిషద్, శంబావి, వెంకటేశ్వరా, మదర్ థెరిసా,జ్యోతి రావు పూలె, పలు పాఠశాలల జాతీయ జెండాలు పట్టుకొని పలు వీధుల్లో దేశ భక్తి నినాదాలు చేస్తూ ఊరేగించారు. అనంతరం జిల్లా పరిషద్ ఉన్నత పాఠశాలలో మైదానంలో జరిగిన సమావేశంలో కార్యక్రమానికి ముఖ్య అతిథిగా బీజేపీ రాష్ట్ర నాయకులు మల్లికార్జున్ రెడ్డి మాట్లాడుతూ నేషన్ ఫస్ట్, పర్సన్ లాస్ట్ అనే నినాదంతో మొత్తం భారతదేశ ప్రజలను జాగృత పరిచే నినాదంతో 'హర్ ఘర్ తిరంగా నినాదాన్ని ఎత్తుకున్న గొప్ప నాయకుడు ప్రధానమంత్రి నరేంద్ర మోడీ పిలుపు మేరకు నిర్వహించా మని మల్లికార్జున్ రెడ్డి వివరించారు.ఆగస్టు 10 నుంచి 15 వరకు ప్రతి ఇంటిపై జాతీయ జెండాను ఎగురవేసి ప్రతి గుండెల్లో దేశభక్తిని చాటలని బాల్కొండ మండల బి. జె. పీ నాయకులు ముప్కాల్ మాజీ సర్పంచ్ ముస్కు భూమేష్ విద్యార్థుల్ని కోరారు.అనంతరం జిల్లా బి. జె. పీ నాయకులు,మాజీ ఏం. పీ. పీ లావణ్య లింగాగౌడ్ హాజరై, హర్ ఘర్ తిరంగా అభియాన్ ప్రాముఖ్యతను వివరించారు ప్రతి ఇంటిపై జాతీయ జెండాను ఎగురవేసి, దేశభక్తి మరియు జాతీయ ఐక్యతను చాటాలని లింగా గౌడ్ పిలుపునిచ్చారు.ఈ సందర్భంగా షాబాద్ మండలంలో హర్ ఘర్ తిరంగా యాత్రను విజయ వంతంగా నిర్వహించి నందుకు బాల్కొండ బి. జె. పీ. అధ్యక్షులు అంబటి నవీన్ మాట్లాడుతూ అన్ని పాఠశాలల విద్యార్థులకు కృతజ్ఞతలు తెలిపారు.ఈ కార్యక్రమంలో బీ.జే.పీ.బాల్కొండ మండల ప్రధానకార్యదర్శులు సాయికిరణ్, నక్కల గణేష్, బి.జె.పి,కిసాన్ మోర్చా జిల్లా ఉపాధ్యక్షులు తోట చిన్నయ్య, బీ.జే.వై.ఎం,కిసాన్ మోర్చా, ఓ.బీ.సీ మోర్చా మండల అధ్యక్షులు సాయికార్తీక్, ఆరెపల్లి నర్సయ్య, కళ్లెం సుధాకర్, మండల ఉపాధ్యక్షులు బూసం సత్యనారాయణ, కాలరవి, కార్యదర్శులు కద్తల్ రాజేశ్వర్, ఐరా ప్రవీణ్, భూమేష్, నాయకులు సుంకం శ్రీనివాస్, బి. ఆర్. నర్సింగ్ రావు,ఆరెపల్లి రవిందర్, తోట నవీన్, నాగరాజు,తోట నాగేష్, తోపారం అశోక్, ఉట్నూర్ రాంకిషన్, కన్న రెడ్డి,దుద్దేల దేవేందర్, జక్కం శ్రీకాంత్, దికొండ రాజు, చెల్మెల రమేష్, సోన్న పోశెట్టి, నానం నరేష్, కాల బాబు, అద్వాళా గంగాధర్, మద్దుల రమేష్, అగ్గు శ్రీనివాస్ బీజేపీ నాయకులు తదితరులు పాల్గొన్నారు

# శ్రీ వాణి స్కూల్‌లో ఘనంగా పోచమ్మ బోనాలు



**ఇల్లంతకుంట జూలై 11(జనంసాక్షి )** ఇల్లంతకుంటలోని శ్రీ వాణి స్కూల్‌లో మంగళవారం పోచమ్మ బోనాల వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులు సంప్రదాయ దుస్తులు, వివిధ వేషధారణలతో ఆకట్టుకున్నారు. మహిళలు, విద్యార్థులు భక్తిశ్రద్ధలతో బోనాలు సమర్పించి పోచమ్మ తల్లికి ప్రత్యేక పూజలు నిర్వహించారు.పాఠశాల ఆవరణలో బోనాల పండుగ వాతావరణం నెలకొంది. విద్యార్థులకు తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలపై అవగాహన కల్పించేలా కార్యక్రమాలను నిర్వహించారు. ఉపాధ్యాయులు, విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొని వేడుకలను విజయవంతం చేశారు.ఈ సందర్భంగా పాఠశాల డైరెక్టర్ గణగోని శ్రీకాంత్ ప్రిన్సిపాల్ కొయ్యడ సత్యనారాయణ మాట్లాడుతూ, తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలను భవిష్యత్ తరాలకు పరిచయం చేయడమే పాఠశాల లక్ష్యమని తెలిపారు. ఇట్టి కార్యక్రమంలో ఉపాధ్యాయిని, ఉపాధ్యాయులు శిల్ప, సుష్మ, మౌనిక, స్వర్ణ, రవళి,స్వప్న,రేణుక, బాబు కరుణ,శ్రీలత, శ్రీకాంత్, ఆకాంక్ష, ఇన్షిరా, ప్రతిభ,అనిత, రజిత, కరుణ శ్రీనివాస్ పాల్గొన్నారు.

# బాబుల్ గావ్ గ్రామానికి వచ్చిన బస్సు సంతోషం వ్యక్తం చేసిన గ్రామస్తులు



**పెద్ద కొడప్గల్ ఆగస్ట్ 11 (జనంసాక్షి):** పెద్ద కొడప్గల్ మండలంలోని మారుమూల గ్రామమైన బాబుల్గావ్ గ్రామస్తులు అనేక సంవత్సరాలుగా బస్సు కోసం ఎదురుచూస్తున్నారు. సమస్యను అధికారుల దృష్టికి తీసుకువెళ్లగా మంగళవారం గ్రామానికి బస్సు వచ్చింది. తహశీల్దార్ రాజశేఖర్ బస్సుకు పూజలు చేసి బస్సు సేవలను ప్రారంభించారు. ఈ సందర్భంగా గ్రామస్తులు మాట్లాడుతూ... బస్సు రాక కాలినడకన, ఇతర వాహనాలలో ఇతర గ్రామాలకు వెళ్లే వారమని, బస్సు రావడం సంతోషంగా ఉందని తెలిపారు. సర్పంచ్ రవి కుమార్ మాట్లాడుతూ... గ్రామ అభివృద్ధికి కృషి చేస్తున్న తహశీల్దార్ రాజశేఖర్, సమస్యను వెలుగులోకి తెచ్చిన విలేకర్ పండరి గౌడ్ కు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో తహశీల్దార్ రాజశేఖర్, ప్రజా ప్రతినిధులు, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు శ్యామప్ప పటేల్, నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

# పల్లె దావాఖానకు ఫ్రిడ్జ్ డొనేషన్



**రాయికల్ జూలై 11(జనంసాక్షి):**రాయికల్ మండలం అల్లిపూర్ గ్రామంలోని పల్లె దావాఖానకు ఫ్రిడ్జ్ అవసరం ఉన్నదని డాక్టర్. డిప్యూటీ డిఎంహెచ్ఓ శ్రీనివాస్ మండల మెడికల్ ఆఫీసర్ సతీష్ డాక్టర్ సుప్రియ కోరగానే అల్లిపూర్ గ్రామానికి చెందిన మాజీ సర్పంచ్ క్రీ.శే. బాలె సత్యనారాయణ మరియు క్రీ.శే.జిల్లా లోకల్ ఫండ్ ఆడిటర్ బాలె ప్రభాకర్ పేరు మీద బాలె సంకీర్త్ కుమార్ కొని ఇచ్చినందుకు వారికీ మరియు దీనికి కృషి చేసిన మాజీ ఎంపీటీసీ బాలె చంద్ర శేఖర్, బాలె రాజేందర్ కి గ్రామ ప్రజల ప్రత్యేక ధన్యవాదాలు తెలపడం జరిగింది. ఈ కార్యక్రమంలో పద్మశాలి సంఘం అధ్యక్షులు వేముల సతీష్, మండ రవి, అత్తినేని రాజన్న, డాక్టర్ భూషణం, మరియు పల్లె దావకాన సిబ్బంది పాల్గొన్నారు.

## క్షత్రియ ఇంజనీరింగ్ కళాశాలలో స్కాన్ టూ ప్రింట్ ప్రారంభం




**ఆర్మూర్,ఆగస్టు 11(జనంసాక్షి):** ఆర్మూర్ పరిధిలోని చేపూర్ క్షత్రియ ఇంజనీరింగ్ కళాశాలలో అధ్యాపకుల,విద్యార్థుల అవస రాలను దృష్టిలో ఉంచుకొని స్కాన్ టు ప్రింట్ అనే డిజిటల్ ప్రింటింగ్ సదుపా యాన్ని అందు బాటులోకి తీసుకువచ్చామని కళాశాల సెక్రెటరీ, కరస్పాండెంట్ అల్జాపూర్ దేవేందర్ చెప్పారు.క్షత్రియ ఇంజనీరింగ్ కళాశాలలో డిప్లొమా పూర్తి చేసిన పూర్వ విద్యార్థి,ఫౌండర్ ఆఫ్ స్కాన్ టు ప్రింట్ ను అభివృద్ధి చేసిన పవన్ ను అభినం దించారు.విద్యార్థులు తమ మొబైల్ ఫోన్ ద్వారా క్యూఆర్ కోడ్‌ను స్కాన్ చేసి పిడిఎఫ్, వర్డ్,పవర్ పాయింట్, ఇమేజ్ ఫైళ్లను అప్‌లోడ్ చేసి అవసరమైన ప్రింట్ సెట్టిం గులను ఎంపిక చేసుకుని యూపీఐ ద్వారా చెల్లింపు చేసి సులభంగా ప్రింట్ పొందే విధంగా వ్యవస్థను రూపొం దించారు .భవిష్యత్తులో మరింత మంది విద్యార్థులు స్టార్టప్‌లు ,నూతన ఆవిష్కరణల వైపు అడుగులు వేయాలని సెక్రెటరీ దేవేందం ్,ప్రిన్సిపల్ కట్కం శ్రీనివాస్ కోరారు.ఈ కార్యక్రమంలో కళాశాల ఏవో బి .నరేందం ్,కళాశాల పాలిటెక్నిక్ కోఆర్డినేటర్ సుజీత్, మెకానికల్ అండ్ ఐక్యుఏసి కోఆర్డి నేటర్ వేద ప్రకాష్,టిపిఓ సునీల్, సోషల్ మీడియా ఇంచార్జ్ శృతిన్, అధ్యాపకులు పాల్గొన్నారు

## గురుకుల పాఠశాలలో బోనాల పండుగ



**పెద్ద కొడప్గల్ ఆగస్టు 11 (జనంసాక్షి):** పెద్ద కొడప్గల్ మండల కేంద్రంలోని పీఎంశ్రీ సాంఘిక సంక్షేమ గురుకుల బాలికల పాఠశాల, కళాశాలలో మంగళవారం ఆషాడ మాసం సందర్భంగా బోనాల పండుగ నిర్వహించారు. విద్యార్థినులు సాంప్రదాయ దుస్తులలో అమ్మవారికి భక్తిశ్రద్ధలతో బోనాలను సమర్పించారు. విద్యార్థులు అమ్మవారి వేషధారణలతో అలరించగా, పాఠశాల ప్రాంగణంలో పలు సాంస్కృతిక కార్యక్రమాలు వైభవంగా జరిగాయి. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపల్ సునీత, అధ్యాపక బృందం, సిబ్బంది, విద్యార్థులు ఉన్నారు.



## పోతునూరులో ఘనంగా హర్ ఘర్ తిరంగా కార్యక్రమం



**సిరికొండ ఆగష్టు 11,(జనం సాక్షి )** హర్ ఘర్ తిరంగా కార్యక్రమంలో భాగంగా పోతునూరు గ్రామంలో మంగళవారం జాతీయ పతాక ఆవిష్కరణ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. బూత్ అధ్యక్షులు అట్టి మల్ల రాజు ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో జాతీయ పతాకాన్ని ఆవిష్కరించి దేశభక్తిని చాటుకున్నారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా బీజేపీ జిల్లా ఉపాధ్యక్షులు నక్క రాజేశ్వర్ హాజరయ్యారు. కిసాన్ మోర్చా మండల అధ్యక్షులు చౌట్పల్లి ప్రభాకర్, మండల నాయకులు తలకట్ల పెద్ద గంగారెడ్డి, తలకట్ల సాగర్ రెడ్డి పాల్గొన్నారు. అలాగే పోతునూరు బీజేపీ గ్రామ శాఖ సభ్యులు తిరుపతి చారి, ఎం. కిషన్, కె. నిఖిల్, ఏ. రవి, ఏ. రాజేందర్, జి. సూర్యకాంత్, జి. గణేష్, ఎం. చింటూ గంగాధర్, బి. నాగేష్, బి. దిలీప్, బి. ప్రణీత్, కె. నవీన్, ఏ. భూమయ్య, బి. వినయ్, ఏ. భోజన్న తదితరులు పాల్గొన్నారు. జాతీయ జెండా ఆవిష్కరణ అనంతరం నాయకులు, కార్యకర్తలు దేశ సమైక్యత, సమగ్రతను కాపాడేందుకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని పిలుపునిచ్చారు.

## భీంగల్ పట్టణంలో ఘనంగా హర్ ఘర్ తిరంగా ర్యాలీ




**భీంగల్ టౌన్, ఆగష్టు 11(జనం సాక్షి)**భారత ప్రధానమంత్రి నరేంద్ర మోదీ పిలుపు మేరకు దేశభక్తి, జాతీయ సమైక్యత చాటుతూ హర్ ఘర్ తిరంగా కార్యక్రమంలో భాగంగా మంగళవారం రోజున భీంగల్ పట్టణంలో ఘనంగా తిరంగా ర్యాలీ నిర్వహించడం జరిగిందని, అలాగే పట్టణంలోని సుదర్శన్ థియేటర్ వద్ద నుంచి సుమంగళి చౌరస్తా వరకు నిర్వహించిన ర్యాలీలో ప్రజలు, యువత, మహిళలు, శ్రీ సరస్వతి విద్య మందిర్ ఉన్నత పాఠశాల, శ్రీ నారాయణ పాఠశాలల విద్యార్థులు పాల్గొని జాతీయ జెండాలతో భారత్ మాతాకీ జై, వందే మాతరం నినాదాలతో దేశభక్తిని చాటుకున్నారని బీజేపీ మండల అధ్యక్షుడు ఆరే రవీందర్ పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఆరే రవీందర్ మాట్లాడుతూ జాతీయ జెండా మన గౌరవానికి, ఐక్యతకు ప్రతీక అని, ప్రతి ఇంటిపై త్రివర్ణ పతాకాన్ని ఎగురవేసి దేశభక్తి భావాన్ని మరింత బలపరచాలని ప్రజలకు పిలుపునిచ్చారు. కుల, మత, రాజకీయ భేదాలకు అతీతంగా ప్రజలంతా ఐక్యంగా పాల్గొని తిరంగా ర్యాలీని విజయవంతం చేసినందుకు నిర్వాహకులు ప్రతి ఒక్కరికీ ఆయన కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో యోగేశ్వర నర్సయ్య, కైరి దశ గౌడ్,బండారి లక్ష్మణ్ గౌడ్,తోట గంగాధర్, కొట్టాల అశోక్, పతాని ప్రవీణ్, శెట్టి ప్రేమ్ చంద్,డాక్టర్ నవీన్, దయ్య ప్రవీణ్, ఈర్ల మహేందర్, ధర్పల్లి మహిపాల్, రాజేష్ గుప్తా, నీలం గంగాధర్,శెట్టి లక్ష్మణ్, ప్రమోద్, యోగిని శ్రీనివాస్, ఈశ్వర్ సాయి, నవతేజ్,వినాయక రమేష్,ముమ్మారి గంగాధర్, డాక్టర్ వెంకటేష్, డిస్ చారి,శుక్రవారం గంగాధర్,యువకులు,వివిధ పార్టీల నాయకులు,పాఠశాలల విద్యార్థులు పాల్గొన్నారు..

## సాంకేతిక పరిజ్ఞానం తో విద్యార్థులకు విద్యా బోధన



**నిజామాబాద్ జిల్లా ప్రతినిధి ఆగష్టు 11 జనం సాక్షి:**సాంకేతిక పరిజ్ఞానం తో మారుతున్న కాలానికి అనుగుణంగా విద్యార్థులకు బోధన చేయాలని జిల్లా ఇంటర్ విద్యా అధికారి తిరుమలపుడి రవికుమార్ అన్నారు. జూనియర్ కళాశాల అధ్యాపకులకు రెండవ స్పెల్ రెండు రోజుల ఓరియెంటేషన్ శిక్షణ తరగతులు మంగళవారం నిజామాబాద్ బాలికల జూనియర్ కళాశాలలో ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా జిల్లా ఇంటర్ విద్యా అధికారి మాట్లాడుతూ విద్యార్థుల భవిష్యత్ కు బంగారు బాట చూపే విధంగా అధ్యాపకులు బోధన చేయాలని అన్నారు. జిల్లా ఇంటర్ విద్య అధికారి తిరుమలపుడి రవికుమార్ అన్నారు. ఈ కార్యక్రమానికి కళాశాల ప్రిన్సిపాల్ బుద్ధిరాజ్ అధ్యక్షత వహించారు. జిల్లా ఇంటర్ విద్యా అధికారి మాట్లాడుతూ ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో విద్యాభ్యాసం చేస్తున్న పేద, బడుగు, బలహీన, మైనారిటీ వర్గాలకు చెందిన విద్యార్థులకు అర్థమయ్యే రీతిలో, అధునాతన సాంకేతిక పరిజ్ఞానంతో విద్య బోధన చేయాలని అన్నారు. ఇదివరకే మర్రి చెన్నారెడ్డి హ్యూమన్ రిసోర్స్ డెవలప్మెంట్ లో శిక్షణ పొందిన రిసోర్స్ పర్సన్స్ అధ్యాపకులకు శిక్షణ, బోధనా మెళకువలను బోధిస్తారని అన్నారు. బాలికల జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ బుద్ధిరాజ్ మాట్లాడుతూ ఈ శిక్షణ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని విద్యార్థులకు మంచి బోధన పద్ధతుల ద్వారా విద్య బోధించాలని ఆకాంక్షించారు. ఈ శిక్షణ తరగతులలో ఫిజికల్ సైన్స్, కామర్స్, జీవాలజీ, హిస్టరీ సబ్జెక్ట్ అధ్యాపకులు జిల్లాలోని పలు ప్రాంతాల అధ్యాపకులు పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా ప్రభుత్వ అధ్యాపకుల సంఘం అధ్యక్షులు నర్సయ్య తదిరులు పాల్గొన్నారు.

# హుజురాబాద్ జర్నలిస్టుల తీవ్ర ఆగ్రహం

- సొంత పార్టీ ప్రభుత్వాన్నే నిందించిన గూడూరు స్వామిరెడ్డి
- రేపటి నుంచి ఆందోళనలు



**హుజురాబాద్, ఆగస్టు 11 (జనం సాక్షి) :**రాజకీయ లబ్ధి కోసం కాంగ్రెస్ పార్టీని వాడుకుని, ప్రజలకు ప్రభుత్వానికి వారధిగా పని చేసే జర్నలిస్టుల హక్కులను కాలరాస్తున్న కాంగ్రెస్ నాయకుడు గూడూరు స్వామిరెడ్డి నైజంపై హుజురాబాద్ జర్నలిస్ట్ లోకం నిప్పులు చెరిగింది. గత ప్రభుత్వ హయాంలో జర్నలిస్టులకు దక్కిన ఇండ్ల స్థలాల కేటాయింపుపై కోర్టు మెట్లు ఎక్కిన స్వామిరెడ్డి, సమస్యను సామరస్యంగా పరిష్కరించుకునేందుకు వెళ్లిన ప్రెస్ క్లబ్ ప్రతినిధులను తీవ్రంగా పరాభవించారు. సమస్య పరిష్కారం అటుంచి, తాను ప్రాతినిధ్యం వహిస్తున్న "కాంగ్రెస్ ప్రభుత్వం ఒక చెత్త ప్రభుత్వం.. దీనివల్ల ఏ పనీ కాదు" అంటూ బహిరంగంగా వ్యాఖ్యానించి తన ద్వంద్వ నీతిని బైటపెట్టుకున్నారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చాక నియోజకవర్గ ఇన్చార్జి ప్రణవ్ బాబు, మంత్రుల కాళ్ళు పట్టుకుని తన సతీమణి గూడూరు రాజేశ్వరిని మార్కెట్ చైర్మన్‌గా, కోడలు గూడూరు అంజలి ల ను మున్సిపల్ వైస్ చైర్పర్సన్‌గా నామినేట్ చేయించుకున్న ఈ 'పదవుల వేటగాడు', జర్నలిస్టుల ఇండ్ల స్థలాల వద్దకు వచ్చేసరికి మాత్రం కక్షపూరితంగా వ్యవహరిస్తుండడం గమనార్హం. పదవుల కోసం ప్రభుత్వాన్ని వాడుకుంటూ, తీరా జర్నలిస్టులకు న్యాయం చేయమంటే సొంత ప్రభుత్వంపైనే విషం కక్కడంలో ఆయన అవకాశవాద రాజకీయం స్పష్టమవుతోంది రేపటి నుంచి సమరశంఖం కనీస సంస్కారం లేకుండా బొకే ఇవ్వడానికి వచ్చిన విలేకరులను అవమానించి, జర్నలిస్టుల పొట్టకొట్టాలని చూస్తున్న స్వామిరెడ్డి వైఖరిపై హుజురాబాద్ ప్రెస్ క్లబ్ సమరశంఖం పూరించింది. ప్రెస్ క్లబ్ అధ్యక్ష, కార్యదర్శులు కాయిత రాములు, కామని రవీందర్ లు మాట్లాడుతూ.. రేపటి నుంచి దశలవారీగా ఆందోళనలను ఉధృతం చేయాలని నిర్ణయించినట్లు తెలిపారు. స్వామిరెడ్డి కక్షసాధింపు చర్యలను, కాంగ్రెస్ ప్రభుత్వంపై ఆయన చేసిన అనుచిత వ్యాఖ్యలను ఎండగడుతూ జర్నలిస్ట్ నేతలు కోరం సుధాకర్ రెడ్డి, నంబీ భరణికుమార్, కేదాసి శ్రీధర్, టేకుల సాగర్, ఎడ్ల కుమార్, నిమ్మటూరి సాయి కృష్ణ, పబ్బు తిరుపతి, మచ్చిక చందు, గోపగాని మహేష్, ఎన్టీవీ రాజు, పోతరాజు సంపత్, నాగవెల్లి రాజు, భారత రజనీకాంత్ తదితరులు పెద్ద ఎత్తున నిరసనకు పిలుపునిచ్చారు. కలం బలాన్ని తక్కువ అంచనా వేసి జర్నలిస్టుల హక్కులపై దెబ్బకొట్టాలని చూస్తే, రాజకీయంగా ఏవిధంగా బుద్ధి చెప్పాలో స్పష్టమైన పోరాట కార్యాచరణ ద్వారా చూపిస్తామని అధ్యక్ష, కార్యదర్శులు హెచ్చరించారు.



## విద్యుత్ స్తంభం పైనుంచి పడి గాయపడిన మున్సిపల్ కార్మికుడిని పరామర్శించిన చైర్పర్సన్



విద్యుత్ స్తంభం పైనుంచి పడి గాయపడిన మున్సిపల్ కార్మికుడిని పరామర్శించిన చైర్పర్సన్ కామారెడ్డి జిల్లా ప్రతినిధి ఆగస్టు 11 (జనం సాక్షి)కామారెడ్డి పట్టణంలో విధి నిర్వహణలో భాగంగా విద్యుత్ స్తంభం పైనుంచి ప్రమాదవశాత్తు కిందపడి గాయపడిన మున్సిపల్ కార్మికుడు పాల్వంచ రాజును మున్సిపల్ చైర్పర్సన్ ఇప్ప ఉమారాణి శ్రీనివాస్ పరామర్శించారు. రాజు నివాసానికి వెళ్లిన చైర్పర్సన్ ఆయన ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకుని, త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు ఈ సందర్భంగా రాజు కుటుంబ సభ్యులతో మాట్లాడిన చైర్పర్సన్, అవసరమైన సహాయ సహకారాలను మున్సిపాలిటీ తరఫున అందించేందుకు ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటామని హామీ ఇచ్చారు. మున్సిపల్ సిబ్బంది విధి నిర్వహణలో అప్రమత్తంగా ఉండాలని, ప్రమాదాలు జరగకుండా తగిన భద్రతా చర్యలు తప్పనిసరిగా పాటించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో కౌన్సిలర్లు నిట్టు గంగాధర్, కాళ్ల గణేష్, అంజాద్, మహేష్, మోతిలాల్, రామ్మోహన్, సత్యం, నాయకులు నాగరాజు, కార్మిక నాయకులు ప్రభు, నర్సింగ్ రావు, అయ్యాజ్, మున్సిపల్ సిబ్బంది, స్థానికులు తదితరులు పాల్గొన్నారు.

## ధర్మపురి భారతీయ జనతా పార్టీ ఆధ్వర్యంలో హర్ ఘర్ తిరంగా కార్యక్రమం బైక్ ర్యాలీ

**ధర్మపురి జగిత్యాల జిల్లా ఆగష్టు 10/08(జనంసాక్షి)** : భారతీయ జనతా పార్టీ జాతీయ శాఖ ఆ రాష్ట్ర శాఖ ఆ జిల్లా శాఖ పిలుపుమేరకు హర్ గర్ తిరంగా కార్యక్రమంలో భాగంగా ఈరోజు బీజేపీ పట్టణ అధ్యక్షులు గాజు భాస్కర్ ఆధ్వర్యంలో స్థానిక శివాజీ విగ్రహం నుండి ప్రారంభమైన ర్యాలీ అంబేద్కర్ విగ్రహం, వివేకానంద, పటేల్ విగ్రహం గాంధీ నందు శివాజీ విగ్రహానికి చేరుకున్నారు. ఇట్టి సందర్భంగా నాయకులు మాట్లాడుతూ దేశ ప్రజలందరికీ ఒక తాటి పైకి తెచ్చే విధంగా దేశం కోసం ధర్మం కోసం ప్రశాంతమైన వాతావరణంలో బతకడంలో భాగంగా ప్రతి ఒక్కరు కూడా తన ఇంటిపై జాతీయ జెండా ఎగిరేవేయాలని భారత ప్రధానమంత్రి నరేందర్ మోడీ పిలుపునివ్వడం జరిగింది. నరేంద్ర మోడీ పిలుపుమేరకు ప్రతి ఒక్క పౌరుడికి దేశం పట్ల గౌరవం భక్తిశ్రద్ధలు ఉండే విధంగా చేయాలని అలాగే దేశద్రోహుల గుండెల్లో గుణపాలు దించే విధంగా చేయాలని దేశాన్ని విచ్ఛిన్నం చేయాలని ప్రయత్నిస్తున్న వారికి గుణపాఠం చెప్పే విధంగా తిరంగిర్యాలీలు చేయాలని పిలుపునివ్వడం జరిగింది కాబట్టి ప్రతి ఒక్కరు కూడా దేశభక్తిని చాటడం కోసం ఇంటిపై జెండా ఎగరవేయాలని కోరడం జరుగుతుంది కాబట్టి ప్రతి ఒక్కరు తన ఇంటిపై జెండాలు ఎగురవేసి నరేంద్ర మోడీ ని బలపరచావలసిందిగా కోరుతున్నాం. ఇట్టి కార్యక్రమంలో కార్యకర్తలు ,నాయకులు, జాతీయ వాదులు, అధిక సంఖ్యలో పాల్గొనడం జరిగింది





# జ్యోతిరావు పూలే సావిత్రిబాయి పూలే ఆశయాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలి

**గోదావరిఖనిఆగస్టు11(,జనంసాక్షి):**రామగుండం ఏరియా1లోని ఆర్.సి.ఒ.ఏ క్లబ్‌లో మంగళవారం సాయంత్రం సింగరేణి కాలరీస్ కంపెనీ లిమిటెడ్ ఆధ్వర్యంలో మహాత్మ జ్యోతిరావు పూలే, సావిత్రిబాయి పూలే జీవిత చరిత్ర, ఆశయాల ఆధారంగా రూపొందించిన 'సత్యశోధక' నాటికను ప్రదర్శించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ఆర్.జి.1 ఏరియా జనరల్ మేనేజర్ డి. లలిత్ కుమార్ హాజరయ్యారు. ఈ సందర్భంగా జీఎం డి. లలిత్ కుమార్ జ్యోతిరావు పూలే, సావిత్రిబాయి పూలే చిత్రపటాలకు పూలమాలలు వేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. అనంతరం నాటికను వీక్షించారు. సమాజంలో విద్య, సమానత్వం, మహిళా సాధికారత కోసం జ్యోతిరావు పూలే, సావిత్రిబాయి పూలే చేసిన కృషి చిరస్మరణీయమని, వారి ఆశయాలను నేటి తరానికి తెలియజేయడంలో ఇటువంటి సాంస్కృతిక కార్యక్రమాలు ఎంతో దోహదపడతాయని జీఎం పేర్కొన్నారు. 'సత్యశోధక' నాటికలో పూలే దంపతులు సమాజంలోని అసమానతలు, మూఢనమ్మకాలు, వివక్షకు



వ్యతిరేకంగా చేసిన పోరాటం, మహిళలకు విద్య అందించేందుకు చేసిన కృషిని కళాకారులు తమ అద్భుతమైన నటన ద్వారా ప్రదర్శించారు. నాటిక ప్రేక్షకులను విశేషంగా ఆకట్టుకుంది. ఈ కార్యక్రమానికి సింగరేణి పాఠశాలల విద్యార్థులు, సింగరేణి ఉద్యోగులు, అధికారులు, ఉద్యోగుల కుటుంబ సభ్యులు అధిక సంఖ్యలో హాజరై నాటికను ఆసక్తిగా తిలకించారు. కార్యక్రమంలో, ఏజెంట్ చిలుక శ్రీనివాస్, పర్సనల్ మేనేజర్ రెడ్డిమల్ల తిరుపతి, ఏఐటీయూసీ ప్రతినిధి ఇజ్జగిరి రాజు, అధికారుల సంఘం ప్రతినిధి పేరుమాల్ల శ్రీనివాస్, బీసీ సంఘం లైజన్ ఆఫీసర్, సెంట్రల్ ప్రెసిడెంట్ దీటి చంద్రమౌళి, జనరల్ సెక్రటరీ దేవాచారి, ఉపాధ్యక్షులు కోలా మల్లేష్, ఎస్సీ/ఎస్టీ అసోసియేషన్ సభ్యులు పులి మోహన్, జనగామ నర్సయ్య, లింగమూర్తి, అధికారులు, అనిల్ గబాలే, వేణు, శ్రవణ్ కుమార్, హనుమంతరావు తదితరులు పాల్గొన్నారు.

# దళిత గిరిజనుల సమస్యలపై జర్నలిస్టులు ప్రశ్నించే గొంతుకగా నిలవాలి

**ముస్తాబాద్ ఆగస్టు 11( జనం సాక్షి)**దళితులు, గిరిజనులు, పేదలు, అణగారిన వర్గాల ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను వెలుగులోకి తీసుకువచ్చి, వారికి న్యాయం జరిగే వరకు ప్రశ్నించడం జర్నలిస్టుల బాధ్యత అని తెలంగాణ ఎస్సీ ఎస్టీ వర్కింగ్ జర్నలిస్టు అసోసియేషన్ టి ఎస్ ఎస్ డబ్ల్యు వ్యవస్థాపక అధ్యక్షులు కట్కూరి మల్లేష్ అన్నారు. రాజన్న సిరిసిల్ల జిల్లాలో మంగళవారం నిర్వహించిన తొలి జిల్లా మహాసభలో ఆయన ప్రసంగించారు. రాష్ట్ర ఉపాధ్యక్షులు చుంచు బాబు అధ్యక్షతన జరిగిన ఈ మహాసభకు రాష్ట్ర నాయకులు, జిల్లా నాయకులు, జిల్లాలోని వివిధ మండలాల్లో పనిచేస్తున్న దళిత, గిరిజన జర్నలిస్టులు పెద్ద సంఖ్యలో హాజరయ్యారు. ఈ సందర్భంగా కట్కూరి మల్లేష్ మాట్లాడుతూ గత ప్రభుత్వ హయాంలో జర్నలిస్టులు అనేక సమస్యలు ఎదుర్కొన్నారని, ముఖ్యంగా ఎస్సీ, ఎస్టీ జర్నలిస్టుల సమస్యలను ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్లడంలో ఇబ్బందులు ఎదురయ్యాయని అన్నారు. ప్రస్తుత ప్రభుత్వం జర్నలిస్టుల సమస్యలను, మీడియా రంగం ప్రాధాన్యతను గుర్తించి జర్నలిస్టులకు తగిన గౌరవం, ప్రాధాన్యత ఇవ్వాలని కోరారు. అక్రిడిటేషన్ కార్డులు, హెల్త్ కార్డులు, రేషన్ కార్డులు, ఇళ్ల సౌకర్యం వంటి సంక్షేమ అంశాలపై ప్రభుత్వం సానుకూలంగా



స్పందించాలని ఆయన కోరారు. బలహీన వర్గాల సమస్యలు వార్తల్లోకి రావాలిజర్నలిస్టుల వార్తలు కేవలం రాజకీయ అంశాలకే పరిమితం కాకుండా గ్రామాలు, మండలాలు, పట్టణాల్లో దళితులు, గిరిజనులు, పేదలు ఎదుర్కొంటున్న సమస్యలను కూడా వెలుగులోకి తీసుకురావాలని కట్కూరి మల్లేష్ సూచించారు. దళిత కుటుంబానికి అన్యాయం జరిగినా, గిరిజన కుటుంబానికి భూ సమస్య ఎదురైనా, పేద విద్యార్థికి విద్య అందకపోయినా, గ్రామాల్లో తాగునీరు, రోడ్లు, ఇళ్లు, విద్య, వైద్యం వంటి సమస్యలు ఉన్నా వాటిని గుర్తించి అధికారుల దృష్టికి తీసుకెళ్లాలని అన్నారు. వారి గొంతుక మన కలం కావాలి. వారి సమస్య మన వార్త కావాలి. వారికి న్యాయం జరిగే వరకు మన ప్రశ్న కొనసాగాలి అని పిలుపునిచ్చారు. మన కలం బలహీనుడి పక్షాన నిలబడాలి. మన వార్త అన్యాయానికి వ్యతిరేకంగా ఉండాలి. మన ప్రశ్న అధికారులను జవా బుదారీగా చేయాలి అని అన్నారు. నూతన జిల్లా కమిటీ ఎన్నికమహాసభలో రాజన్న సిరిసిల్ల జిల్లా నూతన జిల్లా కమిటీని ఎన్ను కోవడం జరిగింది. జిల్లా అధ్యక్షులుగా కొల్లూరి శంకర్ఈ మహాసభకు వ్యవస్థాపక నాయకులు ఆరెల్లి మల్లేష్, రాష్ట్ర అధ్యక్షులు కాదేపురం గంగన్న, రాష్ట్ర ఉపాధ్యక్షులు తెడ్డూ సాయిలు, జగిత్యాల జిల్లా అధ్యక్షులు క్యాదాసు స్వామి, కామారెడ్డి జిల్లా నాయకులు, రాజన్న సిరిసిల్ల జిల్లా అధ్యక్షులు కొల్లూరి శంకర్ తదితరులు హాజరయ్యారు. అలాగే రాజన్న సిరిసిల్ల జిల్లాలోని అన్ని మండలాల నుంచి వివిధ పరిస్థితుల్లో పనిచేస్తున్న దళిత, గిరిజన జర్నలిస్టులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా దళిత, గిరిజన జర్నలిస్టుల ఐక్యతను మరింత బలోపేతం చేసి, జర్నలిస్టుల సమస్యలతో పాటు అణగారిన వర్గాల ప్రజల సమస్యలపై నిరంతరం పనిచేయాలని నాయకులు పిలుపునిచ్చారు.

# స్వయంభు పోచమ్మ బండను పర్యాటక కేంద్రంగా తీర్చిదిద్దుతాం

**చిగురుమామిడి ఆగస్టు 11 (జనంసాక్షి):**మొక్కిన మొక్కులు వెంటనే తీర్చే అమ్మవారిగా ప్రసిద్ధిగాంచి స్వయంభుగా వెలసిన ముదిమాణిక్యం గ్రామ శివారులోని పోచమ్మ బండను గ్రామస్తుల సహకారంతో పర్యాటక కేంద్రంగా తీర్చిదిద్దుతామని ఆ గ్రామ సర్పంచ్ బోయిని రమేష్,గ్రామ యువకుడు ఏలేటి సంతోష్ రెడ్డి తెలిపారు. మంగళవారం సర్పంచ్ బోయిని రమేష్, ఏలేటి సంతోష్ రెడ్డి గ్రామస్తులతో కలిసి పోచమ్మ తల్లి ఆలయంలో కాలభైరవుడి విగ్రహం వద్ద ప్రత్యేక పూజలు నిర్వహించారు. తవ్వకాల్లో బయటపడిన కాలభైరవుడి విగ్రహం వద్ద గ్రామస్తులు పెద్ద ఎత్తున తరలివచ్చి ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్నారు. ఈ సందర్భంగా సర్పంచ్ రమేష్ మాట్లాడుతూ 30ఎకరాల్లో విస్తరించి ఉన్న పోచమ్మ బండపై చాలా సంవత్సరాల క్రితం పురాతన ఆలయం ఉన్నట్లు తెలుస్తుందన్నారు. గ్రామ



యువకుడు ఏలేటి సంతోష్ రెడ్డికి నిద్రలో పోచమ్మ బండ వద్ద విగ్రహాలు ఉన్నాయని వాటిని వెలికి తీసి ప్రతిష్టించాలని కలలో వచ్చి చెప్పినట్లు తెలిపారు. దీంతో వెంటనే ఏలేటి సంతోష్ రెడ్డి దాదాపు 5లక్షల రూపాయల తన స్వంత ఖర్చులతో ఆలయం వద్ద వివిధ రకాల అభివృద్ధి పనులతోపాటు త్రాగునీటి కోసం బోరు వేయటం,విద్యుత్ సౌకర్యం కల్పించడం జరిగిందన్నారు. పోచమ్మ బండ గుట్టపై దాదాపు 30ఎకరాల ప్రభుత్వ స్థలం ఉందని, 10ఎకరాల్లో విస్తరించి ఉన్న గుడి బండపై కాకతీయుల నాటి కళాతోరణం తోపాటు వివిధ రకాల విగ్రహాలు ఉన్నట్లు చెప్పారు. ఇట్టి విషయంపై పురవస్తు శాఖ అధికారుల దృష్టికి తీసుకు వెళ్లినట్లు సర్పంచ్ రమేష్ తెలిపారు. అందరి సహకారంతో పోచమ్మ బండను పర్యటక కేంద్రంగా తీర్చిదిద్దుతామనిసొంత ఖర్చులతో పోచమ్మ బండను అభివృద్ధి పథంలోకి తీసుకు వస్తున్న ఏలేటి సంతోష్ రెడ్డినిగ్రామస్తులు,మండల ప్రజలు అభినంది స్తున్నారు. ఆ పోచమ్మ తల్లి ఆశీస్సులు ప్రజలందరిపై ఉండాలని, గ్రామ ప్రజలందరినీ చల్లగా చూసేలా గ్రామదేవతలు కరుణ చూపాలని సంతోష్ రెడ్డి తెలిపారు. తను సర్పంచ్ గా ఉన్న సమయంలో అక్కడ ఇలాంటి విగ్రహాలు బయటికి రావడం చాలా సంతోషంగా ఉందని సర్పంచ్ తెలిపారు.

# పెట్టుబడి ముందు ఆలోచించండి



**గోదావరిఖని,ఆగస్టు11(జనంసాక్షి):**రామగుండం పోలీస్ కమిషనర్ అంబర్ కిషోర్ ఝా ఆదేశాల మేరకు తెలంగాణ సైబర్ సెక్యూరిటీ బ్యూరో ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న "సురక్షా కా తిరంగా సైబర్ ఇండిపెండెంట్ తెలంగాణ వైపు" కార్యక్రమంలో భాగంగా ఎన్‌టీపీసీ జ్యోతిక భవన్‌లో రిటైర్డ్ ఉద్యోగులకు సైబర్ నేరాలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్ఐ లు మాట్లాడుతూ,సోషల్ మీడియా,వాట్సాప్, టెలిగ్రామ్ ద్వారా వచ్చే అధిక లాభాల పెట్టుబడి ఆఫర్లను నమ్మి రిటైర్మెంట్ అనంతరం వచ్చిన డబ్బులను పెట్టుబడి పెట్టి మోసపోవద్దని సూచించారు. నకిలీ ట్రేడింగ్ యాప్‌లు, డిజిటల్ అరెస్ట్,కేవైసీ, పెన్షన్,పీఎఫ్, లాటరీలు,లోన్లు, ఉద్యోగాల పేరుతో జరిగే మోసాల పట్ల అప్రమత్తంగా ఉండాలని సూచించారు. అపరిచిత వ్యక్తులు ఇచ్చే పెట్టుబడి సూచనలను నమ్మవద్దని,అధిక లాభాల పేరుతో వెంటనే పెట్టుబడి పెట్టాలని ఒత్తిడి చేసే వారిని నమ్మరాదని తెలిపారు. సైబర్ మోసానికి గురైన వెంటనే ఆలస్యం చేయకుండా 1930కు కాల్ చేసి ఫిర్యాదు చేయాలని సూచించారు. అనంతరం రిటైర్డ్ ఉద్యోగులతో సైబర్ నేరాల పట్ల ఎల్లప్పుడూ అప్రమత్తంగా ఉంటామని ప్రతిజ్ఞ చేయించారు. ఈ కార్యక్రమంలో ఎస్ఐలు మారుతి, క్రాంతి,హెచ్‌డీఎఫ్‌సీ క్లస్టర్ హెడ్ జోస్ స్టీఫెన్,బ్యాంకు అధికారులు,సైబర్ క్రైమ్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# గన్నేరువరం పోలీస్ స్టేషన్‌లో అడిషనల్ డీసీపీ వార్షిక తనిఖీ



**గన్నేరువరం, ఆగస్టు 11 (జనంసాక్షి):**వార్షిక తనిఖీలో భాగంగా గన్నేరువరం పోలీస్ స్టేషన్‌ను కరీంనగర్ కమిషనరేట్ అడిషనల్ డీసీపీ వెంకటరమణ ఆకస్మికంగా సందర్శించారు. ఈ సందర్భంగా స్టేషన్‌లోని రికార్డులను క్షుణ్ణంగా పరిశీలించారు. స్టేషన్ పరిసర ప్రాంతాలు, రికార్డుల నిర్వహణ తీరును పరిశీలించి, అక్కడి సిబ్బందితో మాట్లాడి పలు సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో అడిషనల్ డీసీపీతో పాటు కరీంనగర్ రూరల్ డివిజన్ ఏసీపీ విజయ్‌కుమార్, తిమ్మాపూర్ సీఐ బొల్లం రమేష్, ఎస్సై జి. నరేందర్ రెడ్డి, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.



## పెరుమాండ్ల మల్లయ్య నేత్రాలు సజీవం



**చొప్పదండి, ఆగస్టు 11 (జనంసాక్షి) :** చొప్పదండి మండలం కొలిమికుంట గ్రామం కు చెందిన పెరుమాండ్ల మల్లయ్య(59) గుండెపోటుతో మరణించగా అమరగోని సతీష్ , లయన్స్ క్లబ్ ఆఫ్ చొప్పదండి కొల్లూరి జితేందర్ నేత్రదానం పై అవగాహన కల్పించి మృతుడి కుమారుడు పెరుమాండ్ల రవి అనుమతితో పెరుమాండ్ల మల్లయ్య(59) నేత్రాలను వాసన్ ఐ కేర్ ఆసుపత్రి టెక్నీషియన్ చందు ద్వారా సేకరించి హైదరాబాదులోని వాసన్ ఐ కేర్ ఐ బ్యాంక్ కు తరలించారు. ఈ సందర్భంగా చొప్పదండి లయన్స్ క్లబ్ మార్కెటింగ్ చైర్మన్, జిల్లా జాయింట్ క్యాబినెట్ కోశాధికారి కొల్లూరి జితేందర్ మాట్లాడుతూ వీరి నేత్రాలు ఇద్దరు అంధులకు చూపును ఇస్తాయని, వారు భౌతికంగా మరణించినా వారి నేత్రాలు సజీవంగా ఉంటాయని అన్నారు. ఈ సందర్భంగా పుట్టెడు దుఖంలోనూ ఉదారత చాటిన మృతుడి కుటుంబ సభ్యులను అభినందిస్తూ కృతజ్ఞతలు తెలిపి నేత్రదాత స్వర్గీయ పెరుమాండ్ల మల్లయ్య గారికి శ్రద్ధాంజలి ఘటించారు.ఈ కార్యక్రమంలో అమరగోని సతీష్, సంపత్, హరీష్, శ్రీకాంత్, లయన్స్ క్లబ్ ఆఫ్ చొప్పదండి మార్కెటింగ్ చైర్మన్, జిల్లా జాయింట్ క్యాబినెట్ కోశాధికారి కొల్లూరి జితేందర్ తదితరులు పాల్గొన్నారు.

## నూతన పెన్షన్లకు దరఖాస్తులో బీడీ కార్మికుల ఆప్షన్ లేనందున బీడీ కార్మికుల ధర్నా



**మల్లాపూర్, ఆగస్టు 11(జనంసాక్షి) :** ప్రభుత్వం నూతనంగా ప్రవేశపెట్టిన పెన్షన్లలో భాగంగా అప్లికేషన్ ఫామ్ లో బీడీ కార్మికులకు సంబంధించిన చేయూత ఆప్షన్ లేకపోవడం చాలా బాధాకరమని మల్లాపూర్ మండలానికి చెందిన బీడీ కార్మికులు మంగళవారం మల్లాపూర్ మండల కేంద్రంలోని భరతమాత కూడలి వద్ద ధర్నా నిర్వహించారు. సంఘటన స్థలానికి స్థానిక ఎస్సై అనిల్ కుమార్ యాదవ్, ఎంపీడీవో అల్వాల శ్రీకాంత్ ధర్నా వద్దకు వచ్చి మహిళలతో మాట్లాడి ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తాం బీడీ పెన్షన్ బీడీ కార్మికులకు వచ్చే విధంగా నివేదిక పంపుతామని తెలిపారు అందరితో మహిళలు ధర్మ విరమింప చేశారు, అనంతరం బీడీ కార్మికులు ఎంపీడీవోకి వినతి పత్రం అందజేశారు

# ఎడపల్లి లో ఘనంగా హర్ ఘర్ తిరంగా అభియాన్ ర్యాలీ



**ఎడపల్లి, ఆగస్టు 11 ( జనంసాక్షి ) :** భారతదేశ ప్రధాన మంత్రి నరేంద్ర మోడీ పిలుపు మేరకు హర్ ఘర్ తిరంగా అభియాన్ లో భాగంగా మంగళవారం నిర్వహించిన ర్యాలీ విజయవంతమయింది. ఎడపల్లి సర్పంచ్, బిజెపి జిల్లా ఉపాధ్యక్షులు తిరంగా అభియాన్ జిల్లా కన్వీనర్ కందగట్ల రాంచందర్ నేతృత్వంలో భారీ ర్యాలీ నిర్వహించారు. ఈ ర్యాలిలో బిజెపి బోధన్ నియోజకవర్గం ఇంచార్జి వడ్డి మోహన్ రెడ్డి, జిల్లా సోషల్ మీడియా కార్యదర్శి కూరెళ్ల శ్రీధర్, జిల్లా నాయకులు మల్లెపూల శ్రీనివాస్, యువ మోర్చా అధ్యక్షులు మోస్రా సాయి కుమార్, వార్డు సభ్యులు శంకర్, విఠల్, అరుణ్, మండల ప్రధాన కార్యదర్శి సాయి వేణు, బూతు అధ్యక్షులు కంజరి ప్రదీప్ కుమార్, కట్కశీ సుధాకర్, చింతల శేఖర్, మీసాల రాఘవేందర్, ఒడ్డపల్లి శ్రీను, శ్రీధర్, శక్తి కేంద్ర ఇంచార్జిలు,సీనియర్ నాయకులు కేసరి శంకర్ గౌడ్ వెంకటేష్, గెంటే నిశాంత్, ద్యాకం సాయరెడ్డి, కట్కశీ శంకర్, పెరుగు రాజు, అనిరుద్ గౌడ్, మార సాయి, కంజరి అభినవ్ పాల్గొన్నారు.

# ముగిసిన బోధన్ మార్కెట్ కమిటీ పదవీ కాలం



**బోధన్, ఆగస్టు 11 ( జనంసాక్షి ) :** బోధన్ వ్యవసాయ మార్కెట్ కమిటీ పదవీ కాలం మంగళవారంతో ముగిసింది. ఈ మేరకు నేడు మార్కెట్ కమిటీ చైర్మన్ చీల శంకర్, వైస్ చైర్మన్ వసంత్ రెడ్డి, పాలకవర్గ సభ్యులను వ్యవసాయ మార్కెట్ కమిటీ కార్యదర్శి భారతి, అధికారులు ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమానికి కాంగ్రెస్ పార్టీ బోధన్ పట్టణ అధ్యక్షులు అంకు దాము, కాంగ్రెస్ నాయకులు తూము శరత్ రెడ్డి, కల్దుర్కి సహకార సంఘం చైర్మన్ గింజుపల్లి శరత్, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు నరేందర్ రెడ్డి, జిల్లా కాంగ్రెస్ పార్టీ కార్యదర్శి అల్లే రమేష్, పాషా, కౌన్సిలర్లు హాజరయ్యారు. ఈ సందర్భంగా మార్కెట్ కమిటీ చైర్మన్ చీల శంకర్ మాట్లాడుతూ, గత రెండు సంవత్సరాలుగా రైతులతో మమేకమై మార్కెట్ కమిటీ అభివృద్ధి కోసం సహకరించిన మార్కెట్ కమిటీ అధికారులు, వ్యవసాయ శాఖ అధికారులతో పాటు రైతుల సహకారం ఎప్పటికీ మరువనని ఆయన స్పష్టం చేశారు. బోధన్ ఎమ్మెల్యే ప్రభుత్వ సలహాదారు సుదర్శన్ రెడ్డి ఆదేశాలతో బోధన్ మార్కెట్ పరిధిలోని మండలంలోని గ్రామాల అభివృద్ధి కోసం నాతోపాటు వైస్ చైర్మన్, కమిటీ సభ్యులు కృషి చేయడం జరిగిందని ప్రతి ఒక్కరికి పేరుపేరునా ధన్యవాదాలు తెలిపారు.



## కేజీబీవీలో వసతులు పరిశీలించిన సర్పంచ్ చిట్యాల లక్ష్మణ్

**మల్లాపూర్, ఆగస్టు11 (జనం సాక్షి) :** మండల కేంద్రం లోని కస్తూర్బా బాలిక విద్యాలయం ను మల్లాపూర్ మేజర్ గ్రామ పంచాయతీ సర్పంచ్ చిట్యాల లక్ష్మణ్ మంగళవారం సందర్శించారు.కే.జీ.బీ.వీ స్పెషల్ ఆఫీసర్ జె. శ్రీలత పాఠశాల లో ప్లే గ్రౌండ్ లో పిల్లలకు ఆటలు ఆడుకునేందుకు మైదానం భారీ వర్షాలకు కోత కు గురి అయింది కావున మైదానం ను మొరం తో లెవెలింగ్ చేయించండి అని సర్పంచ్ తో అన్నారు.దీనికి సర్పంచ్ సానుకూలంగా స్పందించారు.ఈ కార్యక్రమం లో కార్యదర్శి గూరుడు శ్రీనివాస్,వార్డు సభ్యులు ముష్కరి రమేష్, సామాజిక కార్యకర్త ఏనుగు వెంకట్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## పెగడాపల్లి ప్రభుత్వ పాఠశాలలో బోనాలు



**బోధన్ (జనంసాక్షి) :** బోధన్ మండలం పెగడాపల్లి గ్రామ ప్రభుత్వ జిల్లా పరిషత్ పాఠశాలలో మంగళవారం బోనాల వేడుకలను విద్యార్థుల సమక్షంలో ఉపాధ్యాయులు ఘనంగా నిర్వహించారు. ఈ మేరకు పాఠశాలలోనే బోనాలను ఎంతో అందంగా అలంకరించి విద్యార్థులు తమ నెత్తిన ఎత్తుకొని అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. పాడి పంటలు సమృద్ధిగా పండాలని వర్షాలు బాగా కురవాలని రాష్ట్రం దేశం సుభిక్షంగా ఉండాలని విద్యార్థులు, ఉపాధ్యాయులు అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో విద్యార్థులతో పాటు ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## మల్లాపూర్ గ్రామపంచాయతీలో పింఛన్ దరఖాస్తుల స్వీకరణ



**మల్లాపూర్, ఆగస్టు11 (జనంసాక్షి)** తెలంగాణ ప్రభుత్వం ప్రవేశపెట్టిన చేయూత పింఛన్ పథకం కింద అర్హులైన లబ్ధిదారుల నుండి మల్లాపూర్ మేజర్ గ్రామపంచాయతీ కార్యాలయంలో దరఖాస్తులు స్వీకరించడం జరిగింది.ఈ సందర్భంగా మేజర్ గ్రామ పంచాయతీ సర్పంచ్ చిట్యాల లక్ష్మణ్ మాట్లాడుతూ పింఛన్లకు సంబంధించిన అర్హతలు,అవసరమైన పత్రాలు మరియు ఇతర సందేహాలపై గ్రామ ప్రజలకు పూర్తి వివరాలు తెలియజేసి దరఖాస్తుల సేకరణ చేపట్టినాము,మల్లాపూర్ గ్రామం లో అర్హులైన ప్రతి ఒక్కరూ ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకొని ప్రభుత్వ సంక్షేమ పథకాల ప్రయోజనాలను పొందాలని కోరారు. ఈ కార్యక్రమం లో కార్యదర్శి గూరుడు శ్రీనివాస్, వార్డు సభ్యులు ముష్కరి రమేష్, అరికుప్పల చిన్న రాజం, సామాజిక కార్యకర్త ఏనుగు వెంకట్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## ప్రార్థన సమయంలో చరవాణిలో ప్రధానోపాధ్యాయుడు

### ప్రార్థన కంటే చరవాణి ముఖ్యం కావొచ్చు



**కోరుట్ల ఆగస్టు 11 (జనంసాక్షి) :** రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ప్రాథమిక విద్యను భావిస్తూ, రాష్ట్ర ముఖ్యమంత్రి సైతం ప్రాథమిక విద్యే ప్రధాన లక్ష్యంగా విద్యాశాఖ మంత్రి భాధ్యతలు నిర్వహిస్తు అన్నీ రంగాల్లో దేశంలోనే మన ప్రాథమిక విద్య అగ్రస్థానంలో ఉండాలని భావించి ముందుకు తీసుకెళ్తు క్రమశిక్షణ ప్రథమ లక్ష్యంగా ఉండాలని చాలా వేదికల మీద గౌరవ రాష్ట్ర ముఖ్యమంత్రి చెబుతున్నప్పటికి మండలం కేంద్రం అయినా గడి ప్రాథమిక పాఠశాలలో ప్రధానోపాధ్యాయులు ప్రార్థన సమయంలో చరవానే నాకు ప్రాధాన్యం అన్నట్లు వేదికను వదిలేసి సమీపదూరంలో మాట్లాడుతూ విధులను నిర్లక్ష్యం చేస్తూ కనిపించారు. లివెంటనే జనంసాక్షి చరవాణిలో సంప్రదించగా మా జిల్లా సెక్టోరియాల్ అధికారి, మండల విద్యాధికారి కాన్ఫరెన్స్ లో ఉన్నారని వారితోనే మాట్లాడుతున్నాని బుకాయించారు. తదుపరి మండల విద్యాధికారి ని సంప్రదించగా నేనే ఏ సమయంలో ఫోన్ కాల్ లో ఉన్నానని అన్నారు. ప్రార్థన సమయంలో ఉపాధ్యాయులకు,విద్యార్థులకు క్రమశిక్షణలో మార్గదర్శకత్వం చేసే ప్రధానోపాధ్యాయులే ఈవిధంగా నిబంధనలు ఉల్లంగిస్తే విద్యార్థుల నడవడిక ఎలా ఉంటుందోనని తల్లిదండ్రులు అభిప్రాయ పడుతున్నారు.

## కృష్ణవేణి హైస్కూల్ లో బాలల హక్కులపై అవగాహన




**రుద్రంగి, ఆగస్టు 11 (జనం సాక్షి) :** రుద్రంగి మండలం కృష్ణవేణి హైస్కూల్ లో మహిళా శిశు సంక్షేమ శాఖ,జిల్లా మహిళా సాధికారత కేంద్రం ఆధ్వర్యంలో బాలల హక్కులు, పి. ఓ. ఎస్. హెచ్ చట్టం-2013 పై అవగాహన సదస్సు నిర్వహించారు. జెండర్ స్పెషలిస్ట్ త్రివేణి మాట్లాడుతూ... బాలలకు జీవించే,రక్షణ,భాగస్వామ్య,అభివృద్ధి హక్కులు ఉన్నాయని,హక్కులకు భంగం కలిగితే 1098 కి ఫోన్ చేయాలని సూచించారు. సేఫ్ టచ్,అన్ సేఫ్ టచ్, ఆన్ లైన్ మోసాలపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఐ సి పి ఎస్ ఆఫీసర్ గగన్,సఖి కేస్ వర్కర్ కవిత, ప్రధానోపాధ్యాయులు హరినాథ్ రాజు, ఉపాధ్యాయులు,విద్యార్థులు పాల్గొన్నారు.

## పాఠశాలలను ఆకస్మికంగా తనిఖీ చేసిన ఎమ్మెల్యే డాక్టర్ కల్వకుంట్ల సంజయ్

**మల్లాపూర్ ఆగస్టు11 (జనంసాక్షి)** మండలం లోని మొగిలిపేట గ్రామాల్లోని ప్రభుత్వ పాఠశాలలను కోరుట్ల ఎమ్మెల్యే డాక్టర్ కల్వకుంట్ల సంజయ్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా పాఠశాలల్లో విద్యార్థులకు అందుతున్న విద్యాబోధన, మౌలిక వసతులు, తాగునీరు, పారిశుధ్యం, తరగతి గదుల పరిస్థితిని ఎమ్మెల్యే పరిశీలించారు. విద్యార్థులతో మాట్లాడి వారి చదువు, పాఠశాలలో అందుతున్న సౌకర్యాలపై వివరాలు అడిగి తెలుసుకున్నారు. మొగిలిపేట పాఠశాలలో మధ్యాహ్న భోజనాన్ని ఎమ్మెల్యే సంజయ్ పరిశీలించారు. భోజనం నాణ్యత, పరిశుభ్రత, వంట సామగ్రి తదితర అంశాలను పరిశీలించారు. విద్యార్థులకు నాణ్యమైన, రుచికరమైన, పరిశుభ్రమైన భోజనం అందించాలని సిబ్బందికి సూచించారు.

# చేయూత పింఛన్ల దరఖాస్తులకు ఆగస్టు 31 వరకు గడువు

## పెద్దపల్లి మున్సిపల్ చైర్మన్ నూగిళ్ల మల్లయ్య

**పెద్దపల్లి,ఆగస్టు 11(జనంసాక్షి) :** రాష్ట్ర ప్రభుత్వం అందిస్తున్న చేయూత పింఛన్లకు అర్హులైన వారు దరఖాస్తు చేసుకునేందుకు ఆగస్టు 31వ తేదీ వరకు గడువు విధించినట్లు పురపాలక సంఘం చైర్మన్, కమిషనర్ ఒక ప్రకటనలో తెలిపారు. అర్హులైన వారు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. చేయూత పింఛన్లకు సంబంధించి వివిధ కేటగిరీలకు ప్రభుత్వం నిర్దేశించిన అర్హతలు, అవసరమైన పత్రాలను అధికారులు వెల్లడించారు. వితంతు పింఛన్ కోసం 18 సంవత్సరాలు మరియు అంతకంటే ఎక్కువ వయస్సు కలిగి ఉండాలి. భర్త మరణ ధృవీకరణ పత్రం (డెత్ సర్టిఫికేట్) సమర్పించాలన్నారు. ఒంటరి మహిళల పింఛన్కోసం భర్త వదిలివేసిన మహిళలు 18 సంవత్సరాలు మరియు అంతకంటే ఎక్కువ వయస్సు కలిగి ఉండాలి. విడాకుల పత్రం, కోర్టు ఉత్తర్వులు లేదా విడిపోయినట్లు తెలిపే పత్రంతో పాటు కనీసం ఒక సంవత్సరం విడిపోయి ఉన్నట్లు నిర్ధారణ, తహసీల్దార్ నిర్వహించిన స్థానిక విచారణ నివేదిక సమర్పించాలన్నారు. అవివాహిత మహిళలకు గ్రామీణ ప్రాంతాల్లో 30 సంవత్సరాలు, పట్టణ ప్రాంతాల్లో 35 సంవత్సరాలు మరియు అంతకంటే ఎక్కువ వయస్సు కలిగి ఉండి పంచాయతీ కార్యదర్శి/వార్డు ఆఫీసర్ ధృవీకరణ పత్రం జతచేయాలన్నారు. దివ్యాంగుల పింఛన్ కోసం దరఖాస్తుదారు వయస్సుతో సంబంధం లేకుండా 40 శాతం వైకల్యం కలిగి ఉండాలి. విజువల్ లోపం ఉన్నవారికి 51 శాతం వైకల్యం ఉంటే సరిపోతుందన్నారు. యూడీఐడీ లేదా సదరం సర్టిఫికేట్ సమర్పించాలన్నారు. కల్లు గీత కార్మికులు పింఛన్ కోసం 50 సంవత్సరాలు మరియు అంతకంటే ఎక్కువ వయస్సు వుండటంతో పాటు అబ్కారీ (ప్రొహిబిషన్ ఎ ఎక్సైజ్) శాఖ జారీ చేసిన కల్లు గీత కార్మిక సహకార సంఘ సభ్యత్వ ధృవీకరణ పత్రం అవసరమన్నారు. చేనేత కార్మికులు పింఛన్ కోసమా 50 సంవత్సరాలు మరియు అంతకంటే ఎక్కువ వయస్సు కలిగి ఉండాలి. చేనేత, జౌళి శాఖ జారీ చేసిన ధృవీకరణ పత్రం సమర్పించాలని తెలిపారు. ఫైలేరియా (బోదకాలు) బాధితులు వయస్సుతో సంబంధం లేకుండా గ్రేడ్–××, గ్రేడ్–××× ఫైలేరియాసిస్ బాధితులు అర్హులని,జిల్లా వైద్య మరియు ఆరోగ్య శాఖాధికారి ద్వారా నమోదు, ధృవీకరణ పత్రం జాతచేయాలన్నారు. డయాలసిస్ బాధితులు పింఛన్ కోసం వయస్సుతో సంబంధం లేకుండా ప్రస్తుతం డయాలసిస్ చికిత్స పొందుతున్న వారు అర్హులని, ఆరోగ్యశ్రీ హెల్త్కేర్ ట్రస్ట్ ద్వారా నమోదు, ధృవీకరణ పత్రం సమర్పించాలని తెలిపారు. అర్హత కలిగిన వారు నిర్ణీత గడువులోగా అవసరమైన పత్రాలతో దరఖాస్తు చేసుకోవాలని పెద్దపల్లి పురపాలక సంఘం చైర్మన్ మరియు కమిషనర్ కోరారు.

# పెద్దపల్లిలో ఘనంగా 'హర్ ఘర్ తిరంగా'



**పెద్దపల్లి,ఆగస్టు 11(జనంసాక్షి) :** భారతీయ జనతా పార్టీ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న 'హర్ ఘర్ తిరంగా' కార్యక్రమంలో భాగంగా సోమవారం పెద్దపల్లి పట్టణంలోని జెండా చౌరస్తా వద్ద జాతీయ జెండా ఆవిష్కరణ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. బీజేపీ పట్టణ అధ్యక్షులు పెంజర్ల రాకేష్ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో రిటైర్డ్ ఆర్మీ అధికారి మేకల విజయ్ కుమార్ పాల్గొని జాతీయ జెండాను ఆవిష్కరించారు.అనంతరం బీజేపీ నాయకులు, కార్యకర్తలు జాతీయ జెండాలను చేతబూని 'భారత్ మాతాకీ జై', 'వందేమాతరం' నినాదాలు చేయడంతో పెద్దపల్లి పట్టణం దేశభక్తి నినాదాలతో మార్మోగింది.ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ ప్రతి ఇంటిపై జాతీయ జెండాను ఎగురవేసేలా ప్రజలను ప్రోత్సహించడమే 'హర్ ఘర్ తిరంగా' కార్యక్రమం ప్రధాన ఉద్దేశమన్నారు.దేశభక్తి, జాతీయ సమైక్యతను మరింత బలోపేతం చేసేందుకు ప్రతి ఒక్కరూ ఈ కార్యక్రమంలో భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో బీజేపీ జిల్లా కార్యదర్శి శివంగర్ సతీష్, తిరంగా యాత్ర కో–కన్వీనర్ కావేటి రాజగోపాల్,బెజ్జంకి దిలీప్,గుడ్ల సతీష్,మహంత కృష్ణ, బొడ్డుపల్లి కుమార్, అఖిల్, మధుకర్,హరీష్, పోగుల రాజు,మంతెన కృష్ణ,మహేష్,శ్రావణ్, రమేష్,శివసాయి,సురేష్ తదితర బీజేపీ నాయకులు పాల్గొన్నారు.

# యువతకు ఉపాధి కల్పించడంలో ప్రత్యేక దృష్టి

## ఏడాదిలో 2,872 మందికి ఉద్యోగాలు : జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష



**పెద్దపల్లి,ఆగస్టు 11(జనంసాక్షి) :** పెద్దపల్లి జిల్లాలో యువతకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పించడంపై జిల్లా యంత్రాంగం ప్రత్యేక దృష్టి సారిస్తోందని , గత ఒక సంవత్సరం కాలంలో వివిధ ప్రభుత్వ శాఖలు, శిక్షణా సంస్థలు, ప్రైవేట్ సంస్థల సమన్వయంతో జిల్లాలో మొత్తం 2,872 మంది యువతకు ఉద్యోగ అవకాశాలు కల్పించినట్లు లిజిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్షలి తెలిపారు.యువతలోని నైపుణ్యాలను గుర్తించి, వారికి తగిన శిక్షణ అందించడంతో పాటు, ఉద్యోగ అవకాశాలకు అనుసంధానం చేసేలా జిల్లా యంత్రాంగం చర్యలు చేపడుతోందని తెలిపారు. జిల్లా ఉపాధి కార్యాలయం, టాస్క్ ఇండియన్ ఆర్మీ–అగ్నివీర్, టాటా లైఫ్ సైన్సెస్ (గ్రాన్యూల్స్ ఐటీఐ కళాశాల తదితర సంస్థల ద్వారా పెద్ద సంఖ్యలో యువతకు ఉద్యోగ అవకాశాలు లభించాయని పేర్కొన్నారు.జిల్లా ఉపాధి కార్యాలయం ఆధ్వర్యంలో 904 మందికి, టాస్క్ ద్వారా 979 మందికి, గో ష్టై ద్వారా 17 మందికి, ఇండియన్ ఆర్మీ–అగ్నివీర్ నియామకాల ద్వారా 23 మందికి, టాటా లైఫ్ సైన్సెస్ (గ్రాన్యూల్స్) ద్వారా 25 మందికి,ఐటీఐ కళాశాల ద్వారా 924 మందికి ఉద్యోగ అవకాశాలు కల్పించినట్లు కలెక్టర్ తెలిపారు. వివిధ సంస్థల సమన్వయంతో మొత్తం 2,872 మంది యువత ఉద్యోగాలు పొందడం జిల్లాలో ఉపాధి కల్పనకు చేపడుతున్న చర్యలకు నిదర్శనమని అన్నారు.యువతకు కేవలం శిక్షణ అందించడం మాత్రమే కాకుండా, శిక్షణ అనంతరం వారికి ఉద్యోగాలు లభించేలా సంబంధిత సంస్థలతో సమన్వయం చేయాలని అధికారులను ఆదేశించినట్లు కలెక్టర్ తెలిపారు. ఉద్యోగ మేళాలు, క్యాంపస్ నియామకాలు, నైపుణ్య శిక్షణ కార్యక్రమాలు, వివిధ నియామక ప్రక్రియల ద్వారా మరిన్ని అవకాశాలను యువతకు అందుబాటులోకి తీసుకురావాలని సూచించారు.యువతలోని ప్రతిభను గుర్తించి సరైన అవకాశాలు కల్పించేందుకు ప్రత్యేక కార్యాచరణ జిల్లాలోని యువత విద్యార్హతలు, నైపుణ్యాలు, ఆసక్తులకు అనుగుణంగా ఉద్యోగ అవకాశాలను పొందేలా అవసరమైన మార్గదర్శకత్వం అందించాలని కలెక్టర్ సూచించారు. ప్రైవేట్ పరిశ్రమలు, సంస్థలు, శిక్షణా కేంద్రాలతో సమన్వయం పెంచి జిల్లాలోనే ఎక్కువ సంఖ్యలో ఉద్యోగ అవకాశాలు కల్పించేలా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు.యువత తమ నైపుణ్యాలను నిరంతరం మెరుగుపరుచుకుంటూ అందుబాటులో ఉన్న ఉద్యోగ, శిక్షణ అవకాశాలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ప్రభుత్వ శాఖలు, విద్యా సంస్థలు, శిక్షణా సంస్థలు, పరిశ్రమలు సమన్వయంతో పనిచేస్తే మరింత పెద్ద సంఖ్యలో యువతకు ఉపాధి అవకాశాలు కల్పించవచ్చని తెలిపారు.జిల్లాలోని ప్రతి యువకుడు, యువతి తమ విద్యార్హతలకు, నైపుణ్యాలకు తగిన ఉద్యోగాన్ని పొందేలా జిల్లా యంత్రాంగం కట్టుబడి పనిచేస్తుందని స్పష్టం చేశారు. రాబోయే రోజుల్లో ఉపాధి కల్పన కార్యక్రమాలను మరింత విస్తృతం చేసి, జిల్లాలోని యువతకు మెరుగైన ఉద్యోగ అవకాశాలు అందించేందుకు ప్రత్యేక కార్యాచరణ కొనసాగిస్తామని తెలిపారు.యువతకు ఉద్యోగ అవకాశాలు కల్పించడంలో చొరవ చూపిన జిల్లా ఉపాధి కార్యాలయం, (టాస్క్ )ఐటీఐ కళాశాల, వివిధ నియామక సంస్థలు, శిక్షణా సంస్థలు మరియు సంబంధిత అధికారులను జిల్లా కలెక్టర్ అభినందించారు.

# వర్షానికి కూలిపోయిన ఇంటిని పరిశీలన



**ఎల్లారెడ్డిపేట, ఆగస్టు 11, (జనంసాక్షి) :** ఎల్లారెడ్డిపేట మండల కేంద్రానికి చెందిన సద్ది సర్వారెడ్డి ఇంటి పై కప్పు సోమవారం కురిసిన వర్షానికి కూలిపోయింది ఈ విషయం తెలుసుకున్న కాంగ్రెస్ పార్టీ నాయకులు మంగళవారం వెళ్లి ఆ ఇంటిని పరిశీలించారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ పార్టీ మండల మాజీ అధ్యక్షులు సద్ది లక్ష్మారెడ్డి, తహశీల్దార్ సుజాతతో చెరవాణిలో మాట్లాడారు ఇంటి పై కప్పు కూలిపోయి నష్టపోయిన సర్వారెడ్డికి ప్రభుత్వం నుండి సహాయం అందచేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో పట్టణ అధ్యక్షులు చెన్ని బాబు, జిల్లా కాంగ్రెస్ పార్టీ నాయకులు వంగ గిరిధర్రెడ్డి, ఏఎంసి వైస్ ప్రెసిడెంట్ గుండాడి రాంరెడ్డి, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు రాములు, బండారి బాల్రెడ్డి, గంట బుచ్చాగౌడ్, ద్యాగం లక్ష్మినారాయణ, మిర్యాలకర్ చందు, పందిర్ల శ్రీనివాస్గౌడ్, గంట వెంకటేష్గౌడ్, బింగి మల్లేశం యాదవ్లు పాల్గొన్నారు.

# రామగుండం నియోజకవర్గంలోని ఆలయాల పనులు చేయాలి

## దేవాదాయ ధర్మదాయ శాఖ అడిషనల్ కమిషనర్ను కోరిన ఎమ్మెల్యే రాజ్ఠాకూర్



**గోదావరిఖని, జనంసాక్షి :** రామగుండం నియోజక వర్గంలో చేపట్టిన ఆలయాల అభివృద్ధి, నిర్మాణ పనులను వేగవంతం చేసి త్వరగా పూర్తి చేయాలని రామగుండం ఎమ్మెల్యే ఎంఎస్ రాజ్ఠాకూర్ కోరారు.ఈ మేరకు మంగళవారం దేవాదాయ ధర్మదాయ శాఖ అడిషనల్ కమిషనర్ను ఎమ్మెల్యే రాజ్ఠాకూర్ మర్యాదపూర్వకంగా కలిసి నియోజకవర్గంలోని వివిధ ఆలయాలకు సంబంధించిన అభివృద్ధి పనులపై చర్చించారు.ఆలయాల అభివృద్ధి పనుల్లో ఎలాంటి జాప్యం లేకుండా సంబంధిత అధికారులతో సమన్వయం చేసుకుంటూ పనులను వేగంగా పూర్తి చేయాలని కోరారు.రామగుండం నియోజకవర్గంలోని ఆలయాల అభివృద్ధికి ప్రభుత్వం నుంచి అవసరమైన సహకారం అందేలా చర్యలు తీసుకోవాలని ఎమ్మెల్యే విజ్ఞప్తి చేశారు.భక్తులకు మెరుగైన సౌకర్యాలు కల్పించడంతో పాటు ఆలయాల అభివృద్ధికి ప్రాధాన్యత ఇస్తున్నట్లు తెలిపారు.ఈ సమావేశంలో రామగుండం కార్పొరేషన్ అధ్యక్షులు బొంతల రాజేష్, కార్పొరేటర్లు ఎండీ ముస్తాఫా,గట్ల రమేష్ పాల్గొన్నారు.

# లయన్స్ క్లబ్ ఆఫ్ బెల్లంపల్లి విజన్ కేర్ ఆధ్వర్యంలో ఉచిత కంటి వైద్య శిబిరం



**ఎలిగేడు,ఆగస్టు 11(జనంసాక్షి) :** పెద్దపల్లి జిల్లా ఎలిగేడు మండలంలోని దూళికట్ట గ్రామపంచాయతీ ఆవరణలో లయన్స్ క్లబ్ ఆఫ్ బెల్లంపల్లి విజన్ కేర్ సెంటర్ ఉచిత కంటి వైద్య శిబిరం నిర్వహించారు.ఈ శిబిరాన్ని గ్రామ సర్పంచ్ కొమురయ్య, 11వ వార్డు సభ్యులు శ్రీనివాస్ సహకారంతో నిర్వహించారు. ఇట్టి శిబిరంలో సుమారు 120 మంది గ్రామస్తులకు ఉచిత కంటి పరీక్షలు నిర్వహించారు. పరీక్షల అనంతరం 20 మంది కంటి శుక్లాలు (క్యాటరాక్ట్) సమస్యతో బాధపడుతున్నట్లు ఆప్టోమెట్రిస్ట్ రమేష్ తెలిపారు. వారికి తదుపరి చికిత్స, శస్త్రచికిత్స కోసం అవసరమైన సూచనలు అందజేశారు.ఈ కార్యక్రమంలో గ్రామ పెద్దలు,యువత,ప్రజలు పాల్గొని శిబిరాన్ని విజయవంతం చేశారు.



# పెన్షన్ దరఖాస్తులు స్వీకరిస్తున్న కౌన్సిలర్ గాజుల రాజమల్లయ్య

**సుల్తానాబాద్,ఆగస్టు 11(జనంసాక్షి) :** పెద్దపల్లి శాసనసభ్యులు, ప్రభుత్వ విప్ చింతకుంట విజయరమణారావు ఆశీస్సులతో మున్సిపల్ పరిధిలో అర్హులైన నిరుపేదల నుండి పెన్షన్ దరఖాస్తుల స్వీకరణ ప్రక్రియ కొనసాగుతోంది. ఇందులో భాగంగా సుల్తానాబాద్ మున్సిపాలిటీ 2వ వార్డు కౌన్సిలర్ గాజుల రాజమల్లయ్య మున్సిపల్ సిబ్బందితో కలిసి నేరుగా అర్హులైన లబ్ధిదారుల ఇళ్లకు వెళ్లి దరఖాస్తు ఫారాలను నింపి సేకరిస్తున్నారు.ప్రజల వద్దకే వచ్చి దరఖాస్తులు ప్రక్రియ చేస్తుండటంతో స్థానికులు సంతోషం వ్యక్తం చేశారు.అర్హులైన ప్రతీ ఒక్కరికీ కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వం పెన్షన్ మంజూరు చేయడం జరుగుతుందని గాజుల రాజమల్లయ్య తెలిపారు.ఈ కార్యక్రమంలో నాయకులు సంపత్,శ్రీకాంత్,గాజుల హరీష్,తదితరులు ఉన్నారు.



## కార్పొరేషన్‌లో అభివృద్ధి పనులు

**ఎక్కడ వేసిన గొంగడి అక్కడే అన్న చందంగా ఉన్నాయి**

**కార్పొరేషన్ కమిషనర్‌కు వినతీపత్రం ఇచ్చిన సమ్మయ్య యాదవ్**

**గోదావరిఖని (జనంసాక్షి) :** రామగుండం కార్పొరేషన్‌లో ప్రజా సమస్యలు ఎక్కడ వేసిన గొంగడి అక్కడే ఉన్నట్టు..ప్రతి డివిజన్‌లో ఎక్కడి సమస్యలు అక్కడే ఉన్నాయని రామగుండం కార్పొరేషన్ కమిషనర్ అరుణశ్రీకి మంగళవారం వినతీపత్రాన్ని అందించారు.అనేక సమస్యలతో ప్రజలు ఇబ్బంది పడుతున్న సందర్బంగా రామగుండం కార్పొరేషన్ మేయర్,కమిషనర్‌కు,ప్రజల ఆమోదంతో గెలిచిన కార్పొరేటర్‌లుగా ప్రజాసమస్యలు తెలపడానికి, గెలిచి ఆరు నెలలు గడుస్తున్నా రెండో కౌన్సిల్ సమావేశం నిర్వహించకపోవటం దేనికి సాంకేతమని వినతీపత్రంలో పేర్కొన్నారు.తక్షణమే కౌన్సిల్ సమావేశం ఏర్పాటు చేయాలని,దాని ద్వారా ప్రజా సమస్యలకు పరిష్కార వేదికగా ఉంటుందని, గత కౌన్సిల్ సమావేశంలో కార్పొరేటర్‌లు చెప్పిన సమస్యలు ఎంత వరకు పరిష్కారమయ్యాయని టీఆర్ఎస్ పార్టీ ఫ్లోర్ లీడర్ మేకల సమ్మయ్య యాదవ్ కోరారు.వినతీపత్రం ఇచ్చిన వారిలో 6వ డివిజన్ కార్పొరేటర్ తోకల శ్యామని-రమేష్ పాల్గొన్నారు.



## దుర్గానగర్ కాలనీలో గోరింటాకు మహోత్సవ కార్యక్రమం

**గోదావరిఖని, జనంసాక్షి :** స్థానిక దుర్గానగర్ కాలనీలో ఆషాడ మాస గోరింటాకు వేడుకలు మహిళా సోదరీ మణులందరూ కలిసి అట్టహాసంగా సంబురం అంబురాన్ని అంటేలా ఆనందోత్సాహాల మధ్య నిర్వహించారు. ముఖ్య అతిథిగా రామగుండం ఎమ్మెల్యే రాజ్‌ఠాకూర్ సతీమణి, సేవా సమితి అధ్యక్షురాలు మనాలిసింగ్ రాజ్‌ఠాకూర్,47వ డివిజన్ కార్పొరేటర్ దాసరి సాంబమూర్తి పాల్గొన్నారు. ఈ వేడుకలకు ముఖ్యఅతిథిగా మనాలిసింగ్ రాజ్‌ఠాకూర్ జ్యోతి ప్రజ్వలన చేసి మహిళ సోదరీమణులకు గోరింటాకు పెట్టి అభినందించారు.ఈ సందర్బంగా మనాలిసింగ్ మాట్లాడుతూ ఆషాడ మాసంలో మహిళలు గోరింటాకు పెట్టుకోవడం మన సంస్కృతిలో భాగమని,ఇలాంటి వేడుక లను దుర్గానగర్ మహిళలందరూ ఒకచోట చేరి అందరి సమక్షంలో జరుపుకోవడం అభినందనీయం అన్నారు.

## స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల ఏర్పాట్లపై.. సాంస్కృతిక కార్యక్రమాలు..పాఠశాలల కరస్పాండెంట్లతో సమీక్షా



**గోదావరిఖని, జనంసాక్షి :** సింగరేణి రామగుండం ఏరియా-1లో ఈ నెల 15వ తేదీన నిర్వహించ నున్న 79వ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించేందుకు పాఠశాలల కరస్పాండెంట్లతో పర్సనల్ మేనేజర్ రెడ్డిమల్ల తిరుపతి సమీక్ష సమావేశాన్ని నిర్వహించారు.జీఎం కార్యాలయ ప్రాంగణంలో నిర్వహించనున్న వేడుకలను పురస్కరించుకుని ఆర్‌జీ-1ఏరియా పర్సనల్ మేనేజర్ రెడ్డిమల్ల తిరుపతి అధ్యక్షతన సోమవారం జీఎం కార్యాలయ సమావేశ మందిరంలో వివిధ పాఠశాలల కరస్పాండెంట్లతో సమీక్షా సమావేశం ఏర్పాటు చేశారు.ఈ సందర్భంగా పర్సనల్ మేనేజర్ మాట్లాడుతూ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలను అత్యంత వైభవంగా,అంగరంగ వైభవంగా నిర్వహించేందుకు స్వాతంత్ర్య సమరయోధుల త్యాగాలను స్మరించుకుంటూ, సాంస్కృతిక కార్యక్రమాలను ప్రదర్శించేలా కార్యక్రమాలను రూపొందించాలని తెలిపారు. కార్యక్రమానికి హాజరయ్యే సింగరేణి ఉద్యోగులు, వారి కుటుంబ సభ్యులు, ఉత్తమ ఉద్యోగులు, విద్యార్థులు, ఉపాధ్యాయులు, ఇతర అతిథులకు ఆకట్టుకునే విధంగా సాంస్కృతిక కార్యక్రమాల నిర్వహణ, వేదిక ఏర్పాట్లు తదితర అంశాలపై సమావేశంలో చర్చించి, సంబంధిత పాఠశాలల ప్రతినిధులకు పలు సూచనలు చేశారు. స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా నిర్వహించే కార్యక్రమాలు ప్రతి ఒక్కరిలో దేశభక్తి, జాతీయ సమైక్యత, బాధ్యతాయుత పౌరస్ఫూర్తిని పెంపొందించేలా ఉండాలని పర్సనల్ మేనేజర్ తెలిపారు. ఈ సమీక్షా సమావేశంలో సీనియర్ పీఓ హన్మంతరావు, సేవా కార్యదర్శి బీనాసింగ్, సేవా జాయింట్ సెక్రటరీ పెరుమాళ్ల రజిత, సేవా సమితి కో-ఆర్డినేటర్స్ మేడి తిరుపతి, సిద్దిక్, వివిధ సింగరేణి, ప్రైవేట్ పాఠశాలల కరస్పాండెంట్లు, తదితరులు పాల్గొన్నారు.

## పెన్షన్ దరఖాస్తులు స్వీకరిస్తున్న కౌన్సిలర్ గాజుల రాజమల్లయ్య

**సుల్తానాబాద్,ఆగస్టు 11(జనంసాక్షి) :** పెద్దపల్లి శాసనసభ్యులు, ప్రభుత్వ విప్ చింతకుంట విజయరమణారావు ఆశీస్సులతో మున్సిపల్ పరిధిలో అర్హులైన నిరుపేదల నుండి పెన్షన్ దరఖాస్తుల స్వీకరణ ప్రక్రియ కొనసాగుతోంది. ఇందులో భాగంగా సుల్తానాబాద్ మున్సిపాలిటీ 2వ వార్డు కౌన్సిలర్ గాజుల రాజమల్లయ్య మున్సిపల్ సిబ్బందితో కలిసి నేరుగా అర్హులైన లబ్ధిదారుల ఇళ్లకు వెళ్లి దరఖాస్తు ఫారాలను నింపి సేకరిస్తున్నారు.ప్రజల వద్దకే వచ్చి దరఖాస్తులు ప్రక్రియ చేస్తుండటంతో స్థానికులు సంతోషం వ్యక్తం చేశారు.అర్హులైన ప్రతీ ఒక్కరికీ కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వం పెన్షన్ మంజూరు చేయడం జరుగుతుందని గాజుల రాజమల్లయ్య తెలిపారు.ఈ కార్యక్రమంలో నాయకులు సంపత్,శ్రీకాంత్,గాజుల హరీష్,తదితరులు ఉన్నారు.





## అభివృద్ధిలో వెనుకబడ్డ గంగానగర్‌పై ప్రత్యేక దృష్టి సారిస్తాం

**రామగుండం నగర మేయర్ మహంకాళి స్వామి**

**గోదావరిఖని, జనంసాక్షి :** అభివృద్ధిలో వెనుకబడి ఉన్న గంగానగర్‌పై ప్రత్యేక దృష్టి సారిస్తామని రామగుండం నగర మేయర్ మహంకాళి స్వామి అన్నారు.వార్డు సందర్శన కార్యక్రమంలో భాగంగా మంగళ వారం ఐదవ డివిజన్ గంగానగర్‌లో పర్యటించారు.ఈ సందర్బంగా శానిటేషన్ స్పెషల్ డ్రైవ్ చేపట్టి నాలాల్లో పూడిక తొలగింపు, పిచ్చిచెట్లు,రాకపోకలకు అడ్డుగా ఉన్న చెట్లకొమ్మల తొలగింపు పనులను నిర్వహించారు.పనుల పర్యవేక్షణ అనంతరం మేయర్ మాట్లాడుతూ నగరానికి చివరన ఉండడం వలన డ్రైనేజి వ్యవస్థ అస్తవ్యస్థశీగా తయారైందని అన్నారు. స్థానికులు చెత్తను తీసుకువచ్చి బయట పార ఫోస్తుండడంతో పరిసరాలు అపరిశుభ్రంగా తయారయ్యాయని అన్నారు. రోడ్లు, కాలువలు కూడా అక్రమించి నిర్మాణాలు చేసుకోవడంతో రాకపోకలకు, మురుగు నీటి ప్రవాహానికి ఆటంకం కలుగుతున్నదని అన్నారు.ఈ పరిస్థితులన్నీ చక్కదిద్ది గంగానగర్ అభివృద్ధి చేయడానికి ఎంఎల్ఏ సహకారంతో రూ. 5 కోట్లు మంజూరు చేయించి పనులు చేపట్టడం జరుగుతుందని అన్నారు. స్థానిక కార్పొరేటర్ మాటూరి సత్యప్రసాద్, నగరపాలక సంస్థ అసిస్టెంట్ కమీషనర్ సంపత్ కుమార్,టిపిఎస్ నవీన్, జూనియర్ అసిస్టెంట్ నాయిని చంద్రారెడ్డి,వర్క్ ఇన్స్పెక్టర్ ఆంజనేయులు, సానిటరీ సూపర్ వైజర్ సోమేశ్, వాటర్ సప్లయ్ సూపర్ వైజర్ శశికుమార్,ఆర్‌పీలు తదితరులు పాల్గొన్నారు.



## జైలు బరో నిరసన కార్యక్రమం

**పెద్దపల్లి,ఆగస్టు 11(జనంసాక్షి) :** పెద్దపల్లి జిల్లా కేంద్రం లో సోమవారం కేంద్ర ప్రభుత్వ ప్రజా వ్యతిరేక కార్మిక వ్యతిరేక విధానాలకు నిరసనగా దేశ వ్యాప్త కార్మిక ఉద్యోగ రైతు సంఘాల పిలుపుమేరకు జిల్లా కేంద్రంలో జరిగిన జైల్ బరో కార్యక్రమంలో(సిఐటియు, ఐఎఫ్టియు ) అనుబంధ సంఘాలు. ఏఐకేఎంఎస్, పంచాయితీ రాజ్, అంగన్వాడి, ఆశ, మున్సిపల్. సంఘాలకు చెందిన కార్మికులు ప్రజలు జైలు బరో కార్యక్రమంలో పాల్గొన్నారు. వ్యవసాయ మార్కెట్ నుండి ప్రదర్శనగా బయలుదేరి బస్టాండ్ దగ్గర గల అంబేద్కర్ విగ్రహం దగ్గర జాతీయ రహదారిపై రాస్తా రోకోరాకో నిర్వహించడం జరిగింది.పోలీసుల వచ్చి రాస్తారోకో చేదరగొట్టి సిఐటియు కు చెందిన ముత్యం రావు, రవి లను అరెస్టు చేశారు.మీడియాను కార్మికులను ఉద్దేశించి ఐఎఫ్టియు రాష్ట్ర అధ్యక్షుడు ఐ కృష్ణ, సిఐటియు పెద్దపల్లి జిల్లా అధ్యక్షులు ముత్యం రావు,కామ్రేడ్ విజయలక్ష్మి, రవి మాట్లాడుతూ కేంద్రంలో అధికారంలో ఉన్న కేంద్ర బిజెపి ప్రభుత్వం దేశంలోని పరిశ్రమలను ప్రైవేటుపరం చేస్తూ 29 కార్మిక చట్టాలను నాలుగు లేబర్ కోడ్స్ గా తీసుకువచ్చి కార్పొరేట్ అనుకూల విధానాలు మోడీ ప్రభుత్వం అమలు చేస్తుందని రైతు వ్యవసాయాన్ని దెబ్బతీయడానికి విద్యుత్ చట్టం, విబి జి రాశీ చట్టం, భారత్ అమెరికా వాణిజ్య ఒప్పందం లాంటివి తీసుకువచ్చాడని దేశంలో ధరలు నిరుద్యోగం పెరిగిపోతున్న యనిఅన్ని వర్గాల ప్రజల న్యాయమైన డిమాండ్లపై ఆందోళన చేస్తుంటే తీవ్రమైన అణిచివేతకు పాల్పడుతున్నరని అన్నారు.ఈ కార్యక్రమం లో పెద్దపల్లి జిల్లా ప్రధాన కార్యదర్శి బి అశోక్,నాయకుడు ఐ.రాజయ్య,జిల్లా ప్రధాన కార్యదర్శి ఆరు మూల తిరుపతి,గ్రామపంచాయతీ వర్కర్స్ యూనియన్ నాయకుడు,లింగమూర్తి, మోటార్ వర్కర్స్ యూనియన్ నాయకుడు బాలకృష్ణ,తదితరులు పాల్గొన్నారు.

## ఎంఎస్‌ఎంఈడీ సవరణతో ఎంఎస్‌ఎంఈలకు మరింత ప్రయోజనం

**జిల్లా పరిశ్రమల మేనేజర్ ఏ. కీర్తి కాంత్**

**పెద్దపల్లి,ఆగస్టు 11(జనంసాక్షి) :** సూక్ష్మ, చిన్న మధ్య తరహా పరిశ్రమలు వ్యాపార నిర్వహణను సులభతరం చేయడం, సకాలంలో చెల్లింపులు పొందేలా చేయడం, వ్యాపార వివాదాలను వేగంగా పరిష్కరించడం, పరిశ్రమల అభివృద్ధికి అనుకూల వాతావరణాన్ని కల్పించే ఉద్దేశంతో భారత ప్రభుత్వం లిలిఎంఎస్‌ఎంఈడీ సవరణ బిల్లు--2026లిలిను ప్రవేశపెట్టిందని జిల్లా పరిశ్రమల మేనేజర్ ఏ. కీర్తి కాంత్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు.ఎంఎస్‌ఎంఈడీ సవరణ బిల్లు 2026 ద్వారా సూక్ష్మ, చిన్న మరియు మధ్య తరహా పరిశ్రమలకు పలు ముఖ్యమైన ప్రయోజనాలు కల్పించనున్నట్లు ఆయన పేర్కొన్నారు. పెట్టుబడి, వార్షిక వ్యాపార లావాదేవీల ఆధారంగా పరిశ్రమల వర్గీకరణతో పాటు, లిలిఉద్యమ్ నమోదులిలిను ఉచితంగా, స్వచ్ఛందంగా ఆన్‌లైన్‌లో చేసుకునే అవకాశం ఉంటుందని తెలిపారు. మధ్యవర్తిత్వ తీర్పును రద్దు చేయాలని దాఖలైన కేసు లిలిఆరు నెలలకు మించి పెండింగ్‌లో ఉన్న సందర్భంలో, తీర్పు ద్వారా నిర్ణయించిన మొత్తంలో కనీసం యాభై శాతం చెల్లించాలని న్యాయస్థానాలు ఆదేశించే అవకాశంలిలి ఉంటుందని జిల్లా పరిశ్రమల మేనేజర్ తెలిపారు.కేంద్ర ప్రభుత్వ రంగ సంస్థలు వాణిజ్య బిల్లుల ఎలక్ట్రానిక్ రాయితీ వ్యవస్థ ద్వారా చెల్లింపులను నిర్వహించే విధానం ప్రతిపాదించబడిందని ఏ. కీర్తి కాంత్ తెలిపారు. దీని ద్వారా పరిశ్రమలకు అవసరమైన నిర్వహణ మూలధనం అందుబాటులో ఉండటంతో పాటు, వ్యాపార కార్యకలాపాలను నిరంతరాయంగా కొనసాగించేందుకు అవకాశం ఉంటుందని తెలిపారులిఒకటి కంటే ఎక్కువ సూక్ష్మ మరియు చిన్న పరిశ్రమల సదుపాయ మండళ్లనులిలి ఏర్పాటు చేసుకునే అవకాశం కల్పించనున్నట్లు తెలిపారు. పెద్దపల్లి జిల్లాలోని సూక్ష్మ మరియు చిన్న తరహా పరిశ్రమలకు కొనుగోలుదారుల నుంచి చెల్లింపులు ఆలస్యమవుతున్నట్లయితే, సమస్య పరిష్కారం కోసం లిసూక్ష్మ , చిన్న పరిశ్రమల సదుపాయ మండలి, కరీంనగర్‌లిను ఆశ్రయించవచ్చని జిల్లా పరిశ్రమల మేనేజర్ ఏ. కీర్తి కాంత్ సూచించారు.

## బైక్ మెకానిక్ లకు అండగా ఉంటా

**మున్సిపల్ చైర్మన్ నూగిల్ల మల్లయ్య**



**పెద్దపల్లి, ఆగస్టు 11 (జనంసాక్షి) :** పెద్దపల్లి పట్టణంలోని సిరి ఫంక్షన్ హాల్ లో మంగళవారం టూ వీలర్ మెకానిక్‌లకు మూడురోజుల పాటు నిర్వహించిన శిక్షణ ముగింపు కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా మున్సిపల్ చైర్మన్ నూగిల్ల మల్లయ్య హాజరయ్యారు ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పెద్దపల్లి పట్టణంలోని బైక్ మెకానిక్ లకు ఎల్లవేళలా అండగా ఉంటానని వారి సమస్యలు పరిష్కరిస్తానని, ఎటువంటి ఆపద సమయంలోనైనా వారికి అండగా ఉంటానని హామీ ఇచ్చారు. అలాగే తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ విప్ ఎమ్మెల్యే విజ్జన్న సహకారంతో బైక్ మెకానిక్ సంక్షేమ సంఘం భవనానికి కృషి చేస్తానని అన్నారు .గత 25 సంవత్సరాలుగా బైక్ మెకానిక్ సంఘం గౌరవ అధ్యక్షునిగా నన్ను అభిమానిస్తున్న బైక్ మెకానిక్ సోదరులందరికీ ధన్యవాదాలు తెలియజేశారు.ఈ సందర్భంగా మున్సిపల్ చైర్మన్ ని శాలువాలతో సన్మానించారు.